



TS-11-0036701

# నేటి చర్చ
జాతీయ తెలుగు దిన పత్రిక



విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చన్యూస్ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

నేటి చర్చ జాతీయ తెలుగు దిన పత్రిక

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155



తెలంగాణ , సంపుటి : 01 సంచిక : 51 మంగళవారం, అక్టోబర్ 20, 2026 , పేజీలు - 12 వెల : 2/-





పాఠకులకు ప్రకటనకర్తలు శ్రేయోభిలాషులకు

విజయ దశమి శుభాకాంక్షలు

నేడు దసరా పర్వదినం సందర్భంగా పత్రికా కార్యాలయానికి సెలవు. కావున రేపు ( 21 అక్టోబర్ బుధవారం ) సంచిక వెలువడదు .. (పునర్దర్శనం గురువారం ) ఎడిటర్


## పారిశ్రామికాభివృద్ధికి
# శాంతిభద్రతలే కీలకం!

● ప్రపంచ పెట్టుబడులకు తెలంగాణ గమ్యస్థానం కావాలి ● ఫ్యూచర్ సిటీలో పోలీస్ కమిషనరేట్ ప్రారంభం ● రూ.200 కోట్లతో ఎన్ఐయూఎం నూతన ప్రాంగణం ● డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్



**హైదరాబాద్,అక్టోబర్ 19 :** రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి శాంతిభద్రతల పరిరక్షణే ప్రధానమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ విధానాల్లో చిత్తశుద్ధి, ఆధునిక పోలీసు వ్యవస్థ సమర్థంగా పనిచేస్తేనే ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులను ఆకర్షించగలమని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికతో పనిచేస్తోందని పేర్కొన్నారు.సోమవారం భారత్ ఫ్యూచర్ సిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రధాన కార్యాలయ భవన సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయూఎం) నూతన ప్రాంగణ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, వేగవంతమైన పోలీసు సేవలు అందించడమే కమిషనరేట్ ప్రధాన లక్ష్యమని వివరించారు. **ఆధునిక సాంకేతికతతో పోలీసు సేవలు**కృత్రిమ మేధ, సైబర్ నేరాల దర్యాప్తు, డిజిటల్ ఆధారాల విశ్లేషణ, మహిళల భద్రత వంటి అంశాలపై మిగతా2లో...



## ఎల్‌నినోపై అప్రమత్తంగా
# ఉండాలి!

● తాగునీరు, విద్యుత్ కొరత రాకుండా ముందస్తు ప్రణాళికలు ● అక్రమ నీటి మోటార్ల తొలగింపు.. తాగునీటి అవసరాలకే బోరుబావుల అనుమతులు

**హైదరాబాద్,అక్టోబర్ 19 :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీరు, విద్యుత్ కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. జిల్లాలతో పాటు మండల స్థాయిలోనూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంపై సోమవారం సీనియర్ మిగతా2లో...

## ఎల్‌నినో పరిస్థితులపై అధ్యయనానికి
# కేబినెట్ ఉపసంఘం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన కమిటీ ఏర్పాటు




## భూ వివాదాల శాశ్వత
# పరిష్కారమే లక్ష్యం

- రైతుల హక్కుల పరిరక్షణకు భూభారతి.. అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు



**హైదరాబాద్,అక్టోబర్ 19 :** రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. భూభారతి, రెవెన్యూ శాఖ అధికారులతో సోమవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. రైతుల భూమి హక్కులకు భద్రత కల్పించడంతోపాటు రెవెన్యూ సేవల్లో పారదర్శకత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.భూభారతి చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి పట్టాదారు పాస్‌పుస్తకాల జారీ, భూముల పునఃసర్వే, పెండింగ్ భూ సమస్యల పరిష్కారంపై మంత్రి సమీక్షించారు. అర్హులైన రైతులకు భూమి హక్కు పత్రాలు అందేలా మిగతా2లో...

## యెమెన్‌లో హౌతీల క్షిపణి
# దాడి.. 53 మంది మృతి!

● సైనిక శిక్షణ శిబిరంపై మూడు బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపాటు ● 200 మందికి పైగా గాయాలు



**షబ్వా,అక్టోబర్ 19 :** యెమెన్‌లో మరోసారి హింస చెలరేగింది. ప్రభుత్వ భద్రతా దళాల శిక్షణ శిబిరంపై హౌతీ తిరుగుబాటు దారులు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేశారు. ఈ ఘటనలో కనీసం 53 మంది మృతి చెందగా, మరో 200 మందికి పైగా గాయపడ్డారు. దక్షిణ యెమెన్‌లోని షబ్వా ప్రావిన్స్‌లో సోమవారం ఈ దాడి జరిగినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. సైనిక శిక్షణ జరుగుతున్న సమయంలో మూడు క్షిపణులు శిబిరాన్ని తాకినట్లు సమాచారం. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. హౌతీ ప్రతినిధులు దాడికి బాధ్యత ప్రకటిస్తూ, ఆ శిబిరంలో సౌదీ అధికారుల ఆధ్వర్యంలోని బలగాలు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, దీనికి సంబంధించి వారు ఆధారాలు వెల్లడించలేదు. మిగతా2లో...



## అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక దసరా

- ప్రజలందరికీ విజయదశమి

**హైదరాబాద్,అక్టోబర్ 19 :** అధర్మంపై ధర్మం, చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీకగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, మిగతా2లో...

# ఉక్రెయిన్‌తో ఘర్షణకు చెక్!

- ట్రంప్, జిన్‌పింగ్‌లతో త్రైపాక్షిక భేటీకి పుతిన్ ప్రతిపాదన
- నవంబర్‌లో శిఖరాగ్ర సమావేశానికి యత్నాలు




## కనకదుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి చెందాలి

- ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు




# కేసీఆర్ ఫామ్‌హౌస్ వివాదం..

ముగ్గురు కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ నోటీసులు!

కొండపోచమ్మ సాగర్ నీటి మళ్లింపుపై ఆరోపణలు

సామాజిక మాధ్యమాల్లో పోస్టులు తొలగించాలని డిమాండ్







## సింగరేణి అధికారులకు వేతనాల పెంపు..
# దసరా కానుక!

- 1,800 మంది అధికారులకు ప్రయోజనం.. అక్టోబర్ జీతాల నుంచే అమలు

# ఉక్రెయిన్‌తో ఘర్షణకు చెక్!

**మాస్కో,అక్టోబర్ 19 :** రష్యాఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే దిశగా కీలక పరిణామం చోటుచేసుకున్నట్లు అంతర్జాతీయ కథనాలు వెల్లడించా యి. ఉక్రెయిన్‌తో వివాదంపై చర్చించి, రష్యాకు అనుకూలమైన శాంతి ఒప్పందం కుదుర్చుకునే లక్ష్యంతో వచ్చే నెలలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌లతో త్రైపాక్షిక సమావేశం నిర్వహించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతిపాదించినట్లు సమాచారం.అక్టోబర్ 9న ట్రంప్‌తో జరిగిన ఫోన్ సంభాషణలో పుతిన్ ఈ ఆలోచనను ప్రస్తావించినట్లు నివేదిక పేర్కొంది. నవంబర్ 18, 19 తేదీల్లో చైనాలోని షెన్‌జెన్‌లో జరగనున్న ఆసియాపసిఫిక్ ఆర్థిక సహకార సదస్సు సందర్భంగా ఈ చర్చలు నిర్వహించే అవకాశాన్ని రష్యా పరిశీలిస్తున్నట్లు తెలిపింది. అయితే, ఈ సమావేశానికి ట్రంప్ ఇంకా అధికారికంగా అంగీకరించలేదు. చైనా కూడా ట్రంప్ పాల్గొంటే అభ్యంతరం ఉండబోదని సంకేతాలు ఇచ్చినట్లు సమాచారం.ఈ ప్రతిపాదనపై ఉక్రెయిన్, అమెరికాయూరోపియన్ దేశాల మిత్రపక్షాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా శాంతి చర్చల్లో ఉక్రెయిన్‌కు ప్రాతినిధ్యం లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.మరోవైపు, రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు జరుగుతున్న చర్చల్లో గణనీయమైన పురోగతి సాధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు.

అయితే, త్రైపాక్షిక సమావేశం ఖరారైందా, దాని ద్వారా ఒప్పందం కుదురుతుందా అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

# కేసీఆర్ ఫామ్‌హౌస్ వివాదం..

**హైదరాబాద్, 19 :** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఫామ్‌హౌస్‌కు కొండపోచమ్మ సాగర్ నీటిని మళ్లించారంటూ వస్తున్న ఆరోపణలపై రాజకీయ వివాదం ముదురుతోంది. ఈ వ్యవహారంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణలకు బీఆర్ఎస్ న్యాయ విభాగం నోటీసులు జారీ చేసింది.బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, న్యాయ విభాగం ఇన్‌ఛార్జి సోమ భరత్ కుమార్ ఈ నోటీసులు పంపించినట్లు సమాచారం. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశంపై ఇప్పటికే ఓ తెలుగు దినపత్రిక యాజ మాన్యానికి, సంపాదకుడికి నోటీసులు పంపించినట్లు పార్టీ వెల్లడించింది.సంబంధిత ఆరోపణలతో తమ సామాజిక మాధ్యమ ఖాతాల్లో చేసిన పోస్టులను వెంటనే, బేషరతుగా తొలగించాలని, ఆరోపణలను ఉపసంహరించుకోవాలని ముగ్గురు కాంగ్రెస్ నేతలను బీఆర్ఎస్ న్యాయ విభాగం కోరింది. సాగునీటి ప్రాజెక్టులపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించింది.నోటీసులకు స్పందించక పోతే పరువునష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేసింది. కాంగ్రెస్ నేతల స్పందన, ఆరోపణలకు సంబంధించిన వాస్తవాలు తదుపరి పరిణామాల్లో కీలకం కానున్నాయి.

# పారిశ్రామికాభివృద్ధికి శాంతిభద్రతలే కీలకం!

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని సీఎం తెలిపారు. ఇప్పటికే 210 మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బంది కృత్రిమ మేధ వినియోగంపై ప్రత్యేక శిక్షణ పూర్తి చేశారని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ విస్తరణకు అనుగుణంగా పోలీసు జోన్లు, డివిజన్లు, మహిళా పోలీస్ స్టేషన్లు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

**రూ.200 కోట్లతో ఎన్ఐయూఎం ప్రాంగణం**భారత్ ఫ్యూచర్ సిటీలో 20 ఎకరాల స్థలంలో సుమారు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో ఎన్ఐయూఎం నూతన ప్రాంగణాన్ని నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. 2028 జూన్ 2 నాటికి నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పర్యావరణహితంగా, నెట్‌జీరో లక్ష్యంతో ఈ ప్రాంగణాన్ని రూపొందించనున్నారు. భవనాలపై సౌర విద్యుత్ వ్యవస్థలు, సౌరశక్తితో నీటిని వేడి చేసే సదుపాయాలు, ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేయనున్నారు.**పట్టణ పాలనపై పరిశోధనలు.. అధికారులకు శిక్షణ**ఈ ప్రాంగణంలో పట్టణ పాలన, ఆర్థిక వనరుల సమీకరణ, మౌలిక సదుపాయాలు, పట్టణ రవాణా, సామాజిక-ఆర్థిక అభివృద్ధి, వాతావరణ మార్పుల ప్రభావాల తగ్గింపు తదితర అంశాలపై పరిశోధనలు చేపట్టనున్నారు. కొత్త ఆలోచనలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కేంద్రాన్ని, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చేందుకు సామర్థ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. శిక్షణార్థులు, పరిశోధకులు, నిపుణుల కోసం 122 నివాస గదులను నిర్మించనున్నారు. ఎన్ఐయూఎం ఇప్పటివరకు 6,000 మందికి పైగా ప్రజాప్రతినిధులు, అధికారులకు శిక్షణ అందించిందని సీఎం తెలిపారు. పట్టణాల అభివృద్ధి, ప్రణాళికల రూపకల్పన, ఘన వ్యర్థాల నిర్వహణ వంటి రంగాల్లో ఈ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.**గ్లోబల్ సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు** డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' ఏర్పాట్లను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు హాజరయ్యేలా అంతర్జాతీయ స్థాయి ఏర్పాట్లు చేయాలని సూచించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, నిర్దేశిత గడువుకు ముందే పనులు పూర్తి చేయాలని, నవంబర్ నెలాఖరులోగా సమ్మిట్ ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పించడం, పారిశ్రామికాభివృద్ధికి భరోసా ఇవ్వడం, ఆధునిక పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడులకు ఆకర్షణీయ కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం వివరించారు. ఈ కార్యక్రమాల్లో పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోపై అప్రమత్తంగా ఉండాలి!

(మొదటి పేజీ తరువాయి)

ఐఏఎస్ అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో పరిస్థితులను సమీక్షించారు.రాష్ట్రంలో వ్యవసాయ, గృహ అవసరాలకు విద్యుత్ సరఫరా కొనసాగుతోందని, పరిశ్రమలకు విద్యుత్ కోతలు విధించడం లేదని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ఆదేశించారు. అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. యాదాద్రి థర్మల్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.**అక్రమ నీటి మోటార్లపై ప్రత్యేక నిఘా**స్థానిక నీటి వనరుల నుంచి అక్రమంగా మోటార్లతో నీటిని తోడటం వల్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక భారం పడుతోందని అధికారులు వివరించారు. హైదరాబాద్‌లో నల్లాలకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడే వారిపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. హైడ్రా తదితర సంస్థల సహకారంతో అక్రమ మోటార్లను తొలగిస్తున్నట్లు వెల్లడించారు.**తాగునీటి అవసరాలకే బోరుబావుల తవ్వకాలు** హైదరాబాద్‌లో నిబంధనల ప్రకారం తాగునీటి అవసరాలకే కొత్త బోరుబావుల తవ్వకాలకు అనుమతించాలని అధికారులు స్పష్టం చేశారు. నిర్మాణ పనుల కోసం కొత్త బోర్లు వేయడానికి అనుమతులు ఇవ్వవద్దని సూచించారు. ఇప్పటికే ఉన్న బోరుబావులను తాగునీటి అవసరాల కోసం మరింత లోతుగా తవ్వేందుకు నిబంధనల మేరకు అనుమతిస్తామని తెలిపారు. నవంబర్ 1 నుంచి నిర్మాణ పనులకు శుద్ధి చేసిన మురుగునీటిని ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు.రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాల మట్టం తగ్గుతున్న నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇతర జిల్లాల్లోనూ తాగునీరు, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఎల్‌నినో ప్రభావంపై త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించడంతో పాటు మంత్రివర్గ ఉపసంఘం సమావేశం కూడా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ప్రాణహిత జలాల కోసం కవిత పోరుబాట!

**నవంబర్ నెలాఖరులోగా కాఫర్**

**డ్యాం పనులు ప్రారంభించాలి**

**కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కవిత డిమాండ్**

**కన్నెపల్లి,అక్టోబర్ 19:** రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద కాఫర్ డ్యాం నిర్మాణ పనులను నవంబర్ నెలాఖరులోగా ప్రారంభించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాణహిత నది నీటిని రైతులకు ఉపయోగపడేలా మళ్లించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన కవిత, అందుబాటులో ఉన్న గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేడిగడ్డ బ్యారేజీ సమస్యను సాకుగా చూపకుండా రైతులకు సాగునీరు అందించే ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని అన్నారు. సుమారు



రూ.25 కోట్లతో నెలన్నర రోజుల్లో కాఫర్ డ్యాం పనులు పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు.ప్రభుత్వం నవంబర్ నెలాఖరులోగా పనులు ప్రారంభించకపోతే కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఆందోళన చేపడతామని కవిత హెచ్చరించారు. రైతుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా పరిష్కరించి, సాగునీటి కొరత నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## యెమెన్‌లో హౌతీల క్షిపణి దాడి.. 53 మంది మృతి!

(మొదటి పేజీ తరువాయి)

యెమెన్‌లో ప్రభుత్వ బలగాలు, హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఇటీవలి కాలంలో ఘర్షణలు తీవ్రతరమయ్యాయి. గతంలో కొనసాగిన కాల్పుల విరమణ ఒప్పందం విచ్ఛిన్నం కావడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. తాజా దాడితో ప్రాంతంలో భద్రతాపరమైన ఆందోళనలు పెరిగాయి.

## అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక దసరా

(మొదటి పేజీ తరువాయి)

సంప్రదాయాల్లో దసరా పండుగకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు.దసరా పండుగ ధైర్యం, ధర్మం, సత్యం, ఐక్యత, ఆత్మవిశ్వాసం వంటి విలువలను నేర్పుతుందని సీఎం పేర్కొన్నారు. అహంకారం, అసూయ, ద్వేషం, అన్యాయం వంటి ప్రతికూల భావాలను విడిచిపెట్టి ప్రేమ, కరుణ, సోదరభావం, మానవత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.మహిషాసురుడిపై దుర్గాదేవి సాధించిన విజయం, రావణుడిపై శ్రీరాముడి గెలుపు ధర్మానికి ఉన్న శక్తిని చాటిచెబుతాయని తెలిపారు. తెలంగాణలో జమ్మిచెట్టును పూజించడం, జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు అందించి ఆశీర్వాదాలు తీసుకోవడం వంటి సంప్రదాయాలు ప్రకృతిని గౌరవించడం, పెద్దలను ఆదరించడం నేర్పుతాయని పేర్కొన్నారు.ఈ విజయదశమి ప్రతి ఇంటా ఆనందం, సంతోషం, ఐశ్వర్యం నింపాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అభివృద్ధి, విజయాలు కలగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## కనకదుర్గమ్మ ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి చెందాలి

**- ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు**

**అమరావతి,అక్టోబర్19 :**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ ప్రజలందరికీ గొప్ప స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. సోమవారం తన సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా పండుగ సందేశాన్ని అందించారు.రైతుల శ్రమకు తగిన ఫలితం అందించడం, మహిళలకు సాధికారత కల్పించడం, యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి జగన్మాత ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దీవెనలతో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకున్నారు.రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ముఖ్యమంత్రి మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ప్రజలందరికీ మరోసారి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎల్‌నినో పరిస్థితులపై అధ్యయనానికి కేబినెట్ ఉపసంఘం

**హైదరాబాద్:అక్టోబర్ 19 :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను సమీక్షించి, వాటిని ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలను సూచించేందుకు తెలంగాణ ప్రభుత్వం కేబినెట్ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షత వహించనున్నారు. సభ్యులుగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దాసరి అనసూయ (సీతక్క), వాకిటి శ్రీహరి వ్యవహరించనున్నారు.ఎల్‌నినో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, తాగునీటి కొరత, వ్యవసాయం, విద్యుత్ సరఫరాపై ప్రభావాన్ని అంచనా వేయడం, ముందస్తు చర్యలపై ప్రభుత్వానికి సిఫారసులు చేయడం ఈ కమిటీ ప్రధాన బాధ్యత. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## సింగరేణి అధికారులకు వేతనాల పెంపు.. దసరా కానుక!




**హైదరాబాద్,అక్టోబర్ 19:** సింగరేణి అధికారులకు ప్రభుత్వం దసరా కానుక అందించింది. కోల్‌ఇండియా తరహాలో ఎగ్జిక్యూటివ్ క్యాడర్ ఈ-1 నుంచి ఈ-7 వరకు పనిచేస్తున్న సుమారు 1,800 మంది అధికారులకు వేతన సవరణ చేస్తూ సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణి పర్సనల్ డైరెక్టర్ గౌతమ్ పోట్రు సోమవారం ఈ ఉత్తర్వులు విడుదల చేశా రు. సవరించిన ప్రాథమిక వేతనాలు 2017 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చినట్లు పరిగణిం చనుండగా, ఆర్థిక ప్రయోజనాలు 2026 సెప్టెంబర్ 25 నుంచి వర్తించనున్నాయి. పెరిగిన వేతనా లను అక్టోబర్ నెల జీతాల నుంచే చెల్లించనున్నారు. కొత్త వేతన స్కేల్ ప్రకారం ఈ-1 క్యాడర్ ప్రాథ మిక వేతనం రూ.40 వేల నుంచి రూ.60 వేలకు, ఈ-2 క్యాడర్ రూ.50 వేల నుంచి రూ.70 వేలకు, ఈ-3 క్యాడర్ రూ.60 వేల నుంచి రూ.80 వేలకు, ఈ-4 క్యాడర్ రూ.70 వేల నుంచి రూ.90 వేలకు, ఈ-5 క్యాడర్ రూ.80 వేల నుంచి రూ.లక్షకు, ఈ-6 క్యాడర్ రూ.90 వేల నుంచి రూ.1.20 లక్షలకు పెరగనుంది. ఈ నిర్ణయంతో సింగరేణి అధికారులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది.

## భూ వివాదాల శాశ్వత పరిష్కారమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భూముల వివరాల్లో ఉన్న లోపాలను సరిచేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.భూముల పునఃసర్వే ద్వారా దీర్ఘకాలంగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నారాయణపురం గ్రామంలో 906 మంది రైతులకు 1,600 ఎకరాలకు పైగా భూమిపై హక్కులు కల్పించినట్లు వివరించారు. సూర్యాపేట జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల పరిధిలో 15 గ్రామాలకు చెందిన 2,400 మంది రైతులకు 3,450 ఎకరాలకు సంబంధించి భూమి హక్కు పత్రాలు అందించినట్లు తెలిపారు.రైతులకు బ్యాంకు రుణాలు, రైతు భరోసా వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా భూమి రికార్డులను క్రమబద్ధీకరించాలని అధికారులకు సూచించారు. భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయకుండా, అర్హులైన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు.

## చిన్న వయసులోనే ఎముకల బలంపై శ్రద్ధ.. ఆస్టియోపోరోసిస్ ముప్పును తగ్గించుకోండిలా..

ఆస్టియోపోరోసిస్ (ఎముకల సాంద్రత తగ్గి బలహీనపడే వ్యాధి) కారణంగా ఎముకలు బలాన్ని కోల్పోయి, చిన్న దెబ్బలకే విరిగిపోయే ప్రమాదం పెరుగుతుంది. వయసు పెరిగే కొద్దీ ఈ సమస్య వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా మెనోపాజ్ దశ దాటిన మహిళల్లో ఈ ముప్పు అధికంగా కనిపిస్తుంది. అయితే వృద్ధాప్యంలో ఉన్న పురుషులు, కొన్ని ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు కూడా ఈ వ్యాధి బారిన పడతారు. ఎక్కువ కాలం మంచానికే పరిమితం కావడం, శారీరక శ్రమ లేకపోవడం, దీర్ఘకాలిక అనారోగ్యాలు, సరైన పోషకాహారం తీసుకోకపోవడం వంటి అంశాలు ఎముకల సాంద్రత తగ్గడానికి కారణమవుతాయి.చిన్న వయసులో జాగ్రత్తలు అవసరం..వృద్ధాప్యంలో ఎముకల ఆరోగ్యం ఎలా ఉంటుందనేది చిన్న వయసులో మనం తీసుకునే జాగ్రత్తలపైనా ఆధారపడి ఉంటుంది. సాధారణంగా 20 నుంచి 30 ఏళ్ల మధ్య శరీరం గరిష్ఠ ఎముక ద్రవ్యరాశిని అభివృద్ధి చేసుకుంటుంది. ఈ వయసులో శారీరకంగా చురుకుగా ఉండి, క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారిలో ఎముకల బలం మెరుగ్గా ఉంటుంది. వయసు పెరిగేకొద్దీ ఎముకల సాంద్రత క్రమంగా తగ్గినా, చిన్న వయసులో ఏర్పడిన ఈ అదనపు బలం కొంతవరకు రక్షణగా నిలుస్తుంది. ఎముకల ద్రవ్యరాశిని పెంచడంలో, దాన్ని కాపాడుకోవడంలో వ్యాయామం కీలక పాత్ర పోషిస్తుంది. చురుకైన నడక, పరుగెత్తడం, శరీర బరువును ఎముకలు భరించేలా చేసే తగిన శారీరక కార్యకలాపాలు ఎముకల నిర్మాణాన్ని ప్రేరేపిస్తాయి. తక్కువ ప్రభావంతో కూడిన క్రీడలు కూడా ఉపయోగకరంగా ఉంటాయి. బరువులతో చేసే వ్యాయామాలు కండరాల బలాన్ని పెంచడంతోపాటు శరీర సమతుల్యతను మెరుగుపరుస్తాయి. దీనివల్ల వృద్ధాప్యంలో పడిపోవడం, ఎముకలు విరగడం వంటి ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుంది.వ్యాయామం తప్పనిసరి..
ఎముకల సాంద్రత తగ్గిన తర్వాత వ్యాయామం ప్రారంభించడం కంటే, శారీరక శ్రమను చిన్న వయసు నుంచే జీవనశైలిలో భాగం చేసుకోవడం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. యువతలో వ్యాయామ అలవాట్లు భవిష్యత్తులో శరీరంలో ఎంత ఎముక ద్రవ్యరాశి నిల్వ ఉంటుందనే అంశాన్ని ప్రభావితం చేస్తాయి. వృద్ధులు కూడా చురుకుగా ఉండడం ద్వారా ఎముకల క్షీణత వేగాన్ని తగ్గించుకోవడంతోపాటు కదలికల సామర్థ్యాన్ని కాపాడుకోవచ్చు. కాల్షియం అందించడంలో పాలు, పాల ఉత్పత్తులు ఉపయోగపడతాయి. అయితే ఎముకల ఆరోగ్యం కోసం కేవలం పాల ఉత్పత్తులపైనే ఆధారపడడం సరిపోదు. వయసు పెరిగేకొద్దీ జీర్ణవ్యవస్థ సమస్యలు, ఇతర ఆరోగ్య పరిస్థితుల కారణంగా కాల్షియంతోపాటు పలు పోషకాలను శరీరం గ్రహించే సామర్థ్యం తగ్గుతుంది. ఆహారంలో వివిధ రకాల కాల్షియం అధికంగా ఉండే పదార్థాలను చేర్చుకోవాలి. ఎముకలతో సహా తినే చిన్న చేపలు, రాగులు, చిరుధాన్యాలు, బాదం పప్పు కాల్షియం అవసరాలను తీర్చడంలో తోడ్పడతాయి. ఒకే ఆహార పదార్థం లేదా పోషకాహార సప్లిమెంట్‌పై ఆధారపడడం కంటే, విభిన్న పోషకాలు అందించే సమతుల ఆహారం తీసుకోవడం మంచిది.విటమిడి అందేలా చూసుకోవాలి..కాల్షియంను శరీరం గ్రహించేందుకు విటమిన్ డి కూడా అవసరం. విటమిన్ డి స్థాయిలు తక్కువగా ఉన్నప్పుడు కాల్షియం తీసుకోవడం పెంచినంత మాత్రాన ఆశించిన ప్రయోజనం లభించదు. వయసు, ఆహారపు అలవాట్లు, సూర్యరశ్మికి ఎంత సమయం గురవుతున్నారు, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వైద్యులు విటమిన్ డి సప్లిమెంట్లను సూచిస్తారు. ఎముకల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే నివారించదగిన అంశాల్లో ధూమపానం కూడా ఒకటి. దీర్ఘకాలంగా ధూమపానం చేసేవారిలో చిన్న వయసులోనే ఆస్టియోపోరోసిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే ధూమపానం ఎముకల సాధారణ జీవక్రియకు ఆటంకం కలిగించి, ఎముకల సాంద్రత తగ్గడానికి దోహదం చేస్తుంది. ధూమపానం చేసే అలవాటు ఉంటే దాన్ని మానుకోవడం వల్ల ఎముకల ఆరోగ్యంతోపాటు గుండె, ఊపిరితిత్తులు, మొత్తం శరీర ఆరోగ్యానికి ప్రయోజనం కలుగుతుంది. ఎక్కువసేపు కదలకుండా ఉండే అలవాటును కూడా తగ్గించుకోవాలి. ముఖ్యంగా వృద్ధుల్లో ఎక్కువ కాలం మంచానికే పరిమితం కావడం వల్ల ఎముకలు, కండరాల బలం వేగంగా తగ్గే అవకాశం ఉంటుంది.పరీక్షలు కీలకం..ఎముకలు విరిగే వరకు ఆస్టియోపోరోసిస్ స్పష్టమైన లక్షణాలు కనిపించవు. అందువల్ల ఈ వ్యాధి ముప్పు ఎక్కువగా ఉన్నవారికి ముందస్తు పరీక్షలు కీలకం. మెనోపాజ్ దశ దాటిన మహిళలు, వృద్ధ పురుషులు ముఖ్యంగా ఇతర ప్రమాద కారకాలు ఉన్నప్పుడు ఎముకల సాంద్రత పరీక్ష అవసరమా అనే విషయాన్ని వైద్యులతో చర్చించాలి. ఎముకల ఖనిజ సాంద్రతను కొలిచే పరీక్షను సాధారణంగా డెక్సా (డ్యుయల్ ఎనర్జీ ఎక్స్‌రే అబ్జార్ప్షియోమెట్రీ) లేదా బీఎండీ (బోన్ మినరల్ డెన్సిటీ) స్కాన్ అని పిలుస్తారు. ఈ పరీక్ష ద్వారా ఎముకల సాంద్రతను అంచనా వేసి, ఆస్టియోపోరోసిస్ ఉందో లేదో గుర్తించేందుకు సహాయపడుతుంది. సాధారణ వైద్య నిర్ధారణ ప్రమాణాల ప్రకారం టి–స్కోర్ మైనస్ 2.5 లేదా అంతకంటే తక్కువగా ఉంటే ఆస్టియోపోరోసిస్‌గా పరిగణిస్తారు. గతంలో ఎముకలు విరిగిన చరిత్ర ఉన్నవారు, ఎక్కువ కాలం శారీరక కదలికలు లేకుండా ఉన్నవారు, ఎముకల సాంద్రత గణనీయంగా తగ్గినవారు, ఈ ముప్పును పెంచే ఇతర ఆరోగ్య సమస్యలున్నవారు పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. వ్యాధిని తొలిదశలోనే గుర్తిస్తే, తీవ్రమైన ఎముకల విరుగుడు కారణంగా నడవడం, రోజువారీ పనులు చేసుకోవడం, స్వతంత్రంగా జీవించడం వంటి సామర్థ్యాలు దెబ్బతినకముందే చికిత్స ప్రారంభించవచ్చు.వ్యాధి నిర్ధారణ అయితే..ఆస్టియోపోరోసిస్ ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత కూడా జీవనశైలిలో మార్పులు చేసుకోవడం చాలా ముఖ్యం. అయితే కొన్ని సందర్భాల్లో ఇవి మాత్రమే సరిపోవు. వ్యక్తి వయసు, ఎముకలు విరిగే ప్రమాదం, ఎముకల సాంద్రత, ఇతర వైద్య పరిస్థితులను బట్టి ఎముకల క్షీణతను తగ్గించే లేదా కొత్త ఎముకల నిర్మాణానికి తోడ్పడే మందులను వైద్యులు సూచిస్తారు. బిస్ఫాస్ఫోనేట్లు సాధారణంగా ఉపయోగించే ఎముకల క్షీణత నిరోధక మందులు. వీటితోపాటు డెనోసుమాబ్, పునఃసంయోజిత పారాథైరాయిడ్ హార్మోన్ ఆధారిత ఎముకల నిర్మాణాన్ని ప్రోత్సహించే మందులు, మెనోపాజ్ దాటిన మహిళలకు అవసరాన్ని బట్టి కొన్ని ప్రత్యేక చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయి. కాల్సిటోనిన్ వినియోగం మాత్రం పరిమితంగా ఉంటుంది. నిర్దిష్ట పరిస్థితుల్లో మాత్రమే దీనిని పరిగణనలోకి తీసుకోవచ్చు. ఆహారం ద్వారా తగినంత కాల్షియం అందకపోయినా, విటమిన్ డి స్థాయిలు తక్కువగా ఉన్నా వైద్యులు ఈ పోషకాల సప్లిమెంట్లను కూడా సూచిస్తారు. అయితే వ్యక్తిగతంగా ఎముకలు విరిగే ప్రమాదం, వైద్య చరిత్రను పరిశీలించిన తర్వాతే చికిత్సను నిర్ణయించాలి. వైద్యుల సలహా లేకుండా సొంతంగా మందులు ప్రారంభించడం సరికాదు.ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అనేది దీర్ఘకాలిక ప్రక్రియ. శారీరకంగా చురుకుగా ఉండడం, కాల్షియం అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడం, తగినంత విటమిన్ డి పొందడం, ధూమపానానికి దూరంగా ఉండడం, ఎక్కువసేపు కదలకుండా ఉండే అలవాటును తగ్గించుకోవడం వంటి చర్యలు కీలకం. ఎముకల వ్యాధి ముప్పు ఎక్కువగా ఉన్నవారు డెక్సా స్కాన్ చేయించుకోవాలా అనే విషయాన్ని వైద్యులను అడిగి తెలుసుకోవాలి. ఎముకల బలాన్ని ముందుగానే పెంచుకోవడం, వయసు పెరిగిన తర్వాత కూడా చురుకుగా, స్వతంత్రంగా జీవించేందుకు సహాయపడుతుంది.

## డయాబెటిస్ ఉన్నవారికి ఏ పండ్లు బెస్ట్..!?

డయాబెటిస్. ఇప్పుడు వేగంగా విస్తరిస్తున్న సమస్య. మారుతున్న జీవన శైలి.. ఒత్తిడితో వయసు తో సబంధం లేకుండా అనేక మంది ఈ సమస్య బారిన పడుతున్నారు. డయాబెటిస్ ను గుర్తించిన సమయం నుంచి జాగ్రత్తగా ఉండాల్సిందే. వైద్యులు సూచించిన మందులతో పాటుగా జీవన శైలి.. ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి. అదే విధంగా డయాబెటిస్ ఉన్న వారు పండ్లు తీసుకోవటం పైన భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. షుగరు ఉన్నవారు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ (+×) మరియు ఎక్కువ ఫైబర్ ఉన్న పండ్లను తినాలని నిపుణులు సూచిస్తున్నారు.డయాబెటిస్ ఉన్న వారు పండ్లలో సహజ చక్కెర ఉంటుందని వాటిని తినడానికి ఇష్టం చూపించరు. కాగా, పండ్లలో కార్బొహైడ్రేట్లతోపాటు శరీరానికి అవసరమైన పోషకాలు, పీచు పదార్థం కూడా ఉంటాయి. ముఖ్యంగా పండ్లను రసం రూపంలో కాకుండా పూర్తిగా తినడం వల్ల అందులోని పీచు చక్కెర రక్తంలోకి వేగంగా చేరకుండా జీర్ణక్రియను నెమ్మదింపజేస్తుంది. దీంతో రక్తంలో షుగరు స్థాయిలు ఒక్కసారిగా పెరిగే ప్రమాదం ఉండదని నిపుణులు చెబుతున్నారు. మధుమేహం ఉన్నవారు పండ్ల రకం, పరిమాణంపై శ్రద్ధ పెట్టడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.అయితే.. మధుమేహం ఉన్నవారికి జామపండు మంచి ఎంపికగా పేర్కొంటున్నారు. ఇందులో పీచు అధికంగా ఉండడంతోపాటు విటమిన్ సి కూడా సమృద్ధిగా ఉంటుంది. స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, రాస్ప్‌బెర్రీ వంటి బెర్రీల్లో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, కరిగే పీచు అధికంగా ఉండి చక్కెర తక్కువగా ఉంటుంది.కాగా.. పియర్‌లో పీచు ఎక్కువగా ఉండడంతో రక్తంలోకి చక్కెర నెమ్మదిగా విడుదల కావడానికి సహాయపడుతుంది. యాపిల్‌ను తొక్కతో తినడం వల్ల పీచు, ఇతర పోషకాలు ఎక్కువగా లభిస్తాయి. నారింజలో పీచు, విటమిన్ సి, పొటాషియం ఉంటాయి. అయితే నారింజ రసాన్ని తీసుకోవడం కంటే పండును పూర్తిగా తినడం మంచిదని సూచిస్తున్నారు. ఇక, కివిలో విటమిన్ సి, విటమిన్ ఇ, పొటాషియం, పీచు ఉంటాయి. పరిమితంగా తీసుకుంటే రక్తంలో చక్కెర నెమ్మదిగా పెరిగే అవకాశం ఉంటుంది. బొప్పాయిలో యాంటీఆక్సిడెంట్లు, సహజ ఎంజైములు ఉంటాయి. అయితే సహజ చక్కెరలు ఉండడంతో పరిమాణంపై నియంత్రణ అవసరం.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం

### పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ.





**చర్చ :- దమ్మపేట** రాబోయే ఉమ్మడి ఖమ్మం--నల్లగొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పిలుపునిచ్చారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని, గ్రాడ్యుయేట్ ఓటర్లను నేరుగా కలిసి కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రజా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని సూచించారు. దమ్మపేట మండలం గండుగులపల్లిలోని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ క్యాంపు కార్యాలయంలో సోమవారం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు హాజరయ్యారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణ, క్షేత్రస్థాయిలో ఓటర్లను కలిసే విధానం, పార్టీ శ్రేణులకు అప్పగించాల్సిన బాధ్యతలపై ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు.

**క్షేత్రస్థాయిలో చురుకైన పాత్ర పోషించాలి**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు పార్టీకి అత్యంత ప్రాధాన్యత కలిగినవని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పట్టణాలు, గ్రామాల్లో గ్రాడ్యుయేట్ ఓటర్లను గుర్తించి వారితో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని సూచించారు. ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి ఎన్నికల ప్రాధాన్యతను వివరించడంతో పాటు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను తెలియజేయాలని అన్నారు.
గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ సంస్థాగత వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. నాయకులు, కార్యకర్తలు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని అర్హులైన గ్రాడ్యుయేట్ ఓటర్లకు చేరవేయడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.

**అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలి**

కాంగ్రెస్ పార్టీకి చెందిన అన్ని అనుబంధ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సూచించారు. యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్, కిసాన్ సెల్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్, ఇందిరమ్మ కమిటీలు, సోషల్ మీడియా విభాగాల నాయకులు క్షేత్రస్థాయిలో చురుకైన పాత్ర పోషించాలని అన్నారు.
గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉంటూ గ్రాడ్యుయేట్ ఓటర్లతో నిరంతరం సంబంధాలు కొనసాగించాలని సూచించారు. పార్టీ శ్రేణుల మధ్య సమన్వయ లోపాలు లేకుండా ప్రతి ఒక్కరూ పరస్పర సహకారంతో పనిచేయాలని పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఓటర్ల అభిప్రాయాలను తెలుసుకుని వాటిని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలని అన్నారు.

**ప్రజా ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా వివరించాలి**

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యంగా గ్రాడ్యుయేట్ ఓటర్లకు సంబంధించిన అంశాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎన్నికల ప్రచారంలో వాస్తవ సమాచారానికే ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.సోషల్ మీడియా కోఆర్డినేటర్లు కూడా పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలు, ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో చురుకుగా వ్యవహరించాలని సూచించారు. అయితే సోషల్ మీడియాతో పాటు క్షేత్రస్థాయిలో ఓటర్లను నేరుగా కలవడం కూడా అత్యంత ముఖ్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**సమష్టి కృషితో విజయం సాధించాలి**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణుల ఐక్యత, సమన్వయం, క్రమశిక్షణతో పనిచేయడం ద్వారా ఎన్నికల్లో అనుకూల ఫలితాలు సాధించవచ్చని అన్నారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు అందరూ కలిసికట్టుగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, సేవాదళ్ నాయకులు, వివిధ సెల్‌ల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 25, 26 తేదీల్లో మహాధర్నా

### కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి: సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్.




**చర్చ :- దమ్మపేట.**కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 25, 26 తేదీల్లో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న బహుళ రోజుల మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ పిలుపునిచ్చారు. మహాధర్నాకు కార్మికులను సమాయత్తం చేసే కార్యక్రమంలో భాగంగా సోమవారం దమ్మపేటలో సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో గోడపత్రికలను ఆవిష్కరించి, ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు పూర్తవుతున్నప్పటికీ స్కీం వర్కర్లు, అసంఘటిత, సంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాన్ని రూ.42 వేలకు పెంచాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని ఆయన కోరారు. కార్మికుల హక్కులు, ఉపాధి భద్రత, జీవన ప్రమాణాల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిట్టల అర్జున్ కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, నాయకులు కవులూరి రామకృష్ణ, బాబురావు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# ఉరి వేసుకొని 19 ఏళ్ల యువకుడు మృతి..



**చర్చ :- అశ్వారావుపేట** అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో 19 ఏళ్ల యువకుడు ఉరి వేసుకొని మృతి చెందిన ఘటన విషాదం నింపింది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెహ్రూనగర్‌కు చెందిన పానుగంటి కుమారి భర్త సుబ్బారావు మృతి చెందగా, ఆమె ఇంట్లో మనవడు కాగిత శ్రీ రంజిత్ (19) ఉంటున్నాడు.ఈ క్రమంలో శ్రీ రంజిత్ ఇంట్లో ఉరి వేసుకున్న స్థితిలో కనిపించడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనకు సంబంధించిన వివరాలను నమోదు చేశారు.మృతుడి తల్లిదండ్రులు కాగిత నాగ ముత్యాలరావు, జ్యోతి సుమారు రెండేళ్లుగా విడివిడిగా నివసిస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం.తల్లిదండ్రులు వేర్వేరుగా ఉండటంతో శ్రీ రంజిత్ కొంతకాలంగా మనస్తాపానికి గురైనట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే అతడు తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అయితే తల్లిదండ్రులు విడిగా ఉండటమే మృతికి కారణమా? లేక యువకుడి ఆత్మహత్యకు మరేదైనా వ్యక్తిగత లేదా ఇతర కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.ఘటనకు ముందు అతడి పరిస్థితులు, కుటుంబ సభ్యులతో ఉన్న సంబంధాలు, ఇతర కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. మృతుడి అమ్మమ్మ పానుగంటి కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అశ్వారావుపేట ఎస్ఐ దేవ్‌సింగ్ తెలిపారు.మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడవుతాయని పోలీసులు పేర్కొన్నారు.

# బాధిత మహిళకు 2 లక్షల ఎల్వోసి అందించిన ఎమ్మెల్యే



**జగిత్యాల, అక్టోబర్ 19, చర్చ :** గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స చేయించుకోలేని ఓ మహిళ చికిత్స కై రెండు లక్షల ఎల్వోసి ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అందించారు. రాయికల్ మండలం లోని అల్లీపూర్ కు చెందిన మౌనిక అనే మహిళ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ, చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్న విషయం స్థానిక నాయకులు, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయనిధి ద్వారా మౌనిక చికిత్స కోసం 2 లక్షల ఎల్వోసీని మంజూరు చేయించి జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మౌనిక కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా మోనికా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకులు సమిండ్ల శ్రీనివాస్, గంగాధర్, జహంగీర్, తదితరులున్నారు

# దుర్గాభవాని దర్శించుకున్న బీజేపీ నేత నారపాక అశోక్

### కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు
### గ్రామ ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థన



**జగిత్యాల :**జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామంలో దుర్గాభవాని సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గా భవాని అమ్మవారిని బీజేపీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షుడు నారపాక అశోక్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఈ సందర్భంగా తన భార్య దివ్య అశోక్, కుమార్తె అద్వైత నారపాకతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, మంగేళ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు.గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని నారపాక అశోక్ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు గ్రామస్థుల మధ్య ఐక్యతను బలోపేతం చేస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో దుర్గాభవాని సేవా సమితి సభ్యులు, అమ్మవారి దీక్షాపరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మహిషాసురమర్ధిని అలంకారంలో భద్రకాళి అమ్మవారు

- ఘనంగా తొమ్మిదో రోజు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- వైభవంగా వసంతోత్సవం, సర్వభూపాల వాహనసేవ
- అమ్మవారిని దర్శించుకున్న గోవా మంత్రి విశ్వజిత్ రాణే కుటుంబ సభ్యులు







**వరంగల్, అక్టోబర్ 19** వరంగల్‌లోని ప్రసిద్ధ శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేవీ శరన్న వరాత్రి మహోత్సవాలు తొమ్మిదో రోజు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు నిత్యాహ్నిక కార్యక్రమాలను నిర్వహించి అమ్మవారిని మహిషా సురమర్ధినిగా ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అమ్మవారి దివ్యరూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. వరాహ పురాణం ప్రకారం సిద్ధిధాత్రి దుర్గాక్రమంలో, బోధాయనోక్త నవరాత్ర కల్పం ప్రకారం శుంభహా దుర్గాక్రమంలో అమ్మవారికి ప్రత్యేక పూజారాధనలు నిర్వహించారు. ఉదయం వసంతోత్సవం, చతురంతసేవ, సాయంత్రం విమానక సేవ (సర్వభూపాల వాహనసేవ) భక్తిశ్రద్ధల మధ్య వైభవోపేతంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఈ ఉత్సవాల్లో గోవా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విశ్వజిత్ రాణే, గోవా ఎమ్మెల్యే దేవ్యా రాణే, ఐశ్వర్య రాణే, అరుంధతి రాణే కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. అలాగే కరీంనగర్‌కు చెందిన యాదా సత్యదీప్--ప్రవళిక దంపతులు, యాదా రూహి తదితరులు ఉభయదాతలుగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు ప్రముఖులకు మహదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కమటం వేణుగోపాల్, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మోతుకూరి మయూరి రామేశ్వరరావు, చిదర అంజనీదేవి, కల్లూరి పవన్ కుమార్, కారెంగుల సురేష్ బాబు, మాడిశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు. నేడు నవరాత్రి మహోత్సవాల పూర్ణాహుతిదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం (అక్టోబర్ 20) ఉదయం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

# సాయిని ముత్యంను పరామర్శించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

- ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే



**గోరికొత్తపల్లి, అక్టోబర్ 19**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండలం చెన్నాపూర్ గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ సాయిని విజయ భర్త సాయిని ముత్యంను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం పరామర్శించారు. ఇటీవల ముత్యంకు కంటి ఆపరేషన్ జరిగిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కంటి ఆపరేషన్ అనంతరం ఆరోగ్యం ఎలా ఉందని ఆరా తీసిన ఎమ్మెల్యే, వైద్యుల సూచనలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముత్యం త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట ఎన్ఎస్ఆర్, నడిపెల్లి విజ్జన్ రావు, పత్తి ప్రభాకర్, కృష్ణయ్య, ముడతనపల్లి శంకర్ ఉన్నారు. అలాగే గ్రామ సర్పంచ్ పల్లెబోయిన బిక్షపతి, ఉప సర్పంచ్ తోట సారంగపాణి, అల్లె దేవేందర్, అల్లె శంకర్, తౌటు అశోక్, పల్లెబోయిన రాజేందర్, ముప్పు అనిల్, తోట కుమారస్వామి, కొసరి కట్టయ్య, గటికే ప్రకాష్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 31 మంది లబ్ధిదారులకు రూ.62.70 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- పేదల వైద్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట -- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- ఆరోగ్యశ్రీతో పాటు సీఎంఆర్ఎఫ్ ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా







**వరంగల్, అక్టోబర్ 19**
పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. సోమవారం తన స్వగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.62.70 లక్షల విలువైన చెక్కులను 31 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ వైద్య పరిమితిని రూ.10 లక్షలకు పెంచడంతో పాటు, వివిధ ఆసుపత్రుల్లో చికిత్స కోసం ఖర్చు చేసిన పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే నిమ్స్ ఆసుపత్రిలో వైద్య చికిత్స అవసరమైన అర్హులైన లబ్ధిదారులకు లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) జారీ చేయడం ద్వారా ఖరీదైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పేదలు వైద్యానికి దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న సహాయం అనేక పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ సభ్యుడు నల్లగొండ రమేష్, మాజీ కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్, బస్వరాజు శిరీష శ్రీమన్, ధూపం సంపత్, దామెర సర్వేశం, జన్ను రవి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల రాజు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిలువేరు శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నారగోని స్వప్న, ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ భాష్పాక సదానందం, డీసీసీ ఉపాధ్యక్షుడు కూరతోట సదానందం, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమలక్ష్మి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు మంతెన సునీత, ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ కోదాటి అనిల్ పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎల్. శ్రీనివాస్, భూపాల్, చాగంటి శ్రీనివాస్, మురళి గౌడ్, గిన్నరపు రాజు, బోలుగొడ్డు అనిల్, నారగోని మురళి గౌడ్, రాముల బాబు, నరిగే శ్రీను, బైరబోయిన చంద్రమౌళి, తోట బాలరాజు, వెల్దండి లక్ష్మణ్, కాశెట్టి వేణు, వసుకుల ఉదయ్, ఎండీ ఆజం, కూచన ఏకాంబరం, బిసపాక శ్రీనివాస్, ఎస్కే ఇమ్రాన్, క్యాతం వేణు, గుండేటి సతీష్, యూత్ కాంగ్రెస్ నాయకుడు వరుణ్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కొమ్ముల సందీప్, బత్తుల వినోద్, ఇనుగాల బాబు, ఈటల ఉమేందర్, యాదగిరి, బండ్ల సురేందర్, జన్ను అరుణ్, ఇంతియాజ్‌తో పాటు వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెంకటేశ్వరపల్లిలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- బతుకమ్మ ఆటపాటలతో మార్మోగిన గ్రామం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన సర్పంచ్ ముప్పిడి నాగరాజు



**గణపురం, అక్టోబర్ 19 :** మండల పరిధి లోని వెంకటేశ్వరపల్లి గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను ఒకచోట చేర్చి సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది. ఈ వేడుకల ఏర్పాట్లను గ్రామ సర్పంచ్ ముప్పిడి నాగరాజు దగ్గరుండి పర్యవేక్షించారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ఆడపడుచుల ఐక్యతను, ఆత్మీయతను చాటిచెబుతుందని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకల ద్వారా తెలంగాణ సంస్కృతిని భావితరాలకు అందించవచ్చని తెలిపారు.

# టీజీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- పారదర్శకతకు పెద్దపీట వేయాలి: టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం
- అక్టోబర్ 24, 26 తేదీల్లో కాలుష్య నియంత్రణ మండలి ఉద్యోగ నియామక పరీక్షలు
- పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లపై నిషేధం.. ఆలస్యంగా వస్తే అనుమతి లేదు




**హనుమకొండ, అక్టోబర్ 19**
తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిలో ఉద్యోగ నియామకాల కోసం నిర్వహించనున్న టీజీపీఎస్సీ పరీక్షలను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పరీక్షల ఏర్పాట్లు, భద్రత, సాంకేతిక సదుపాయాలపై సమీక్షించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ అక్టోబర్ 24న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్-××), అక్టోబర్ 26న అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టులకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల నిర్వహణలో చిన్నపాటి పొరపాటుకు కూడా తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

**ప్రశ్నపత్రాల భద్రతకు ప్రత్యేక చర్యలు**
ప్రశ్నపత్రాల లీకేజీకి అవకాశం లేకుండా అధునాతన సాంకేతిక భద్రతా చర్యలు చేపట్టినట్లు చైర్మన్ తెలిపారు. పరీక్షకు కొద్ది గంటల ముందే ప్రశ్నపత్రాలను ఖరారు చేసే విధానాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు, తనిఖీ అధికారులు, సిబ్బంది సెల్‌ఫోన్లు తీసుకురాకూడదని స్పష్టం చేశారు. చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే నిబంధనల మేరకు పరిమిత వెసులుబాటు ఉంటుందన్నారు. ప్రతి 24 మంది అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన ఒక ఇన్విజిలేటర్‌ను నియమించాలని ఆదేశించారు.

**నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు**
పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు కనీసం గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 9.30 గంటలు, మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో బయోమెట్రిక్ హాజరు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. మహిళా అభ్యర్థుల తనిఖీలకు మహిళా పోలీసులను నియమించాలని, కేంద్రాల పరిసరాల్లో ర్యాలీలు, ధర్నాలు, సభలకు అనుమతులు ఇవ్వకూడదని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. హనుమకొండ జిల్లాలో టీజీపీఎస్సీ పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో పటిష్ట భద్రత, అభ్యర్థుల తనిఖీలు, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీశంకర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియా

**నగర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న**



**వరంగల్, అక్టోబర్ 19 :** విజయదశమి పర్వదినం నగర ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న ఆకాంక్షించారు. సోమవారం నగర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐకమత్యం మరింత బలపడాలని ఆకాంక్షించారు. నగర ప్రజలందరికీ హృదయపూర్వక విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# హైదరాబాద్‌లో హనీట్రాప్ కలకలం.. రూ.18 లక్షలు వసూలు చేసిన యువకుడి అరెస్ట్

**హైదరాబాద్, అక్టోబర్ 19:** సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్లు క్రియేట్ చేసి.. ప్రేమ పేరుతో యువకులకు దగ్గరై.. ఆపై అందినకాడికి దోచుకుంటున్న ఓ యువకుడి గుట్టును పాతబస్తీ పోలీసులు రట్టుచేశారు. కాగా నిందితుడి ట్రాప్‌లో ఇతర రాష్ట్రాల యువకులు, విదేశీయులు కూడా ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీకి చెందిన కొండబత్తుల పవన్ కుమార్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో అమ్మాయిల పేరుతో ఫేక్ అకౌంట్లు క్రియేట్ చేసి యువకులను ట్రాప్ చేస్తుంటాడు. ప్రేమ పేరుతో యువకులకు దగ్గరై వారి ప్రైవేట్ ఫొటోలు, వీడియోలు సేకరిస్తాడు. అనంతరం వాటిని అడ్డుగా పెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతూ.. బాధితుల నుంచి లక్షల్లో వసూలు చేస్తుంటాడు. ఈ క్రమంలో ఓ యువకుడి నుంచి రూ.18 లక్షలు వసూలు చేయగా.. మరో రూ. 7.16 లక్షలు ఇవ్వాలంటూ పవన్ కుమార్ బెదిరించాడు.

# నామమాత్రంగా కొత్త ఓట్ల దరఖాస్తులు - ములుగులో 751 మాత్రమే

**హైదరాబాద్:**తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా అభ్యంతరాలు, ఫిర్యాదుల సమయంలో కొత్త ఓటర్ల నమోదు కోసం అందిన దరఖాస్తుల సంఖ్య నామమాత్రంగా ఉంది. 'సర్?'లో భాగంగా ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 7 వరకు ఫారం-6 ద్వారా 1,70,374 దరఖాస్తులు మాత్రమే అందాయి. ఎన్నికల సంఘం మాత్రం సుమారు 4.88 లక్షల దరఖాస్తులు అందినట్లు గతంలో ప్రకటన చేసింది. అయితే ఇవన్నీ అభ్యంతరాలు, ఫిర్యాదుల కాలంలో అందినవి కావని తెలుస్తోంది. అంతకు ముందు అందిన వాటిని కూడా కలిపారు.రాష్ట్రంలో 'సర్?' సర్వేలో భాగంగా ముసాయిదా జాబితా ప్రచురించిన రోజున ఓటర్ల నమోదు పత్రాలు సమర్పించకపోవడం, చిరునామా లేకపోవడం, శాశ్వత వలస, మరణం, డూప్లికేట్ ఓట్ల కారణంగా 73.39 లక్షల ఓట్లను తొలగించారు. అనేక చోట్ల అర్హులైన ఓటర్లు ఉన్నప్పటికీ, బీఎల్‌వోలు ఎలాంటి విచారణ లేకుండానే, వారిని తొలగించారని రాజకీయ



పార్టీలు ఆరోపించాయి.ఏఎస్?డీడీ జాబితా నుంచి పొరపాటున తమ ఓటు తొలగిస్తే, ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల అధికారులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. అయితే అభ్యంతరాలు, ఫిర్యాదుల సమయంలో కేవలం 1,70,374 దరఖాస్తులు మాత్రమే అందాయనేది గమనార్హం. దీనికి అదనంగా ఈ నెల 15, 16 తేదీలలో నిర్వహించిన శిబిరాల ద్వారా 36,771 దరఖాస్తులు అందాయి. అంటే 'సర్' కార్యక్రమంలో భాగంగా ఏఎస్?డీడీ జాబితా ప్రకటించిన తర్వాత, అభ్యంతరాలు, ఫిర్యాదుల సమయంలో అందిన మొత్తం ఫారం-6 దరఖాస్తులు కేవలం 2,07,146 మాత్రమే.ఏడాది ప్రారంభం నుంచి 10.45 లక్షల దరఖాస్తులుఈ సంవత్సరం ప్రారంభం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు, కొత్త ఓటు నమోదు కోసం ఫారం-6 ద్వారా 10,45,519 దరఖాస్తులు అందాయి. వీటిలో ఇప్పటివరకు 5,12,960 దరఖాస్తులను ఎన్నికల అధికారులు ఆమోదించి, వారి పేర్లను తుది జాబితాలో చేర్చారు. సరైన పత్రాలు లేకపోవడం వల్ల 2,23,416 దరఖాస్తులు తిరస్కరించారు. మరో 3,09,143 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. వీటిని కూడా పరిశీలించి, అర్హులైన వారిని నవంబర్ 9న ప్రకటించబోయే 'సర్-2026' తుది జాబితాలో చేర్చనున్నారు. సర్?లో భాగంగా కేవలం అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ కాలంలో కొత్త ఓటరు నమోదు కోసం అత్యధికంగా 39,101 దరఖాస్తులు హైదరాబాద్‌లో అందగా, అత్యల్పంగా 751 దరఖాస్తులు ములుగులో అందాయి.

## మీ పాత్ర లేకపోతే సీబీఐ విచారణ చేపట్టండి..

**హైదరాబాద్ :** మాక్స్‌బియన్ ఫార్మా కానీ, మైండ్‌వాల్ట్ కార్పొరేట్ స్కూల్స్ కానీ, మెడికవర్ ఆస్పత్రుల మీద వస్తున్న ఆరోపణలపై అక్కడున్న మీడియా వాళ్లు అడిగినపుడు రేవంత్ రెడ్డి ప్రెస్‌మీట్‌లో మొదలేమో తనను పెయిడ్ క్వశ్చన్స్ అడగకండి అన్నరు.. తర్వాతేమో ఒక్క ఆధారమ న్నా చూపించండి అన్నరు. ఇవన్నీ అంశాలల్లో కూడా కొన్ని నెలల నుంచి ఆధారాలు బయటపెడుతూనే ఉన్నామని బీఆర్ ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ తెలిపారు.తెలంగాణ




భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. . ఎట్లా ఒక ఆస్పత్రిని రూ.13200కు అమ్మేస్తరు.. ఆ ఆస్పత్రిలో ఉన్న డైరెక్టర్లలో అల్లుడు మాక్స్‌బియన్ ఫార్మాలో ఉంటరు.. అమ్మాయి నిర్మాణాలు చేస్తున్న కార్పోరేట్ స్కూల్స్ అయిన మైండ్‌వాల్ట్స్‌లో ఉంటరు.. ఇవాళ ఇవన్నింటి మీద ప్రశ్నలు అడిగినప్పుడు రేవంత్ రెడ్డి దగ్గర సమాధానం లేదు.. ఎదురేమో రకరకాల దుష్ప్రచారం చేస్తరని మన్నె క్రిశాంక్ ఆరోపి ంచారు.వారికి, వారి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న ఛానళ్లు, పత్రికల్లో కేటీఆర్, కేసీఆర్‌మీద దుష్ప్రచారాలు చేయడం..వాళ్లు నేరుగా వచ్చి సమాధానాలు కూడా చెప్పడం,, కేటీఆర్, హరీశ్ రావు సమాధానాలు చెప్పడం, కేసీఆర్ లీగల్ గా ఎదుర్కోవడం, కమిషన్‌కు సమాధానాలు చెప్పడం.. అవును రేవంత్ రెడ్డి మీకు సంబంధం లేకపోతే విచారణ చేపట్టండి. సులభంగా అయిపోతది.. ఇవేమిట్లో కూడా మీ పాత్ర లేకపోతే సీబీఐ విచారణకు ఆదేశించండి అయిపోతది. ఆ సీబీఐ ముందు మేం పోయి డాక్యుమెంట్స్ పెడతం. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రంలో సీబీఐ రావాలంటే రేవంత్ రెడ్డి అనుమతి ఉండాలి. మరి రేవంత్ రెడ్డి ఇందులో ఏం లేదు ఒక్క ఆధారం కూడా లేదన్నప్పుడు .. మీరు అంత క్లీన్‌గా ఉన్నపుడు ఇక్కడ పెట్టిన ఈ అంశాల మీద సీబీఐ విచారణ పెట్టండి.. మేమే ఈ డాక్యుమెంట్స్ , డైరెక్టర్స్, షేర్ హోల్డర్స్ అన్నీ పెడతమన్నారు మన్నె క్రిశాంక్ .

## హైదరాబాద్‌లో నకిలీ నంబర్ ప్లేట్లపై పోలీసుల ఉక్కుపాదం.. 100 మందిపై కేసులు

**హైదరాబాద్, అక్టోబర్ 19:**
నకిలీ నంబర్ ప్లేట్ల వాహనాలపై నగర ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతు న్నారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రత్యే క తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భారీగా వాహనాలు సీజ్ చేశారు. నకిలీ నంబర్ ప్లేట్లతో వాహనాలు వినియో గిస్తున్న 100 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. గత 8 నెలల్లో 88 ద్విచక్ర వాహనాలతోపాటు12 కార్లను ట్రాఫిక్ పోలీసులు సీజ్ చేశారు. నకిలీ, మార్చిన, అనధికారిక నంబర్ ప్లేట్లు చట్ట రీత్యా నిషేధమని నగర ప్రజలకు ట్రాఫిక్ పోలీసులు స్పష్టం



చేశారు.హెచ్ఎస్ఆర్‌పీ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఈ సందర్భంగా వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద నంబర్ ప్లేట్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని వారికి ట్రాఫిక్ పోలీసులు సూచించారు. నకిలీ నంబర్ ప్లేట్లను వినియోగించడం వల్ల వాహనాలు గుర్తించడం కష్టమవుతుందని పోలీసులు పేర్కొన్నారు. ఇది నేరాల దర్యాప్తు, ట్రాఫిక్ నియంత్రణ, రహదారి భద్రతకు సవాలుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇక వాహనదారులు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ సంబంధించిన నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేస్న?న్నారు. నిబంధనలకు అనుగుణంగా నంబర్ ప్లేట్లనే అమర్చుకోవాలని సూచిస్తున్న్ను. రిజిస్ట్రేషన్ నంబరులో ఎలాంటి మార్పులు చేయవద్దని కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘనలకు పాల్పడితే కేసులు నమోదు చేసి.. వాహనాలు సీజ్ చేయడంతోపాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

## పండగల వేళ హైదరాబాద్ పోలీసు శాఖలో మార్పులు.. భారీగా ఎస్ఐల బదిలీ

**హైదరాబాద్ :**
హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 75 మంది ఎస్ఐల బదిలీ పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని పాలనాపరమైన మార్పులు లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులకు స్థానచలనం బదిలీ అయిన వారు వెంటనే విధుల్లో చేరాలని సీపీ సజ్జనార్ ఆదేశం
ఒకేచోట ఎక్కువకాలం పనిచేస్తున్న వారిని బదిలీ చేసినట్లు వెల్లడి
హైదరాబాద్ నగరంలో పండగల సీజన్ సమీపిస్తున్న వేళ పోలీసు శాఖలో భారీగా మార్పులు చోటుచేసుకున్నాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 75 మంది సబ్-ఇన్‌స్పెక్టర్లను (ఎస్ఐ) బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం, శాంతిభద్రతల పటిష్ఠతలో భాగంగా ఈ బదిలీలు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లు, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్, కంట్రోల్ రూమ్ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులను ఈ బదిలీల ప్రక్రియలో భాగంగా మార్పు చేశారు. ముఖ్యంగా ఎక్కువ కాలంగా ఒకేచోట పనిచేస్తున్న అధికారులను గుర్తించి వేర్వేరు స్టేషన్లు, విభాగాలకు కేటాయించినట్లు తెలుస్తోంది.బదిలీ అయిన అధికారులు తక్షణమే




తమ కొత్త పోస్టింగ్‌లలో బాధ్యతలు స్వీకరించాలని కమిషనర్ స్పష్టంగా ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి ఆలస్యం లేదా నిర్లక్ష్యం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రాబోయే పండగలు, నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకునే ఈ మార్పులు చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

## రేవంత్ అసమర్థతో హరిగోస పడుతున్న రైతాంగం : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**మహబూబ్ నగర్ :** మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జిల్లాలోని పెద్దగూడెం తండాలో కరెంట్ కోతలతో ఎండిపోయిన వరి పంటలను బీఆర్ఎస్) శ్రేణులుతో కలసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఆవేదనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మీడియాతో మాట్లాడారు.ఇది నిజమైన కరువు కాదని, ముమ్మాటికి కాంగ్రెస్ తెచ్చిన కరువని ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్ నినో పేరుతో కాలం వెలిబుచ్చు తున్నారని విమర్శింఆచరు. పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర వ్యాప్తంగా సమీక్ష నిర్వహించి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయంపై ప్రత్యక్షంగా,పరోక్షంగా రెండున్నర కోట్ల మంది రైతులు ఆధారపడి ఉన్నార, నివారంతా ప్రభుత్వంపై తిరగబడే అనివార్యత ప్రభుత్వమే కల్పించిం దని పేర్కొన్నారు. రైతులు



అధైర్య పడొద్దని అండగా ఉంటామని, ప్రభుత్వంతో పోరాడి నష్టపరిహారం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే ఓటు వేసినందుకు చెప్పుతో కొట్టుకుంటామని బహిరంగం చెబుతున్నా ఈ ప్రభుత్వానికి బుద్ధి రావడం లేదని విమర్శించారు.రేవంత్ రెడ్డికి కరెంట్ సరఫరాపై అవగాహన, సోయి లేదని అన్నారు. నేటికి శ్రీశైలం ప్రాజెక్టులో 70 టీఎంసీల నీటి లభ్యత ఉందని, నీటి లభ్యత ఉన్నా పాలమూరు, కల్వకుర్తి పంపులు నడుపతలేరని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని నడపడంలో ఘోరమైన వైఫల్యం చెందిందిని వెల్లడించారు.ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు వాకిటి శ్రీధర్ , నందిమల్ల అశోక్, కె.మాణిక్యం, రఘువర్ధన్ రెడ్డి, రవిప్రకాష్ రెడ్డి, ధర్మా నాయక్, మాధవ్ రెడ్డి, సునీల్ వాల్మీకి, శంకర్ నాయక్, చిట్యాల రాము, నారాయణ నాయక్, టీక్యా నాయక్, గోవిందు నాయక్, అలీం పాల్గొన్నారు.

## తెల్ల 'బంగారం'.. జమ్మికుంట మార్కెట్‌లో క్వింటాల్ రూ.9,200



**జమ్మికుంట(కరీంనగర్):** పత్తి రైతులకు ఈ ఏడాది ధరలు ఊరటనిస్తున్నాయి. సీజన్ ప్రారంభంలోనే మద్దతు ధరను మించి లభిస్తుండ డంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం క్వింటాల్ పత్తికి గరిష్ఠంగా 9,200 రూపాయల ధర పలికింది. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో గత సీజన్‌లో సీసీఐ క్వింటాల్‌కు 8,110 మద్దతు ధర చొప్పున 10,666 మంది రైతుల నుంచి 1,45,057 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. ఇదే సమయంలో ప్రైవేటు వ్యాపారులు 1,18,638 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఈ ఏడాది పత్తికి ప్రభుత్వం క్వింటాల్‌కు 8,667 రూపా యలు మద్దతు ధర నిర్ణయించగా, మార్కెట్‌లో అంతకుమించి ధరలు పలుకుతున్నాయి.సెప్టెంబరు23 నుంచి కొత్త పత్తి మార్కెట్‌కు రావడం ప్రారంభమైంది. తొలి రోజుల్లో క్వింటాల్‌కు రూ.8600 వరకు ధర పలకగా.. రోజులు గడుస్తున్న కొద్దీ పత్తి నాణ్యత పెరగడం, వ్యాపారుల మధ్య పోటీ నెలకొనడంతో ధరలు క్రమంగా పెరుగుతున్నాయి.ఈ సీజన్‌లో మార్కెట్‌కు ఇప్పటివరకు 2,500 క్వింటాళ్ల పత్తి వ చ్చింది. మంగళవారం జమ్మికుంట వ్యవ సాయ మార్కెట్‌కు సుమారు 150 వాహ నాల్లో 690 క్వింటాళ్ల పత్తి రాగా, గరిష్ఠ ధర 9,200, మోడల్ ధర 8,900, కనిష్ట ధర ఎనిమిది వేల రూపాయలు లభించింది.

## ఉపాధి కల్పనే ధ్యేయంగా అడుగులు - 5,341 సంస్థల స్థాపనకు ప్రభుత్వం ఆమోదం

**హైదరాబాద్:** రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగానే పారిశ్రామిక విస్తరణపై దృష్టిసారించింది. రాజధానిలోనే కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాలకు సైతం పరిశ్రమలు విస్తరించే దిశగా అడుగులు వేస్తోంది. గడిచిన 26 నెలల సమయంలోనే రాష్ట్రంలో 5,341 సూక్ష్మ మధ్య, భారీ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. వీటి ద్వారా రాష్ట్రానికి రూ.38,341.93 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసింది. దీంతో



తెలంగాణలో 1,31,083 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.పెట్టుబడుల విస్తరణపై దృష్టిరా ష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులు మారుతున్నట్లు తెలుస్తోంది. ఎక్కువ పెట్టుబడులు అవసరమయ్యే రంగాల్లో కార్యకలాపాలు విస్తరించడం, పరిశ్రమల సంఖ్య కంటే వాటిలో పెట్టుబడుల విలువ అధికంగా ఉండేలా చూడటం వంటివి రాష్ట్ర పారిశ్రామిక రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులకు సంకేతంగా ప్రభుత్వం భావిస్తోంది. పెట్టుబడుల అభివృద్ధి విధానాలపై పరిశ్రమల శాఖ తాజాగా ప్రభుత్వానికి నివేదించింది.

## జేఎన్‌టీయూలో అద్భుతం రివర్స్ బోర్లతో పెరుగుతున్న భూగర్భ జలాలు

**హైదరాబాద్:** సాధారణంగా హైదరాబాద్ నగరంలో ఎక్కడ చూసినా భూగర్భ జలాలు అడుగంటిపోతుంటాయి. వేసవి వచ్చిందంటే చాలు ట్యాంకర్ల కోసం ఎదురుచూపులు తప్పవు. కానీ జేఎన్‌టీయూ క్యాంపస్‌లో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నం. ఇక్కడ ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు ఎంత ఉన్నా భూగర్భ జలాలు మాత్రం సమృద్ధిగా ఉంటున్నాయి. ఇందుకు కారణం ఆ వర్సిటీ అనుసరిస్తున్న వినూత్న వర్షపు నీటి సంరక్షణ విధానమే.వర్షపు నీటి నిల్వకు రివర్స్? బోర్ల ఏర్పాటుప్రకృతి ప్రసాదించిన ప్రతి చుక్కనూ ఒడిసిపట్టి భూమిలోకి పంపాలనే ఉద్దేశంతో జేఎన్‌టీయూ జలవనరుల శాఖ ఈ బృహత్తర ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా క్యాంపస్ ప్రాంగణంలో వినూత్న రీతిలో రివర్స్ బోర్లను ఏర్పాటు చేశారు. వర్షపు నీటిని నిల్వ చేయడానికి ఏకంగా 11 ప్రాంతాల్లో 15 అడుగుల పొడవు, 5 అడుగుల వెడల్పు, 10 అడుగుల లోతు ఉండే భారీ నీటి తొట్టెలను నిర్మించారు.ఈ తొట్టెలలోకి చేరిన వర్షపు నీరు ఎలాంటి వృథా లేకుండా, కేవలం క్షణాల




వ్యవధిలో భూమి 200 అడుగుల లోతుకు వెళ్లేలా పకడ్బందీ సాంకేతిక ఏర్పాట్లు చేశారు. గురుత్వాకర్షణ శక్తి కారణంగా ఈ బావుల్లోకి ప్రవేశించిన నీరు వేగంగా భూమిలోకి ఇంకుతుంది. అలా రూ. 40 లక్షల వ్యయంతో మొత్తం 24 చోట్ల ఈ బోర్?వెల్స్‌ను ఏర్పాటు చేశారు.ప్రతి ఏడాది సుమారు 8 కోట్ల లీటర్ల నీరు భూమిలోకిఈ అద్భుతమైన విధానం ద్వారా జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ప్రతి సంవత్సరం సుమారు 8 కోట్ల లీటర్ల వర్షపు నీరు భూగర్భంలోకి చేరుతోంది. ఫలితంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నీటి మట్టాలు పడిపోతున్నా, క్యాంపస్‌లో మాత్రం జలకళ తప్పుకుండా ఉంది. ఇక్కడ వేసవిలో సైతం భూగర్భ జలమట్టం కేవలం 15 నుంచి 20 మీటర్ల లోతులోనే ఉంటోందని, శీతాకాలంలో ఇది 10 మీటర్ల కంటే తక్కువగా నమోదవుతోందని జలవనరుల శాఖ ప్రొఫెసర్ ఎం.వి.ఎస్. గిరిధర్ తెలిపారు. దీనివల్ల క్యాంపస్‌కు బయటి నుంచి తాగునీటి ట్యాంకర్లను తెప్పించుకోవాల్సిన అవసరమే లేకుండా పోయిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ప్రకృతిని రక్షించుకుంటూ, నీటిని వృథా చేయకుండా జేఎన్‌టీయూ చూపుతున్న ఈ చొరవ హైదరాబాద్?లోని ప్రతీ ఒక్కరికీ, ఇతర సంస్థలకు ఆదర్శంగా నిలుస్తోంది.

## రూ.256.75 కోట్ల పనుల బిల్లుల అప్‌లోడ్‌లో నిర్లక్ష్యం.. గోదావరి డెల్టా సీఈకి మెమో




**అమరావతి, అక్టోబర్ 19:** గోదావరి డెల్టా చీఫ్ ఇంజినీర్ (సీఈ) చినబాబుకు మెమో జారీ చేస్తూ ఏపీ ఇరిగేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సాగు నీటి వ్యవస్థను సక్రమంగా నిర్వహించేందుకు 2025లో మంజూరు చేసిన రూ.256. 75 కోట్ల పనులకు సంబంధించిన బిల్లులను నేటికీ అప్‌లోడ్ చేయడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై ఇరిగేషన్ శాఖ తీవ్రంగా స్పందించింది. నీటి సంఘాల ఓఅండ్ఎం పనులకు సంబంధించిన బిల్లులను రికార్డు చేసే పర్యవేక్షణలో అలసత్వం వహించినట్లు ఆ శాఖ గుర్తించింది. ఈ నేపథ్యంలో బిల్లులు అప్‌లోడ్‌లో జాప్యానికి గల కారణాలపై వివరణ ఇవ్వాలంటూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇరిగేషన్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఇంజినీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) ఇచ్చిన ఆదేశాలు పాటించకుండా నిర్లక్ష్యం వహించినందుకు గోదావరి డెల్టా సీఈ చినబాబుకుకి ఈఎన్సీ మెమో జారీ చేసింది. ఎస్వీఎస్ఎన్ వర్మ

## నారా లోకేశ్‌తో మిజోరం సీఎం భేటీ.. మున్సిపల్ ఎన్నికలపై విపక్షాలకు లోకేశ్ చురకలు

**ఉండవల్లి:** ఉండవల్లిలో మంత్రి లోకేశ్‌ను కలిసిన మిజోరం సీఎం లాల్‌దుహోమా పురపాలక ఎన్నికలకు 22,800కు పైగా నామినేషన్లు దాఖలయ్యాయన్న లోకేశ్ ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోందని చెప్పడానికి నిదర్శనమని వ్యాఖ్య ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో మిజోరం ముఖ్యమంత్రి లాల్‌దుహోమా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లాల్‌దుహోమాను శాలువాతో సత్కరించి, ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించుకున్నారు.ఇదిలా ఉండగా, రాష్ట్రంలో జరుగుతున్న పట్టణ



స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ఎన్నికలకు రికార్డు స్థాయిలో 22,800కు పైగా నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. రాష్ట్రం లోని ప్రతి పార్టీ, ప్రతి వర్గం, నలు మూలల నుంచి అభ్యర్థులు ముందుకు రావడం ప్రజాస్వామ్యం వర్ధిల్లుతో ందన దానికి నిదర్శనమని అన్నారు.ఒక్క ఓటు కూడా పడకముందే అక్రమాలు జరిగా యని ఆరోపించే వారు ఒక విషయం గుర్తుంచుకోవాలని లోకేశ్ హితవు పలికారు. "ఎన్నికల్లో గెలుపు క్షేత్రస్థాం యిలో ఉంటుంది కానీ, పత్రికా సమావే శాల్లో కాదు. ప్రజలను ఎదుర్కోండి, ప్రజలే ఫలితాలను నిర్ణయి స్తారు" అని ఆయన స్పష్టం చేశారు. అక్టోబర్ 28న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు జరగనున్న విషయం తెలిసిందే.

## ఏపీలో ప్రాదేశిక పోరుకు మోగిన నగారా - ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

**అమరావతి:** ఏపీలో స్థానిక సమరంలో భాగంగా ప్రాదేశిక పోరుకు నగారా మోగింది. ఇవాళ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 21 నుంచి 23 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ మేరకు మండల కేంద్రాల్లో ఎంపీటీసీ స్థానాలకు, జడ్పీ కార్యాలయంలో జడ్పీటీసీ స్థానాలకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈనెల 24న నామినేషన్ల పరిశీలన, 27న ఉపసంహరణకు అవకాశం ఉంది. నవంబర్ 3న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వెలువడనుంది. జడ్పీ డిప్యూటీ సీఈవోను ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుకు జిల్లా స్థాయి నోడల్ అధికారిగా నియమించనున్నారు.సరికొత్త సిస్టం తీసుకొచ్చి : రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో మూస పద్ధతులకు స్వస్తి చెప్పి పూర్తిగా సాంకేతిక అంశాలను జోడించి ఎన్నికలను నిర్వహించనున్నారు. దీనికోసం రాష్ట్ర ఎన్నికల



కమిషన్ 'ఎన్నికల మేనేజ్‌మెంట్ సిస్టం'(ఈఏంఎస్)ను తీసుకొచ్చింది. నిర్వహణకు సంబంధించి రిటర్నింగ్ అధికారులకు ఈఎంఎస్‌లో లాగిన్, పాస్‌వర్డ్, ఓటీపీ కోసం సాఫ్ట్‌వేర్ అందిస్తారు. ఇందులో లాగిన్ అయితే ఓటరు జాబితా, మండలాల్లో ఎన్ని ఎంపీటీసీ స్థానాలున్నాయి? ఎన్నికల విధానం ఏంటి? వంటి అంశాలన్నీ ఉంటాయి. ఎన్నికల అధికారులకు ఏ స్థాయిలో ఏ సమాచారాన్ని పంపించాలి ఏ నమూనాలో పంపించాలి? అనేవి ఇందులో పొందుపరిచి ఉంటాయి.మరోవైపు గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. నవంబర్ 26న మొదటి విడత, 29న రెండో విడత, డిసెంబర్ 2న మూడో విడత జరగనున్నాయి. తొలి విడతలో భాగంగా నవంబర్ 13న నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. నామినేషన్లకు నవంబర్ 17 వరకు గడువు విధించారు. ఉపసంహరణ గడువు నవంబరు 21 కాగా నవంబర్ 26న ఎన్నికలు నిర్వహించనున్నారు.నవంబర్ 16న రెండో విడత నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. నామినేషన్లకు నవంబర్ 20 వరకు గడువు విధించారు. ఉపసంహరణ గడువు నవంబరు 24 కాగా నవంబర్ 29న ఎన్నికలు నిర్వహించనున్నారు. మూడో విడత కోసం నవంబర్ 19న నోటిఫికేషన్ వెలువడనుంది. నామినేషన్లకు నవంబర్ 23 వరకు గడువు విధించారు. ఉపసంహరణ గడువు నవంబరు 27 కాగా డిసెంబర్? 2 ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలు జరిగిన రోజునే ఓట్ల లెక్కింపు ఉంటుంది.

## రాయచోటిలో 44 వార్డులు ఏకగ్రీవం.. చరిత్రాత్మక విజయమన్న మంత్రి మండిపల్లి



**అమరావతి, అక్టోబర్ 19:** రాయచోటి మున్సిపల్ ఎన్నికల్లో 44కు 44 వార్డులూ ఏకగ్రీవం అయ్యాయని.. ఇది చరిత్రాత్మక విజయమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. (సోమవారం) మీడియాతో మాట్లాడుతూ.. రాయచోటిలో వైసీపీ ప్రజా దరణ కోల్పోయిందని.. పోటీ చేసేందుకు ఆ పార్టీ నాయ కులే ముందుకు రాలేదని తెలి పారు. రెండున్నరేళ్లుగా ప్రజలకు దూరంగా ఉండి.. ఇప్పుడు ఎన్నికల సమయంలో అభ్యర్థులను పోటీకి ప్రోత్సహించడం విడ్డూరమని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ప్రజల్లోకి వెళ్లి ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని అన్నారు. వైసీపీ పోటీ చేయని వార్డుల్లోనూ ప్రజలకు అండగా ఉంటామని చెప్పారు.రాయచోటి అభివృద్ధిపై వైసీపీ నేతలతో బహిరంగ చర్చకు సిద్ధమని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనలో రాయచోటిలో అభివృద్ధి పనులు వేగవంతం అయ్యాయన్నారు. పట్టణ తాగునీటి సమస్య పరిష్కారానికి వెలిగల్లు జలాశయం నుంచి రెండో పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వంలో పార్కులు, ఇండోర్ స్టేడియం, సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. మాదకద్రవ్యాల ఆరోపణ

## ఏపీ హైకోర్టులో వైసీపీకి ఎదురుదెబ్బ.. పారామిలిటరీ బలగాల పిటిషన్ కొట్టివేత




**అమరావతి, అక్టోబర్ 19:** స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతిభద్రతల కోసం పారామిలిటరీ బలగాలను కేటాయించాలని వైసీపీ వేసిన పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. అంతకుముందు, స్థానిక ఎన్నికలకు పారామిలిటరీ బలగాలను రంగంలోకి దించాలంటూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.. సింగిల్ జడ్జి వద్ద పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. ఆ పిటిషన్‌ను కొట్టివేశారు. పశ్చిమబెంగాల్‌లో పరిస్థితులు, ఏపీ పరిస్థితులను పోల్చిచూడలేమని.. పారామిలిటరీ బలగాల అవసరం లేదని ఏపీ ప్రభుత్వం వాదించింది. ఇదే విషయాన్ని హైకోర్టు కూడా వ్యాఖ్యానించింది.ఈ నేపథ్యంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ డివిజనల్ బెంచ్‌లో వైసీపీ అప్పీల్ చేసింది. ఈ పిటిషన్‌పై వెకేషన్ బెంచ్ ఎదుట విచారణ జరిగింది. పారామిలిటరీ బలగాలు కావాలని కోరడంపై హైకోర్టులో వాదనలు జరిగాయి. వాదనల అనంతరం వైసీపీ వేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది.

## అహోబిలంలో అగ్నిప్రమాదం - 5 బొమ్మల దుకాణాలు, కూల్‌డ్రింక్స్ షాపు, 2 హోటళ్లు దగ్ధం

**నంద్యాల జిల్లా:** నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దిగువ అహోబిలంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆరు దుకాణాలు పూర్తిగా బూడిదయ్యాయి. బాధితులు లబోదిబోమంటూ ఏడుస్తున్నారు. ఈ ఘోర ప్రమాదం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.ప్రధాన ఆలయ మార్గంలో ప్రమాదం: దిగువ అహోబిలం ప్రధాన ఆలయానికి ఎదురుగా ఉన్న బీగల ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో ఈ అగ్నిప్రమాదం సంభవించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అర్ధరాత్రి వేళ మంటలు వేగంగా వ్యాపించడంతో మూడు బొమ్మల దుకాణాలు, ఒక కూల్‌డ్రింక్స్ షాపు, రెండు హోటళ్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి.లక్షల ఆస్తి నష్టం --లబోదిబోమంటున్న బాధితులు: ఈ ప్రమాదంలో సుమారు రూ.20 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు అంచనా వేస్తున్నారు. దసరా ఉత్సవాల వేళ వ్యాపారాల కోసం తెచ్చిపెట్టుకున్న సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతి కావడంతో వ్యాపారులు తీవ్ర ఆవేదన



వ్యక్తం చేస్తూ కన్నీరుమున్నీరవుతున్నారు.సకాలంలో స్పందించడంతో తప్పిన పెను ప్రమాదం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కొన్ని బొమ్మల దుకాణాలలో అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు వ్యాపించి, చివరికి ఒక కూల్?డ్రింక్స్? దుకాణం, రెండు బొమ్మల దుకాణాలు, రెండు హోటళ్లను పూర్తిగా దహించివేశాయి. అటుగా వెళుతున్న స్థానికులు, సమీపంలోని అవుట్‌పోస్ట్‌కు చెందిన పోలీసు సిబ్బంది మంటలను గమనించారు. వారు భోజనశాలల్లో ఒకదానిలో నిద్రిస్తున్న ఐదుగురిని అప్రమత్తం చేసి, గ్యాస్ సిలిండర్లను సురక్షిత ప్రాంతానికి తరలించగలిగారు, తద్వారా ఒక పెద్ద పెను ప్రమాదాన్ని నివారించారు. లేదంటే నష్టం మరింత తీవ్రంగా ఉండేదని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు, పూర్తి నష్టం వివరాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## ఏపీకి భారీగా పెట్టుబడులు.. త్వరలో మూడు ప్రాంతాల్లో సదస్సులు

**అమరావతి, అక్టోబరు 14:** విశాఖపట్టణంలో 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు నవంబరులో జరగనుంది. ఈ సదస్సు సన్నాహకంగా ఏపీ వ్యాప్తంగా 5 ప్రాంతీయ సదస్సుల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఇప్పటికే అక్టోబరు 7వ తేదీన విశాఖపట్నంలో, 12న కాకినాడలో రెండు సదస్సులు విజయవంతంగా పూర్తయ్యాయి.మిగిలిన 3 ప్రాంతీయ సదస్సులను అక్టోబరు 16వ తేదీన అమరావతిలో, అక్టోబరు 23వ తేదీన అనంతపురంలో, అక్టోబరు 26వ తేదీన తిరుపతిలో ఏపీ సర్కార్ నిర్వహించనుంది. ఈ మూడు సదస్సుల్లో మొత్తం 115 ఎంవోయూలు కుదుర్చుకునే అవకాశాలు ఉన్నాయి. ఈ సదస్సుల ద్వారా రాష్ట్రానికి రూ.79,628.04 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడులు రానున్నాయి. దీని ద్వారా సుమారు 1,8,038 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు పరిశ్రమలు, వాణిజ్య శాఖ అధికారులు వెల్లడించారు.ప్రధాన రంగాలివే..పరిపాలన, రాజధాని అభివృద్ధి, పట్టణ మౌలిక సదుపాయాలు, క్వాంటం వ్యాలీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఏరోస్పేస్-డిఫెన్స్, ఆటోమోటివ్, సహజ వ్యవసాయం, హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక ఇంధనం,




టూరిజం, ఆతిథ్యరంగం, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి, సెమీకండక్టర్లు, ఆధునిక మెటీరియల్స్, స్పేస్, పాదరక్షల రంగంలో పెట్టుబడులు రాబోతున్నాయి. ఇప్పటికే ముగిసిన రెండు ప్రాంతీయ సదస్సుల్లో 46 అవగాహన ఒప్పందాలు నమోదు కాగా, వాటి వివరాలు, తదుపరి సదస్సుల్లో ఒప్పందాలు చేసుకోబోయే కంపెనీల తాత్కాలిక జాబితా, పెట్టుబడుల వివరాలను ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

## అమలాపురంలో ఉద్రిక్తత.. చలాన్ల వివాదంతో టీడీపీ, వైసీపీ నేతల మధ్య తోపులాట



**కోనసీమ, అక్టోబర్ 19:** అమలాపురం మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ల స్క్రుటినీ సందర్భంగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. చలాన్ల పెండింగ్ పేరుతో మున్సిపల్ కార్యాలయంలో టీడీపీ నేతలపై వైసీపీ నేతలు దౌర్జన్యానికి పాల్పడ్డారు. దీంతో అక్కడ తోపులాట జరిగింది. ?15వ వార్డు నామినేషన్ల పరిశీలనలో టీడీపీ-వైసీపీ నాయకుల మధ్య తీవ్ర గందరగోళం నెలకొంది. ?బైక్ చలాన్ రూ.1000 పెండింగ్ ఉందంటూ టీడీపీ అభ్యర్థి నామినేషన్‌ను రద్దు చేయాలని వైసీపీ అభ్యర్థి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ?మున్సిపాలిటీకి రూ. 61 వేలు బకాయి ఉన్న వైసీపీ అభ్యర్థి చంద్రశేఖర్ నామినేషన్ రిజెక్ట్ చేయాలని టీడీపీ నేతలు ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ గందరగోళం నెలకొంది.అయితే మున్సిపాలిటీకి తప్ప బయటి చలాన్లతో సంబంధం లేదని మున్సిపల్ సిబ్బంది తేల్చిచెప్పారు. అయినప్పటికీ నామినేషన్ కేంద్రంలో ఒకరిపై ఒకరు కేకలు, అరుపులతో ఇరుపార్టీ నేతలు రెచ్చిపోయారు. ?టీడీపీ నాయకులపై వైసీపీ నేతలు దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ క్రమంలో మున్సిపల్ ఆఫీసులో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు పరిస్థితిని అదుపుచేసేందుకు యత్నించారు.

# దేశంలోనే అతిపెద్ద గ్యాంగ్‌స్టర్‌ను తమ అల్లుడిగా చేసుకున్నారు

**దిల్లీ:** బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ కారుపై జరిగిన కాల్పుల ఘటనపై ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. దేశంలో నేరాలు, భద్రత విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నించారు. నేర కార్యకలాపాలు నిర్వహించడానికి కేంద్రం ఒక గ్యాంగ్‌స్టర్‌కు సౌకర్యాలు కల్పించిందని ఆరోపించారు. బీజేపీ (ఎన్‌డీఏ) సొంతంగా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనూ శాంతిభద్రతలను కాపాడుకోలేకపోతోందని మండిపడ్డారు. దేశంలోనే అతిపెద్ద గ్యాంగ్‌స్టర్‌ను (లారెన్స్ బిష్ణోయ్) అల్లుడిలా చూసుకుంటూ, దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా నేరాలకు పాల్పడటానికి అతడికి అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని విమర్శించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. త్వరలో జరగబోయే పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల గురించి కూడా ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. అక్కడ కమలం పార్టీకి ఓటు వేయడమంటే పంజాబ్‌లోకి గ్యాంగ్‌స్టర్ (లారెన్స్ బిష్ణోయ్)ను ఆహ్వానించడమేనని హెచ్చరించారు.



ఈ విషయం పంజాబ్ ప్రజలకి తెలుసన్నారు. మరికొద్ది రోజుల్లో బీజేపీకి చెందిన వ్యక్తులు శాంతి భద్రతలపై ఉపన్యాసాలు ఇవ్వడానికి పంజాబ్‌కు వస్తారని ఎద్దేవా చేశారు. నటుడు టైగర్ ష్రాఫ్‌ను లక్ష్యంగా చేసుకుని జరిగిన కాల్పుల ఘటనకు బాధ్యులైన వారిని, వారిని వెనుక నుంచి నడిపిన వ్యక్తులను ముంబయి పోలీసులు పట్టుకుంటారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. ఇటువంటి చర్యలను ఏమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. నిందితుల గుర్తింపునకు సంబంధించి పోలీసులకు కీలక ఆధారాలు లభించాయని, త్వరలోనే వారిని అరెస్టు చేస్తారని చెప్పారు. నిందితులు మహారాష్ట్ర వెలుపల నుంచి బహుశా విదేశాల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. నిందితులను పట్టుకునేందుకు ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకోవడంతో పాటు కేంద్ర దర్యాప్తు సంస్థల సాయం కూడా తీసుకుంటామని అన్నారు. 'దాడికి పాల్పడిన వారు పిరికివారు. దాక్కుని దాడులకు ప్రయత్నిస్తున్నారు. వారి ప్రయత్నాలను అడ్డుకుంటాం. ఎవరినీ వదిలిపెట్టం. ఇటువంటి దాడులకు పాల్పడుతున్న వారిలో మహారాష్ట్రకు చెందిన కొందరిని ఇప్పటికే అరెస్టు చేశాం. రాష్ట్రం వెలుపల లేదా విదేశాల నుంచి పనిచేస్తున్న వారిని పట్టుకోవడానికి వివిధ దర్యాప్తు సంస్థల సమన్వయంతో చర్యలు తీసుకుంటాం. నేను టైగర్ ష్రాఫ్‌తో మాట్లాడాను. టైగర్ ష్రాఫ్‌పై దాడి ఘటనను ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణిస్తోంది. టైగర్ ష్రాఫ్‌కు తగిన భద్రత కల్పిస్తాం. ముంబయి పోలీసు విభాగం ఎంతో వృత్తి నైపుణ్యం కలిగిన బలగం. ప్రజలతో పాటు సినీ పరిశ్రమకు చెందిన వారికి కూడా ముంబయి పోలీసులపై నమ్మకం ఉంది' –దేవేంద్ర ఫడణవీస్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి

## రష్యా సైన్యంలో భారతీయ బాధిత కుటుంబాలకు పరిహారం వేగవంతం చేయాలి:



**ఢిల్లీ:** రష్యా – ఉక్రెయిన్ యుద్ధంలో బాధితులైన భారతీయుల కుటుంబాలకు పరిహార ప్రక్రియను సులభతరం చేయాలని కేంద్రానికి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రష్యా సైన్యంలో భారతీయుల మరణంపై సుప్రీంకోర్టు బుధవారం కీలక ఆదేశాలు ఇచ్చింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖలో బాధిత కుటుంబాల కోసం వెంటనే ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని కేంద్రాన్ని ఆదేశించింది. అలాగే రష్యా సైన్యంలో మరణించిన భారతీయులకు డీఎన్ఏ (ఐచీూ) పరీక్షలు నిర్వహించాలని.. ఇక బాధిత కుటుంబాలకు పరిహారం వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరింది. రష్యాలో భాష తెలియక ఇబ్బంది పడుతున్న బాధిత కుటుంబాలకు ప్రాంతీయ భాషల్లో సులభంగా సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సుప్రీంకోర్టు స్పష్టమైన సూచన చేసింది. ఏజెంట్ల మోసపూరిత ప్రకటనలను నమ్మి రష్యా వెళ్లిన వారిలో 49 మందిపైగా భారతీయులు మరణించారని సుప్రీంకోర్టు దృష్టికి ఈ సందర్భంగా కేంద్రం తీసుకెళ్లింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న దౌత్య పరమైన చర్యల కారణంగా.. రష్యా సైన్యం నుంచి 139 మందికి భారతీయులు సురక్షితంగా విడుదలయ్యారని సుప్రీంకోర్టుకు కేంద్రం వివరించింది.

## 'ఎవరినీ వదిలిపెట్టం'.. టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల నేపథ్యంలో సీఎం ఫడ్నవీస్ వార్నింగ్

**ముంబై:** బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై జరిగిన కాల్పుల ఘటనను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు బాధ్యులైన గ్యాంగ్, వ్యక్తులు ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ ఘటనను అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నామని, దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు ఇప్పటికే కొందరు అనుమానితులను పోలీసులు గుర్తించారని సీఎం వెల్లడించారు. నిందితులు ఎక్కడ దాక్కున్నా పోలీసులు వారిని పట్టుకుంటారని ఫడ్నవీస్ స్పష్టం చేశారు. ఇలాంటి బెదిరింపులతో కార్యకలాపాలు సాగించాలని ఎవరైనా ప్రయత్నిస్తే, వారిని ఎలా కట్టడి చేయాలో ముంబై పోలీసులకు బాగా తెలుసని సీఎం అన్నారు. ఈ ఘటనపై విలేకరుల సమావేశంలో సీఎం ఫడ్నవీస్ మాట్లాడుతూ.. దర్యాప్తులో పోలీసులకు కొన్ని కీలక ఆధారాలు లభించాయని, వాటి ఆధారంగా నిర్దిష్ట వ్యక్తులను గుర్తించామని చెప్పారు. వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని వెల్లడించారు. కాల్పులకు పాల్పడిన వారితో పాటు తెర




వెనుక ఉండి ఆదేశాలిస్తున్న సూత్రధారులను కూడా పట్టుకుంటామని తెలిపారు. లారెన్స్ బిష్ణోయ్‌ను కస్టడీలోకి తీసుకునే ప్రయత్నాలపై స్పందిస్తూ.. ఇప్పటికే కేంద్రానికి అభ్యర్థన పంపించామని, చట్టపరమైన ప్రక్రియ కొనసాగుతోందని ఫడ్నవీస్ చెప్పారు. సూత్రధారులు ప్రపంచంలో ఎక్కడ దాక్కున్నా వారిని పట్టుకుంటామని పేర్కొన్నారు. మహారాష్ట్రలో ఉండి కార్యకలాపాలు సాగిస్తున్న వారిని ఇప్పటికే అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో ఉంటూ నేరాలకు పాల్పడుతున్న వారిని గుర్తించేందుకు ఆయా రాష్ట్రాల సమన్వయం చేసుకుంటామని చెప్పారు.

## సీజేపీ నేతలకు ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ

**దిల్లీ:** జంతర్‌మంతర్ పరిసరాల్లో అనుమతి లేకుండా ప్రవేశించిన కేసులో కాక్రోచ్ జనతా పార్టీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. జంతర్‌మంతర్ వద్ద నిషేధాజ్ఞలను ఉల్లంఘించి, బారికేడ్లను దాటుకుంటూ ప్రవేశించినందుకు వారిపై ట్రెస్–పాసింగ్, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం వంటి సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. దీనిపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. పోలీసుల అదుపులో ఉన్నప్పటికీ వారి ఆత్మస్థైర్యం దెబ్బతీయలేరని పోస్ట్ చేశారు.
సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా, అజింక్యాను దిల్లీ పోలీసులు అరెస్ట్ చేసినట్లు సీజేపీ లీగల్ హెడ్ రత్నా సింగ్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో వీరిని పార్లమెంటు స్ట్రీట్ పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు ఆమె తెలిపారు. న్యాయవాదులను కలుసుకునేందుకు వారిని అనుమతించలేదని ఆరోపించారు. వారిని బుధవారం ఉదయం మేజిస్ట్రేట్



ఎదుట హాజరుపరచగా, సౌరవ్ దాస్, అశుతోష్‌కు ఐదురు రోజుల రిమాండ్‌ను విధించారు. కోర్టు ఆదేశాల అనంతరం ఇద్దరు సీజేపీ నేతలను పోలీసు స్టేషన్ నుంచి జైలుకు తరలించారు. జెండాను ఎగురవేయడమే తప్పాఇక ఇదే విషయాన్ని అభిజీత్ దీప్కే కూడా ధ్రువీకరించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకాకు ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. జంతర్‌మంతర్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడమే వారు చేసిన తప్పా? అని ప్రశ్నించారు. అసమ్మతి స్వరాలను అణచివేయాలనే ఉద్దేశం ప్రభుత్వానికి ఉంటే, పరోక్ష చర్యలకు బదులుగా ఎమర్జెన్సీని అధికారికంగా ప్రకటించే ధైర్యం చూపాలని ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రభుత్వ చర్యలను పిరికిపంద వ్యూహాలుగా అభివర్ణించారు. అంతుకు ముందు చేసిన పోస్ట్?లో సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా, అజింక్యా పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఉన్నట్లు కనిపిస్తున్న ఓ ఫొటోను పంచుకున్నారు. పోలీసుల అదుపులో ఉన్నప్పటికీ వారి ఆత్మస్థైర్యం దెబ్బతీయలేరని అంటూ కార్యకర్తలను ఉద్దేశించి రాసుకొచ్చారు.'వందేమాతరం అన్నందుకే జైలుకు పంపారు'తనతో పాటు సౌరవ్ దాస్, ఆశుతోష్ రాంకా, పార్టీ కార్యకర్తలు జంతర్‌మంతర్ వైపు వెళ్లి భారత జెండాను ప్రదర్శించడంతో పాటు 'వందేమాతరం', 'భారత్ మాతా కీ జై' నినాదాలు చేశారని అజింక్యా శిందే తెలిపారు. ఈ కారణంగానే సౌరవ్, ఆశుతోష్‌కు ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారని ఆరోపించారు. కార్యాచరణపై చర్చించేందుకు సీజేపీ జాతీయ కార్యవర్గం బుధవారం సమావేశం కానుందని తెలిపారు. సమావేశం అనంతరం పార్టీ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు.

## చెరకు రైతుల ఆందోళనలు.. ప్రధాని మోదీకి కర్ణాటక సీఎం డీ.కే. శివకుమార్ లేఖ

**బెంగళూరు, అక్టోబర్ 18:** ఉత్తర కర్ణాటకలో చెరకు రైతుల ఆందోళనల కారణంగా చక్కెర మిల్లుల్లో చెరకు క్రషింగ్ నిలిచిపోవడంతో ఏర్పడిన సంక్షోభాన్ని పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ కర్ణాటక ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నివాసాన్ని ముట్టడించేందుకు రైతులు నిర్వహిస్తున్న పాదయాత్రలు, రహదారుల దిగ్బంధనాల వల్ల ప్రజాజీవితం తీవ్రంగా ప్రభావితమవుతోందని, చెరకు పంట చేతికొచ్చి పొలాల్లోనే పాడైపోతోందని సీఎం లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి లేఖలోని ప్రధానాంశాలు1. చక్కెర మద్దతు ధర (మీూ) పెంపుఫిబ్రవరి 2019 నుంచి చక్కెర కనీస మద్దతు ధర కిలోకు రూ. 31 గానే ఉంది. కానీ, చెరకు మద్దతు ధర టన్నుకు రూ. 2,750 నుంచి రూ. 3,650కి పెరిగింది. పాత చక్కెర ధరల వద్ద మిల్లులు రైతులకు సరైన గిట్టుబాటు ధరను చెల్లించలేకపోతున్నందున వెంటనే ఎంఎస్‌పీని సవరించాలని కోరారు. 2. దేశీయ, వాణిజ్య అవసరాలకు వేర్వేరు ధరలుసాధారణ గృహ వినియోగదారులకు భారం పడకుండా ఉంటూనే, బల్క్



కమర్షియల్ కొనుగోలుదారుల నుంచి సరైన ధర రాబట్టేలా చక్కెర ధరల వర్గీకరణ చేయాలని సూచించారు. 3. ఇథనాల్ సేకరణ టెండర్ విధానం సమీక్షఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ాపీజం) ఇటీవల విడుదల చేసిన టెండర్లలో చెరకు రసం, షుగర్ సిరప్ ద్వారా తయారు చేసే ఇథనాల్‌ను మినహాయించడం సరికాదని పేర్కొన్నారు. ఇది మిల్లుల ఆదాయాన్ని దెబ్బతీసి, రైతులకు చెల్లింపులు నిలిచిపోయేలా చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. 4. చెరకు ఆధారిత ఇథనాల్ ధరల పెంపుఎఫ్‌ఆర్‌పీ నిరంతరం పెరుగుతున్నప్పటికీ, చెరకు రసం ద్వారా తయారు చేసే ఇథనాల్ ధరలు 2022–23 నుంచి పెరగలేదని, ధాన్య ఆధారిత ఇథనాల్ ధరలను పెంచినట్లే వీటిని కూడా పెంచాలని కోరారు. 5. ఎఫ్‌ఆర్‌పీ రికవరీ బేస్ 9.50శాతానికి తగ్గింపుచెక్కెర రికవరీ బేస్‌ను 10.25శాతానికి పెంచడం వల్ల తక్కువ రికవరీ ఉండే ప్రాంతాల రైతులకు పూర్తి ఎఫ్‌ఆర్‌పీ అందడం లేదని, పాత పద్ధతి ప్రకారం దీనిని తిరిగి 9.50శాతంకి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలురాష్ట్ర పరిధిలోని అధికారాలను ఉపయోగించి ఇప్పటికే చక్కెర మిల్లుల డిజిటల్ వేయింగ్ సిస్టమ్, ల్యాబ్ అక్రిడిటేషన్లు, టన్నుకు అదనంగా రూ. 100 చొప్పున (ఇందులో రూ. 50 రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ) రైతులకు రూ. 290 కోట్లు విడుదల చేసినట్లు లేఖలో స్పష్టం చేశారు. అయితే, రైతుల ప్రధాన డిమాండ్లు కేంద్ర పరిధిలోనే ఉన్నందున ప్రధాని మోదీ తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## నేహాబోరాకు ఢిల్లీ పోలీసుల నోటీసులు.. హైకోర్టును ఆశ్రయించిన ఏఐఎస్ఏ అధ్యక్షురాలు



**ఢిల్లీ, అక్టోబర్ 19:** ఢిల్లీ పోలీసులు తనకు జారీ చేసిన నోటీసులను వెంటనే నిలిపివేయాలని ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్(ఏఐఎస్ఏ) అధ్యక్షురాలు నేహా బోరా. ఈ నోటీసులు వెనక్కి తీసుకునేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన వ్యాజ్యంపై తక్షణమే విచారణ చేపట్టాలని న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారామె. పోలీసుల నోటీసులు అస్పష్టంగా ఉన్నాయని ఆమె విమర్శించారు. అంతేకాకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21లను అతిక్రమిస్తున్నాయని ఆరోపించారు. ఈ మేరకు ఏఐఎస్ఏ ఓ ప్రకటన విడుదల చేసింది. బీఎన్ఎస్ఎస్ చట్టంలోని 126, 130 సెక్షన్ల కింద ఢిల్లీలోని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు కావాలని నేహా బోరాను ఢిల్లీ పోలీసులు ఆదేశించారు. విచారణ సమయంలో శాంతి భద్రతలను కాపాడాలని ఆమెకు పోలీసులు స్పష్టం చేశారు. అందుకోసం వ్యక్తిగత పూచికత్తుతోపాటు రూ.10 వేల బాండ్‌పై సంతకం చేయాలని కూడా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నేహా బోరా.. ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆమె తరఫు న్యాయవాదుల బృందం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

## జంతర్‌మంతర్ వద్ద ఆంక్షలు, సీజేపీ సభ్యుల అరెస్ట్‌పై ప్రకాష్ రాజ్ ఆగ్రహం

**న్యూఢిల్లీ:** దేశ రాజధానిలోని చారిత్రాత్మక నిరసన వేదిక అయిన జంతర్‌మంతర్‌పై విధించిన ఆంక్షలు, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) సభ్యుల అరెస్ట్‌పై ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జాతీయ జెండాతో జంతర్‌మంతర్‌లోకి ప్రవేశించిన సీజేపీ సభ్యులు సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకాలను పోలీసులు అరెస్టు చేసి ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి తరలించాడు. దీనిపై ప్రకాశ్ రాజ్ తీవ్ర విచారం వ్యక్తం చేశాడు. ఈ మేరకు ఎక్స్ (ఓ) వేదికగా ఓ వీడియోను విడుదల చేశాడు. ప్రకాష్ రాజ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ తీరును, జంతర్‌మంతర్‌ను నిరసన వేదికగా డీనోటిఫై చేయడాన్ని తీవ్రంగా తప్పుపట్టాడు. ప్రభుత్వాలు నిరసన వేదికలను మార్చగలవేమో కానీ, ఈ దేశ ప్రజల గొంతును ఎప్పటికీ అణచివేయలేవని అతడు హెచ్చరించారు. 'నిరసన వేదికను మార్చవచ్చు. నిరసలను ఆపొచ్చు.. కానీ ఈ దేశ ప్రజల గొంతును




ఎవరూ ఆపలేరు. కేంద్రం తీసుకున్న చర్యల కారణంగా ఇప్పుడు దేశమంతా జంతర్ మంతర్‌గా మారుతుంది' అంటూ ప్రకాశ్ రాజ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ప్రజలు నిత్యం ప్రభుత్వాలను ప్రశ్నిస్తూనే ఉంటారని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే చర్యలను ప్రజలు సహించబోరని ప్రకాశ్ రాజ్ వెల్లడించాడు. గతంలో బెంగళూరులో జరిగిన సీజేపీ నిరసన కార్యక్రమంలో తాను కూడా భాగస్వామ్యమయ్యానని గుర్తుచేస్తూ.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం గళం విప్పడం ప్రతి ఒక్కరి బాధ్యత ప్రకాష్ రాజ్ అభిప్రాయపడ్డాడు.

## భారత్.. ఫ్రాన్స్, బంగ్లాదేశ్‌లా కాదు.. 'పాలకవర్గ మార్పు' ఆరోపణలను ఖండించిన కాంగ్రెస్

**దిల్లీ:** ఫ్రాన్స్, బంగ్లాదేశ్‌లలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు, అల్లర్లతో భారతదేశంలోని పరిస్థితులను పోల్చడాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండించింది. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక నిఘా సవరణ ప్రక్రియపై ప్రతి పక్షాల నిరసనల నేపథ్యాన్ని ఈ ఘటనలతో ముడిపెట్టడం సరికాదని స్పష్టం చేసింది. శశి థరూర్ స్పష్టతభారతదేశం.. బంగ్లాదేశ్ లేదా ఫ్రాన్స్ కాదని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పష్టం చేశారు. 'మేం ఎలాంటి హింసను లేదా బస్సులకు, పోలీస్ స్టేషన్లకు నిప్పు పెట్టే చర్యలను ఎప్పుడూ ప్రోత్సహించం. రాజ్యాంగబద్ధమైన, శాంతియుత నిరసనలను మాత్రమే విశ్వసిస్తాం' అని ఆయన అన్నారు. ప్రభుత్వాన్ని కూల్చే లేదా మార్చే ప్రయత్నం జరుగుతోందనే ఆరోపణలను ఆయన తప్పుపట్టారు. ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో ప్రజల పేర్లను నిబంధనలకు విరుద్ధంగా తొలగించారనే ఆందోళనతోనే నిష్పక్షపాత, స్వేచ్ఛాయుత



ఎన్నికలు జరగాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. పవన్ ఖేరా వ్యాఖ్యలుభారత్‌ను ఫ్రాన్స్, బంగ్లాదేశ్‌లతో పోల్చడంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. భారత్‌లో పాలకవర్గ మార్పు కోసం కుట్రలు జరుగుతున్నాయన్న ఆరోపణలను తోసిపుచ్చింది. భారత్‌ను ఫ్రాన్స్, బంగ్లాదేశ్‌లతో పోల్చడంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. భారత్‌లో పాలకవర్గ మార్పు కోసం కుట్రలు జరుగుతున్నాయన్న ఆరోపణలను తోసిపుచ్చింది.
భారత్‌లోని పరిణామాలను ఐరోపా దేశాలతో పోల్చడం ఆపిల్ పండ్లను ఆరంజ్ పండ్లతో పోల్చడమే అవుతుందని రాజ్యసభ ఎంపీ పవన్ ఖేరా మండిపడ్డారు. ఐరోపాలో నిరసనకారులే అల్లర్లకు దిగుతుంటే, భారత్‌లో మాత్రం ప్రభుత్వాలే శాంతియుతంగా నిరసనలు తెలిపే ప్రజలపై కఠిన చర్యలు తీసుకుంటున్నాయని ఆరోపించారు. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపణలుఈ వివాదంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ, బంగ్లా దేశ్, ఫ్రాన్స్‌ల తరహాలోనే భారతదేశంలో కూడా వీధుల్లో హింసను ప్రేరేపించేందుకు కుట్రలు పన్నారని ఆరోపించారు. భారత్‌లో పాలకవర్గ మార్పు అనేది ప్రజాస్వామ్య ఎన్నికల ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని, కుట్రలు లేదా విదేశీ శక్తుల వల్ల కాదని వ్యాఖ్యానించారు.

# సంపాదకీయం

## పునర్విభజనతో ఆర్థిక భారం



దేశ రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. ఇరాన్ యుద్ధం వలన దేశం లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి, ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యం లో కేంద్రంలోని పాలక, ప్రతిపక్షాలు విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయాలకు పదును పెడుతున్నాయి. దురదృష్టవశాత్తూ జెన్ జీలకు కూడా ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు పట్టడం లేదు. సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోసం ఒకవైపు సిజెపి, మరోవైపు ఇండీ కూటమి ఎన్డిఎ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడిని కొనసాగిస్తూ, నిరసనలతో దేశ రాజధానిలోను, ఇతర రాష్ట్రాల్లోను తమ ఆందోళనలను ఉధృతం చేస్తుండగా, మరొక వైపు కేంద్ర ప్రభుత్వం ప్రత్యర్థులను కట్టడి చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఇంతకు ముందే జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి సంబంధించి, కాక్రోచ్‌లు నిర్వహించిన ఉద్యమానికి స్పందించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించి, సోనమ్ వాంగ్‌చుక్ చేత నిరాహార దీక్ష విరమింప చేసిన కేంద్ర ప్రభుత్వ పెద్దలపై మరోసారి ఒత్తిడి పెంచి, ఇప్పుడు సిఇసి జ్ఞానేశ్ కుమార్ చేత రాజీనామా చేయించాలని వైరి పక్షాలు పట్టుబడుతున్నాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో బొద్దింకల ఉద్యమాన్ని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు ప్రస్తుతం సిఇసి విషయంలో తలెత్తిన నిరసన జ్వాలలను పట్టించుకోవడం లేదు. జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న సిజెపి, ప్రతిపక్షాల ఆందోళనలను అణచివేయడానికే ఎన్డిఎ ప్రభుత్వం మొగ్గు చూపడం గమనార్హం. ప్రత్యర్థుల ఆందోళనలకు లొంగిపోతే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా తాము వారు చేసిన ఆరోపణలను అంగీకరించినట్టే అవుతుందని భావించి ఉండవచ్చు. అందుకే ఈ నిరసనలను పట్టించుకోకుండా, పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి డీలిమిటేషన్ బిల్లుతోపాటు, మహిళలకు చట్టసభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోద ముద్ర వేయించుకోవాలని ప్రయత్నిస్తున్నది. ఈ బిల్లులు ప్రస్తుతం జరుగుతున్న సిజెపి, విపక్షాల నిరసనల నుండి దారి మళ్ళించడానికా? లేక ప్రతిపక్షాలు మహిళల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని ప్రజల్లో దురభిప్రాయం కలిగించడానికా? అనే అంశాలను పక్కనబెడితే డీలిమిటేషన్ బిల్లును, మహిళల రిజర్వేషన్ల బిల్లుతో ముడిపెట్టి, తాము అనుకున్న లక్ష్యం సాధించడానికే సన్నద్ధమవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో డీలిమిటేషన్ బిల్లుపై వ్యతిరేక గళం వినిపించిన స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె ప్రస్తుతం ఎన్డిఎకు దగ్గరవుతున్న సూచనలు అగుపిస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ నుండి చీలిన పలువురు ఎంపిలు, ఇతర పార్టీలకు చెందిన సభ్యులు ఈ బిల్లులను గట్టెక్కించడంలో సహకరిస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి. 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని, పార్లమెంటు లోను, కేంద్రంలోను దక్షిణాది రాష్ట్రాల ప్రాభవం తగ్గి, ఉత్తరాది రాష్ట్రాలు ఆధిపత్యం చెలాయిస్తాయనే వాదన సత్యదూరం కాదు. అయితే లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల చట్టసభల సీట్లను 50 శాతం పెంచి పునర్విభజన చేపట్టడం కొంతలోకొంత ఉపశమనం కలిగించే చర్య అయినప్పటికీ, ఇది పూర్తి స్థాయిలో సంతృప్తి కలిగించే చర్య మాత్రం కాబోదు. ప్రతిపక్షాలు సూచించిన విధంగా డీలిమిటేషన్ బిల్లు పక్కన బెట్టి, ఇప్పుడున్న 543 స్థానాల్లోనే మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడానికి కేంద్రం అంగీకరించదు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే ఉత్తరాది రాష్ట్రాలు సీట్ల విషయంలో అధికంగా లబ్ధి పొందుతాయి. దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. ఉత్తరాది ప్రాబల్యం పెరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గి, తీవ్ర వివక్షకు గురయ్యే అవకాశాలున్నాయి. నిజానిజాల సంగతి ఎలా ఉన్నా, ఇప్పటికే కేంద్రం దక్షిణాది రాష్ట్రాలనుండి అధిక మొత్తంలో పన్నులు గుంజి, దక్షిణాదికి లాంఛనంగా నాలుగు మెతుకులు విదుల్చుతూ, ఉత్తరాదికి మేలు చేస్తున్నదనే వాదన విస్తృతంగా వ్యాప్తిలో ఉంది. డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు జోరందుకోవడంతో అప్రమత్తమైన కేంద్రం అన్ని రాష్ట్రాల అసెంబ్లీ, లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచుతామని ప్రకటించింది. అయితే కేంద్రం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లులో ఈ విషయమై స్పష్టత కొరవడిందని ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ గతంలోనే నిలదీసింది. అయితే గతంలో ప్రవేశపెట్టిన బిల్లులోని అంశాలను మారుస్తారా? లేక యథాతథంగా బిల్లును ప్రవేశపెడతారా? కాంగ్రెస్ కోరినట్టు ప్రతిపక్షాలతో సంప్రదిస్తారా? అనే విషయాలపై సందిగ్ధత తొలగితే కాని, ఈ అంశంపై పూర్తి స్థాయిలో స్పష్టత రాదు. ప్రస్తుతం దేశంలో పెద్ద రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌కు తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు లోక్‌సభ లో 55 సీట్ల వ్యత్యాసముంది. మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణ విషయంలో 63 సీట్ల వ్యత్యాస ముంది. తమిళనాడుతో పోల్చిచూస్తే ప్రస్తుత యుపి లోక్ సభ సీట్లు 41 సీట్లు అధికం. జనాభా ప్రాతిపదికన కాకుండా అన్ని రాష్ట్రాలకు 50 శాతం సీట్లు పెంచితే ఆంధ్ర, యుపిల మధ్య 82 సీట్లు, తెలంగాణాతో పోల్చి చూస్తే 94 సీట్లు, తమిళనాడు, యు.పి ల మధ్య 61 సీట్ల వ్యత్యాసముంటుంది. ఏ విధంగా చూసినా పెద్ద రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య భారీగా పెరిగే అవకాశాలున్నాయి. ప్రస్తుతమున్న లోక్‌సభ సీట్ల సంఖ్య 543 నుండి 816కు పెంచడం వలన పెరిగే లోక్‌సభ సభ్యుల సంఖ్య వలన ప్రభుత్వ ఖజానాపై మరింత భారం పడే అవకాశముంది. ఇక రాష్ట్రాల్లో పెరిగే శాసన సభ్యుల సంఖ్య వలన కూడా విపరీతమైన ఆర్థిక భారం పడుతుంది. ఈ భారాన్ని ప్రజల మీద మోపడం భావ్యమా? ఇప్పటికే సామాన్య ప్రజలపై వివిధ మార్గాల్లో ప్రభుత్వాలు ఆర్థిక భారం మోపుతున్నాయి. పెద్ద పెద్ద నియోజకవర్గాలను విభజించి, అధికార వికేంద్రీకరణ చేయడం సముచితమే. అయితే ప్రభుత్వ నిర్ణయాలు కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నా లుక ఊడిన చందంగా పరిణమించరాదు. డీలిమిటేషన్ హేతుబద్ధంగా జరగాలి. ఉత్తర, దక్షిణ భారతాల మధ్య విభేదాలు తలెత్తకూడదు. డీలిమిటేషన్‌పై లోతైన మేధోమథనం జరగాలి. తీవ్రమైన కసరత్తు జరగాలి. అందరికీ ఆమోదయోగ్యం పద్ధతిలో డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టాలి.




# వ్యర్థాలతో అనర్థాలు

అరచేతిలో ప్రపంచం.. అడుగడుగునా సాంకేతికత.. నిమిషాల్లో సమాచార మార్పిడి.. క్షణాల్లో పనుల పూర్తి! ఇదీ నేటి డిజిటల్ యుగం తీరు. ఒకప్పుడు విలాస వస్తువులుగా ఉన్న సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు నేడు ప్రతి ఇంటి అవసరాలుగా మారాయి. సాంకేతికత పెరిగింది.. సౌకర్యాలు పెరిగాయి.. జీవితం వేగం పుంజుకుంది. కానీ, ఈ అభివృద్ధి వెనుక మరో ముప్పు నిశ్శబ్దంగా పొంచి ఉంది. అదే ఈ -వ్యర్థాల సమస్య! సాంకేతిక పరికరాలను తరచూ మార్చుకోవాలనే ఆసక్తి, కొత్త మోడళ్లపై మోజు, మరమ్మతులు చేయించుకోవడం కంటే కొత్త పరికరాలు కొనుగోలు చేయడానికి ప్రాధాన్యత ఇవ్వడం ఈ- వ్యర్థాలు పెరగడానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. దీనికి తోడు పాత ఎలక్ట్రానిక్ పరికరాలను ఎలా సేకరించాలి? ఎక్కడ అప్పగించాలి? అనే విషయాలపై ప్రజల్లో తగిన అవగాహన లేకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. ఐక్యరాజ్యసమితి నివేదికల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఏటా కోట్ల టన్నుల ఈ- వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని సక్రమంగా సేకరించి, శాస్త్రీయ పద్ధతుల్లో రీసైక్లింగ్ చేయకపోతే పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఎలక్ట్రానిక్ పరికరాల్లో సీసం, పాదరసం, కాడ్మియం వంటి హానికర పదార్థాలు ఉంటాయి. వీటిని సాధారణ చెత్తతో కలిపి పారేయడం, బహిరంగంగా కాల్చడం వల్ల నేల, నీరు, గాలి కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ఈ కాలుష్యం మానవ ఆరోగ్యంపై, ముఖ్యంగా నాడీ వ్యవస్థ, మూత్రపిండాలు, శ్వాసకోశంపై ప్రతికూల ప్రభావాలు చూపవచ్చు. అందుకే ఈ - వ్యర్థాల నిర్వహణ కేవలం పర్యావరణ సమస్యే కాదు.. ప్రజారోగ్యానికి సంబంధించిన కీలక అంశం కూడా. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సిపిసిబి) గణాంకాల ప్రకారం, భారతదేశంలో ఈ -వ్యర్థాల ఉత్పత్తి 2023 -24లో సుమారు 12.54 లక్షల టన్నులుగా ఉండగా, 2024 -25లో సుమారు 13.98 లక్షల టన్నులకు పెరిగింది. అంటే, ఏడాదిలోనే వ్యర్థాల పరిమాణం గణనీయంగా పెరిగింది. అదే సమయంలో సేకరణ, రీసైక్లింగ్ తదితర నిర్వహణకు సంబంధించిన నివేదిత శాతం 61.94 నుంచి 70.71 శాతానికి పెరిగినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఇది కొంత సానుకూల పరిణామమే



అయినప్పటికీ, మిగిలిన వ్యర్థాలను కూడా సక్రమంగా నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఈ -వ్యర్థాల నిర్వహణలో తెలంగాణ కూడా ముందడుగు వేస్తోంది. రాష్ట్రంలో నమోదైన ఈ- వ్యర్థాల రీసైక్లర్ల సంఖ్య 2023- 24లో 14 ఉండగా, 2024- 25లో 19కి పెరిగింది. హైదరాబాద్‌లో ఈ- వ్యర్థాల రీసైక్లింగ్ సాంకేతికతల అభివృద్ధికి ప్రత్యేక జవత్‌తీవ శీట జుఇఎవశ్రీశ్రీవఅఎవ ఏర్పాటు చేయడం ఈ రంగానికి పెరుగుతున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది. అయితే, రీసైక్లింగ్ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు ప్రతి ఇంటినుంచి వ్యర్థాలు అధికారిక సేకరణ వ్యవస్థకు చేరేలా చర్యలు తీసుకోవాలి. ఈ- వ్యర్థాలు పూర్తిగా పనికిరాని చెత్తకాదు. వాటిలో బంగారం, వెండి, రాగి, అల్యూమినియం, పల్లాడియం వంటి 17 రకాల విలువైన లోహాలు ఉంటాయి. ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా వీటిని తిరిగి వెలికితీసి వినియోగించుకోవచ్చు. అలాగే కొన్ని పరికరాల్లోని భాగాలను మరమ్మతు చేసి తిరిగి ఉపయోగించవచ్చు. ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి విలువైన పదార్థాలను తిరిగి పొందడం వల్ల సర్క్యులర్ ఎకానమీకి బలమైన వనరుగా మారడంతో పాటు సహజ వనరులపై ఒత్తిడి తగ్గుతుంది. కొత్త లోహాల తవ్వకం, శుద్ధి కోసం అవసరమయ్యే శక్తి, ముడిసరుకుల వినియోగాన్ని కూడా కొంత మేర తగ్గించవచ్చు. ఈ విషయాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఉదాహరణ టోక్యో ఒలింపిక్స్. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో అథ్లెట్లకు అందించిన పతకాల తయారీకి ప్రజల నుంచి సేకరించిన పాత ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి తిరిగి పొందిన లోహాలను ఉపయోగించారు. వ్యర్థాలను విలువైన వనరులుగా మార్చవచ్చని జపాన్ ప్రపంచానికి చాటిచెప్పింది. ఇదే స్ఫూర్తితో మనమూ 'వేస్ట్ టు వెల్త్' భావనను ఆచరణలోకి తీసుకురావాలి. భారతదేశంలో ఈ -వ్యర్థాల నిర్వహణకు సంబంధించి తొలిసారిగా 2011లో నిబంధనలు తీసుకొచ్చారు. అనంతరం 2016లో కొత్త నిబంధనలు రూపొందించి, 2018లో సవరణలు చేశారు. ప్రస్తుతం ఈ వ్యర్థాల నిర్వహణకు సంబంధించి 2022 నిబంధనలు 2023 ఏప్రిల్ 1 నుంచి అమల్లో ఉన్నాయి. ఈ నిబంధనల్లో 'విస్తరించిన ఉత్పత్తిదారుల బాధ్యతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. అంటే, ఎలక్ట్రానిక్ పరికరాలను తయారు చేసే సంస్థలు వాటి వినియోగం ముగిసిన తర్వాత ఏర్పడే వ్యర్థాల సేకరణ, రీసైక్లింగ్ బాధ్యతలను నిబంధనలకు అనుగుణంగా నిర్వర్తించాలి. సిపిసిబి నిర్వహించే ఈ- వ్యర్థాల ఇపిఆర్ పోర్టల్ ద్వారా సంబంధిత సంస్థల నమోదు, రీసైక్లింగ్ బాధ్యతల పర్యవేక్షణకు వ్యవస్థ ఉంది. అయితే, చట్టాలు చేయడం ఎంత ముఖ్యమో వాటిని సమర్థంగా అమలు చేయడం కూడా అంతే ముఖ్యం. ప్రజలు, ఉత్పత్తిదారులు, రీసైక్లర్లు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి. ఈ -వ్యర్థాలపై ప్రజల్లో అవగాహన పెంచడంలో పాఠశాలలు, కళాశాలలు కీలక పాత్ర పోషించాలి. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల వర్గీకరణ, రీసైక్లింగ్‌పై అవగాహన కల్పించాలి. విద్యార్థులు తమ ఇళ్లలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ ఈ -వ్యర్థాలపై అవగాహన కల్పిస్తే ఈ కార్యక్రమం మరింత విస్తృతమవుతుంది. ఇలా చిన్న స్థాయిలో ప్రారంభమైన ప్రయత్నాలు పెద్ద సామాజిక మార్పునకు దారితీస్తాయి. సాంకేతిక అభివృద్ధిని ఆపడం సాధ్యం కాదు. కానీ దాని వల్ల ఏర్పడే వ్యర్థాలను బాధ్యతాయుతంగా నిర్వహించడం మన చేతుల్లోనే ఉంది. ఈ -వ్యర్థాలను నిర్లక్ష్యంగా పారేస్తే అవి పర్యావరణానికి ముప్పుగా మారతాయి. అదే శాస్త్రీయ పద్ధతుల్లో సేకరించి, పునర్వినియోగించి, రీసైక్లింగ్ చేస్తే విలువైన వనరులుగా మారతాయి.

# కడలి తరగలను ఆపగలరా!

'ఢిల్లీ హైకోర్టు ప్రధానద్వారం వద్ద మేము ధర్నా చేస్తాం. అక్కడ పాదచారుల సౌకర్యం కోసం అవసరమైన ఫుట్‌పాత్ లు నిర్మించకపోతే ధర్నా తప్పదు. మాతోపాటు ప్రభుత్వ అధికారిని కూడా ఇంటికి వెళ్లనివ్వకుండా ధర్నాలో కూర్చోబెడతాం' ఈ మాటలన్నది పాలనతో విసుగు చెందిన ఏ సామాన్య పౌరులో కాదు. సాక్షాత్తూ సుప్రీం కోర్టుకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం పాదచారులు సురక్షితంగా నడవడానికి అవసరమైన ఫుట్‌పాత్‌లు ప్రజల ప్రాథమిక హక్కు అని ఒక కేసు విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ కేవీ వినోద్ చంద్రన్ వ్యాఖ్యానించారు. హాస్యానికి అంటున్నట్టు కనిపించినా ఈ న్యాయమూర్తుల ప్రకటనలో ఒక హెచ్చరిక ధ్వనించింది. ఇద్దరు సుప్రీం కోర్టు న్యాయమూర్తుల నోటివెంట ధర్నా అనే మాట ఎందుకు వచ్చింది? ఏదైనా సమస్య పరిష్కారం నోచుకోకుండా ఉన్నప్పుడు ప్రభుత్వాల దృష్టిని ఆకర్షించడానికి సాధారణంగా సామాన్య ప్రజలు చేసే పని.. ధర్నాలు, నిరసన ప్రదర్శనలు, ఊరేగింపులు, బహిరంగ సభలు నిర్వహించడం. ఇవి ప్రజాస్వామ్యంలో ప్రజల శాంతియుత పోరాటానికి ఉద్దేశించిన ఆయుధాలు. అయితే శాంతియుతంగా నిరసన చేస్తున్న క్రమంలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి జైహింద్ అని నినదించడానికి సిద్ధపడిన యువకులను శాంతిని భంగం చేస్తున్నారని పోలీసులు అరెస్టు చేసి కేసులు పెట్టడం భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక విచిత్రమైన ఘట్టం. బ్రిటన్, కెనడా తదితర దేశాల్లో కాక్రోచ్ జనతా పార్టీ పోరాటానికి మద్దతుగా భారత సంతతికి చెందిన యువతీ యువకులు త్రివర్ణ పతాకాన్ని వీధుల్లో స్వేచ్ఛగా ఎగరేస్తుంటే, తాము తప్ప ఎవరూ దేశభక్తులు కారని చెప్పుకునే పార్టీ అధికారంలో ఉన్న భారతదేశంలో జాతీయ పతాకాన్ని ఎగరేస్తే అరెస్టులా! న్యాయమూర్తులే రోడ్డెక్కి నిరసనలు తెలపడానికి సిద్ధపడుతుంటే ఇక సామాన్యుల గురించి వేరే చెప్పాలా! ఈ దేశంలోని యువత పలు సమస్యల మీద ఆందోళన ద్వారా ప్రభుత్వం కళ్లు తెరిపించే ప్రయత్నాల్లో భాగంగా శాంతియుత పద్ధతుల్లోనే రకరకాల ప్రక్రియల్లో నిరసన కార్యక్రమాలు చేస్తున్నది. ప్రతి చోటా.. అది దేశ రాజధాని ఢిల్లీ కావచ్చు, ఇతర రాష్ట్రాల్లోని రాజధానులు, నగరాలు, పట్టణాల్లో కావచ్చు. ప్రభుత్వాలు ఇలాంటి నిరసనలు తెలపడానికి ఒక ప్రదేశాన్ని కేటాయించడం ఆనవాయితీ అయిపోయింది. మీకేదైనా సమస్య ఉంటే ఫలానాచోట మాత్రం కూర్చొని నిరసన తెల్పడమో, ప్రభుత్వాన్ని నిలదీయడమో చేయాలని నిర్దేశించడమే హాస్యాస్పదంగా ఉంటుంది. గత 50, 60 ఏళ్ళ హైదరాబాద్ నగర చరిత్ర తెలిసినవాళ్ళు ఎవరికైనా




గుర్తుండే ఉంటుంది.. ముఖ్యంగా ఆనాటి రాజకీయ నాయకులకు, పాత్రికేయులకు, సెక్రటేరియట్ గేట్ ఎదురుగానే ప్రస్తుతం లుంబినీ పార్కు ఉన్న ప్రదేశంలో సంవత్సరానికి మూడువందల అరవై ఐదు రోజులూ నిరసన శిబిరాలు ఉండేవి. ఉద్యోగవర్గాలు, కార్మికులు, వామపక్షాలు ఇతర అనేకమంది తమతమ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ప్లకార్డులు చేతబట్టుకుని, బ్యానర్లు ఏర్పాటు చేసి నిరసన దీక్షలు పూనడం సర్వసాధారణంగా కనిపించేది. ఆ తర్వాత కాలంలో అభివృద్ధికి చిహ్నంగా మనం గొప్పలు చెప్పుకునే రోడ్ల విస్తరణ జరిగి సచివాలయం చుట్టూ సుందరీకరణ పేరిట ఈ శిబిరాలన్నిటినీ ఎత్తేసి సచివాలయానికి కనిపించనంత దూరంలో ఎక్కడో ఇందిరాపార్కు వద్ద ధర్నాచౌక్ అని ఒకటి ఏర్పాటు చేశారు. సచివాలయం ఎదురుగా ఈ నిరసనలు జరుగుతున్న కాలంలో సచివాలయంలోకి వెళ్తూ, బయటకు వస్తూ మంత్రులు, అధికారులు.. అలాగే చాలా కొన్ని సందర్భాల్లో ముఖ్యమంత్రులు కూడా ఈ శిబిరాల వద్ద తమ వాహనాలను నిలిపి దిగి వెళ్లి నిరసనకారులను పలకరించి వారితో మాట్లాడి కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించిన సందర్భాలు అనేకం పత్రికలవారికి బాగా గుర్తుంటాయి. అప్పట్లో ఈ నిరసన కార్యక్రమాలను కవర్ చేయడానికి వెళ్ళిన విలేకరులను ఎవరిని అడిగినా చెప్తారు ఈ విషయం. అటువంటిది తర్వాత కాలంలో ఒకసారి ఎన్నికై అధికారంలోకి వచ్చాక ఐదేళ్లపాటు అసలు ఈ నిరసనలు అనేవి వినిపించకూడదు, కనిపించకూడదు అనే ధోరణి రాజకీయ వ్యవస్థలో ప్రబలిపోయిన తర్వాత ఈ నిరసన శిబిరాలు సచివాలయాల ముందునుండి లేదా ఢిల్లీ పార్లమెంటు భవనం సమీపంనుండి కొంత దూరానికి తరలివెళ్లాయి. హైదరాబాద్ లో ఇందిరా పార్క్, బెంగళూరులో ఫ్రీడమ్ పార్క్, ఢిల్లీలో జంతర్ మంతర్ ఇలా అధికార ప్రాంగణాలకు, పాలకులకు కనిపించనంత దూరంగా విసిరిపడేసారు. దాదాపు 13 ఏళ్ళపాటు సుదీర్ఘ పోరాటం జరిపి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి రాగానే ఇందిరా పార్క్ దగ్గర ఉన్న ధర్నాచౌక్‌ను ఎత్తేసి శంషాబాద్ అవతల ఎక్కడికో తరలించిన విషయం అందరికీ తెలిసిందే. ప్రజాస్వామ్యవాదులు చేసిన సుదీర్ఘ పోరాటం తరువాత, న్యాయస్థానాల జోక్యం తరువాతగానీ మళ్ళీ ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్ పునరుద్ధరణ జరగలేదు. పోరాటాలు, ప్రతిఘటనల పునాదుల్లో నుండి పుట్టిన నాయకులు కూడా ఒకసారి అధికారం రుచి చూశాక నిరసన అన్న పదం కూడా వినడానికి ఇష్టపడరు అనడానికి ఇదొక మంచి ఉదాహరణ. ఇప్పటి పరిస్థితి తెలియదుగాని కొన్ని సంవత్సరాల క్రితం వరకు అమెరికాలో ఆ దేశాధ్యక్షుడి అధికారిక నివాసం వైట్ హౌస్ ప్రధానద్వారం ఎదురుగానే రోడ్డుకు అవతల, పలువర్గాలు తమ నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తూ ఉండేవి. ఎప్పుడు చూసినా అక్కడ తమ డిమాండ్లతో కూడిన ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని కూర్చున్నవాళ్లు రోజూ కనిపించేవాళ్లు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యంపట్ల విశ్వా సం, గౌరవంగల ఏ రాజకీయ వ్యవస్థ అయినా శాంతియుత పద్ధతుల్లో జరిగే నిరసనలను అనుమతించాల్సిందే. ఇంకా మాట్లాడితే ఇప్పుడు దేశంలో సమస్యల మీద గళం ఎత్తుతున్న తరం అసలు ఒకరి అనుమతి కోరడం ఏమిటని కూడా ధిక్కార స్వరం వినిపిస్తున్నది. 'నువ్వు చేస్తున్న తప్పులకు నిరసన వ్యక్తం చెయ్యడానికి నిన్నే అనుమతి కోరడం ఏమిటి, సమాచారం తెలుపుతాం, అంతే' అన్నది వారి వాదన. అధికారంలో ఉన్నవారికి అప్రియమైన విషయాలు తెలియకుండా ఉండేందుకు వారిచుట్టూ కొందరు వందిమాగధులు చేరుతూ ఉంటారు. వాళ్ల పని బయట కొంపలు అంటుకుపోతున్నా అంతా సవ్యంగానే ఉందని, ఏలిక పరిపాలన అద్భుతంగా ఉందని నమ్మించడమే. ఆయనను భ్రమల్లో ఉంచడమే. అలాంటి అసత్యాల్ని నమ్మి తర్వాత జరిగిన ఎన్నికల్లో అధికారం కోల్పోయిన రాజకీయపక్షాలు మనకు తెలుసు. నిరసనలు తమ దృష్టికి వస్తేనే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలేవిటో తెలిసి వాటిని పరిష్కరించడానికి, పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రయత్నించేందుకు అధికారంలో ఉన్నవారికి వీలవుతుంది. అలా కాని పక్షంలో అంతా బాగానే ఉందనుకున్నప్పుడు బయట జరిగే నష్టం మళ్ళీ ఎన్నికల ఫలితాలనాడు మాత్రమే తెలుస్తుంది. ప్రస్తుతం దేశంలో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జెన్ జీ వివిధ సమస్యల మీద చేస్తున్న ఆందోళనలో భాగంగా తలపెట్టిన 'లెహరా దో తిరంగా' (త్రివర్ణ పతాకాన్ని ఎగరేద్దాం) అనే పిలుపునిచ్చింది.

# శరన్నవరాత్రుల్లో 9 రూపాల్లో అమ్మవారిని ఎందుకు పూజిస్తారు? ఒక్కో రూపం వెనుక ఉన్న విశిష్టత ఇదే!

ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ప్రారంభం కానున్న దేవి నవరాత్రులు! శక్తి ఆరాధనకు శ్రేష్ఠమైన శరన్నవరాత్రులు! నవదుర్గలుగా తొమ్మిది రూపాల్లో పూజలందుకునే ఆదిశక్తి! అభీష్ట సిద్ధిని కలిగించే నవదుర్గల ఆరాధన



**నవదుర్గల విశిష్టత**
దేవీ నవరాత్రుల్లో ఆది శక్తిని తొమ్మిది రూపాలుగా పూజించటం జరుగుతుంది ఇవే! ఈ స్వరూపాలే నవదుర్గలుగా ప్రసిద్ధి చెందాయి. ఈ తొమ్మిది రూపాలను శ్రద్ధాభక్తులతో పూజిస్తే సకల విజయాలు, సుఖశాంతులు, అష్టైశ్వర్యాలు చేకూరుతాయి. అసలు ఇంతకూ ఎవరీ నవదుర్గలు? ఆ స్వరూపాల విశిష్టత ఏమిటో తెలుసుకుందాం.

**ప్రథమ రూపం – శైలపుత్రి విశిష్టత**
పర్వతరాజైన హిమవంతుని కుమార్తె పార్వతి దేవిని శైలపుత్రి అంటారు. ఈ అమ్మ వారినే గిరిజ అని, హైమవతి అని కూడా పిలుస్తారు! ఈ తల్లి ఒక చేతిలో శూలం మరొక చేతిలో కమలధరించి ఉంటుంది! ఈమె వృషభాన్ని వాహనంగా కలిగి ఉంటుంది. కోరిన కోర్కెలు తీర్చగల తల్లి అయిన శైలపుత్రిని పూజిస్తే స్థైర్యం, ధైర్యం కలుగుతాయని విశ్వాసం.

**ద్వితీయ రూపం– బ్రహ్మచారిణి విశిష్టత**
ఆదిశక్తి ఈ స్వరూపం తపస్సును ఆచరించే రూపం. ఈ అమ్మ వారిని తపశ్చారిణి అని అంటారు! ఈ తల్లి తన కుడి చేతిలో జప మాల, ఎడమ చేతిలో కమండలంతో శ్వేత వస్త్రాలను ధరించి ఉంటుంది! జ్ఞాన దాయిని, మట్టక్ష ప్రసాదిని అయిన బ్రహ్మచారిణి ఆరాధిస్తే జ్ఞానం, ఏకాగ్రత పెరుగుతాయని విశ్వాసం.

**తృతీయ రూపం– చంద్రఘంట విశిష్టత**
ఆదిశక్తి ఈ స్వరూపంలో దర్శనమిచ్చే జగదాంబ సింహ వాహిని. ఈ తల్లి ధనుస్సు, బాణం గద, శూలం, పాశం మొదలగు ఆయుధాలు, పద్మ కమండలం, అభయ, వరద హస్తాలతో పది చేతులలో కలిగి ఉంటుంది. నవరాత్రుల్లో జగదాంబను చంద్రఘంట స్వరూపంలో పూజిస్తే ఆ తల్లి ధైర్యాన్ని వీరత్వాన్ని సకలాభిష్టాలను నెర వేరుస్తుందని విశ్వాసం.చతుర్థ రూపం – కుష్మాండ స్వరూపం విశిష్టతతన మందహాసంతో విశ్వాన్ని సృష్టించిన ఆదిశక్తి స్వరూపమే ఈ కూష్మాండ! గుమ్మడి రూపంలో భూమండలాన్ని కల్పించిన తల్లి ఈ జగదాంబ! ఈ తల్లి తన అమృత హస్తాల్లో చక్రం, గద, ధనుస్సు, బాణం మొదలగు ఆయుధాలను, కమండలం, అమృత కలశం, జపమాల, పద్మంలను ధరించి ఉంటుంది. ఈ కుష్మాండ దేవి తనను ఆరాధించిన భక్తులకు ఆయురారోగ్యాలను ఐశ్వర్యాలను ప్రసాదిస్తుంది.

**పంచమ రూపం – స్కంధమాత విశిష్టత**
శరన్నవరాత్రుల్లో ఆదిశక్తిని స్కందమాత స్వరూపంలో కుమార స్వామి తల్లిగా, సింహవాహినిగా, అష్టభుజ దేవిగా ఆరాధిస్తారు! ఈ తల్లి తనను ఆశ్రయించిన భక్తులకు మోక్షాన్ని, జ్ఞానాన్ని, శాంతి సౌఖ్యాలను ప్రసాదిస్తుంది. ఈ మాతను కొలిస్తే సంతాన సౌభాగ్యం కలుగుతుంది.

**షష్ఠ రూపం – కాత్యాయనీ దేవి విశిష్టత**
ఆదిశక్తి కాత్యాయన మహర్షి తపస్సుకు మెచ్చి ఆయన ఇంట పుత్రికగా జన్మించిందని దేవి భాగవతంలో వివరించి ఉంది. అందుకే ఈ తల్లిని కాత్యాయని అంటారు. త్రిమూర్తుల, సర్వ దేవీ దేవతల శక్తులతో కూడిన మహిషాసుర మర్ధినిగా ప్రసిద్ధం. వీరత్వానికి, ధైర్యానికి ప్రతీక అయిన ఈ తల్లిని పూజిస్తే కష్టాలు, బాధలు తొలగి మనోభీష్టాలు సిద్ధిస్తాయని అంటారు.

**సప్తమ రూపం – కాళరాత్రి విశిష్టత**
దుష్ట శిక్షణకు భయంకరమైన రూపం దాల్చిన దుర్గాదేవి స్వరూపమే కాళరాత్రి! సర్వ దుష్ట భయంకరి శిష్ట అభయంకరి అయిన ఈ తల్లి గాడిద మీద శిరోజాలు విరబోసుకుని ఉంటుంది. తనను ఆశ్రయించిన భక్తులకు ఈమె సర్వదా శుభాలను కలిగిస్తుంది. ఈ తల్లిని పూజిస్తే శత్రు బాధలు తొలగుతాయని విశ్వాసం.

**అష్టమ రూపం – మహాగౌరి విశిష్టత**
ఆదిశక్తి అష్టమ స్వరూపమే మహాగౌరి! ఈమెనే భైరవీ స్వరూపం అని కూడా అంటారు. ఈ తల్లి శ్వేత వర్ణంలో మెరిసిపోతూ ఉంటుంది. తన అమృత హస్తాల్లో దమరుకం, త్రిశూలం, అభయ, వరద ముద్రలతో భక్తులను అనుగ్రహిస్తూ ఉంటుంది. సర్వ మంగళ కారిణి అయిన ఈ తల్లి తనను ఆశ్రయించిన భక్తుల పాపాలను హరించి, సకల కోరికలను నెరవేరుస్తుంది.దుర్గాదేవి ఈ సిద్ధిదాత్రి స్వరూపం అణిమ, గరిమ మొదలైన అష్ట మహా సిద్దులు ప్రసాదిస్తుంది. ఈ తల్లి తన చతుర్భుజాల్లో శంఖ,చక్ర, గదా, పద్మాలను ధరించి, కమలవాసినియై దర్శనమిస్తుంది. సర్వ సిద్ధి ప్రదాయిని అయిన ఈ తల్లి తన భక్తులకు సర్వైశ్వర్యాలను, సర్వాభిష్టాలను ప్రసాదిస్తుంది. దేవి నవరాత్రులలో ఈ తొమ్మిది రూపాలను శ్రద్ధాభక్తులతో పూజిస్తే సకల విజయాలు, జ్ఞానం, సుఖశాంతులు, అష్టైశ్వర్యాలు లభిస్తాయని శాస్త్రవచనం.
ఓం శ్రీ మాత్రేనమః

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న

# సిద్ధిదాత్రి అవతారంలో భ్రమరాంబిక- ఒక్కసారి దర్శించుకుంటే సకల గ్రహదోషాలు మటుమాయం!

దేశవ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రాలలో దేవి నవరాత్రులు వేడుకలు కన్నుల పండుగగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శరన్నవరాత్రులలో తొమ్మిదో రోజు అనగా అక్టోబర్ 19, సోమవారం రోజు ప్రముఖ శక్తి పీఠం శ్రీశైలంలో శ్రీగిరి భ్రమరాంబిక సిద్ధిధాత్రిగా దర్శనమివ్వనున్నారు. అమ్మవారి ఈ సిద్ధిధాత్రి అవతారం వెనుక ఉన్న పురాణగాథ, ఈ అవతార విశిష్టత గురించి విపులంగా తెలుసుకుందాం.



**మోక్షాన్ని ప్రసాదించే సిద్ధిదాత్రి**
దేవీ శరన్నవరాత్రులలో తొమ్మిదవ మరియు ఆఖరి రోజైన మహర్నవమి నాడు శ్రీశైలంలో శ్రీ భ్రమరాంబికను శ్రీ సిద్ధిదాత్రి దేవిగా అలంకరించి పూజిస్తారు. 'సిద్ధి' అంటే ఆధ్యాత్మిక శక్తులు లేదా కోరికలు సిద్ధించడం, 'దాత్రి' అంటే ప్రసాదించేది అని అర్థం. సకల కార్యాలలో విజయాన్ని, మోక్షాన్ని చేకూర్చే పరమపావనమైన అవతారం ఇది. ఈ సందర్భంగా సిద్ధిదాత్రి దేవి ఎవరు? ఆ తల్లి స్వరూపం ఎలా ఉంటుంది? ఈ రోజు అమ్మవారిని ఎలాంటి పూలతో పూజించాలి? అమ్మవారికి ఏ రంగు వస్త్రం సమర్పించాలి? అమ్మవారికి ప్రీతికరమైన నైవేద్యాలు ఏంటి? అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.

సిద్ధిదాత్రి అమ్మవారి స్వరూపం
శరన్నవరాత్రులలో సిద్ధిదాత్రి అమ్మవారు పూర్తిగా వికసించిన కమలపువ్వుపై సింహావా హనంపై ఆసీనురాలై ఉంటుంది. చతుర్భుజాల తో దర్శనమిచ్చే సిద్ధిదాత్రి తన నాలుగు హస్తాలలో చక్రం, శంఖం, గద, తామరపువ్వు ను ధరించి భక్తులకు దర్శనమిస్తుంది. ఈ తల్లి తన భక్తుల జీవితంలో నెలకొన్న చీకటిని తొలగించి వెలుగును ప్రసాదిస్తుందని నమ్ముతారు.

**అష్టసిద్ధుల ప్రదాత**
నవరాత్రుల్లో సిద్ధిదాత్రి అమ్మవారి తొమ్మిదో రూపం. ఈ స్వరూపంలో జగన్మాత అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశిత్వం, వశిత్వం అనే అష్ట సిద్ధులను ప్రసాదిస్తుందని మార్కండేయ పురాణంలో వివరించి ఉంది.

**అర్ధనారీశ్వర తత్వం:**
పురాణాల ప్రకారం, పరమశివుడు సృష్టి కార్యం కోసం పరాశక్తిని ప్రార్థించగా, అమ్మవారు ఆయన ఎడమ భాగం నుంచి సిద్ధిదాత్రిగా ఆవిర్భవించిందని తెలుస్తోంది. అందుకే శివుడికి అర్ధనారీశ్వరుడు అనే పేరు వచ్చింది. శివుడు సైతం ఈమె కృప వలనే సకల సిద్ధులను పొందాడని దేవీ భాగవతం చెబుతోంది.

**గ్రహ దోష నివారణ:**
జ్యోతిష్య శాస్త్రం ప్రకారం, సిద్ధిదాత్రి దేవి కేతు గ్రహానికి అధిపతి అని తెలుస్తోంది. అందుకే శరన్నవరాత్రులలో సిద్ధిధాత్రిని ఆరాధించడం వల్ల జాతకంలోని కేతు గ్రహ దోషాలు తొలగిపోతాయని పురాణాలు చెబుతున్నాయి.

**ఏ రంగు పూలు? ఏ వస్త్రం?**
శరన్నవరాత్రులలో సిద్ధిధాత్రిగా దర్శనమిచ్చే అమ్మవారిని ఈ రోజు గులాబీ పూలతో పూజిచాలి. అమ్మవారికి గులాబీ రంగు వస్త్రాన్ని సమర్పించాలి.

**ఏ నైవేద్యం?**
శరన్నవరాత్రులలో చివరి రోజు సిద్ధిధాత్రిగా అనుగ్రహించే అమ్మవారికి నువ్వుల లడ్డూలు, పాయసం, కట్టె పొంగలి, పులిహోర, కదంబం వంటి ప్రసాదాలు నివేదించడం శుభకరం.
ఏ శ్లోకం పఠించాలి?సిద్ధిదాత్రి పూజలో అమ్మవారి స్తోత్రాన్ని పఠించడం ప్రధానం. ముఖ్యంగా ఈ రోజుఓం దేవి సిద్ధిదాత్రియే నమః సిద్ధ గంధర్వ యక్షాద్యైరసురైరమరైరపి సేవ్యమానా సదా భూయాత్ సిద్ధిదా సిద్ధిదాయినీ॥యా దేవీ సర్వభూతేషు మా సిద్ధిదాత్రీ రూపేణా సంస్థితా!
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః అనే స్తోత్రాన్ని పఠించాలి.

**పూజాఫలం**
నవరాత్రులలో తొమ్మిది రోజుల పాటు నిష్ఠతో పూజలు చేసిన సాధకులు, ఈ ఆఖరి రోజున సిద్ధిదాత్రి దేవిని ఆరాధించడం ద్వారా లౌకిక సుఖాలతో పాటు ఆధ్యాత్మిక ఉన్నతిని, అంతిమంగా మోక్షాన్ని పొందుతారని భక్తుల

# మహా చండీదేవిగా కనకదుర్గమ్మ- అమ్మవారి ఈ ఉగ్రరూపం వెనుక ఉన్న విశేషాలివే!



ఆశ్వయుజ మాసం రాగానే ఇంద్రకీలాద్రి భక్తజనసందోహంతో నిండి పోతుంది. దేవి నవరాత్రులు తొమ్మిది రోజులు అమ్మవారి దర్శనం కోసం భక్తులు దేశవిదేశాల నుంచి తరలి వస్తారు. అమ్మవారిని రోజుకో రూపంలో దర్శించి భక్తులు పులకించి పోతారు. ఈ నేపథ్యంలో దసరా నవరాత్రులలో నాలుగో రోజు అవతార విశేషమైన చండీదేవి అలంకార విశిష్టత గురించి తెలుసుకుందాం.

**చండీదేవిగా కనకదుర్గమ్మ!**
శరన్నవరాత్రి మహోత్సవాల్లో నాలుగో రోజు శ్రీ కనకదుర్గమ్మ శ్రీ మహా చండీదేవిగా దర్శనమిస్తారు. పూర్వం అసుర శక్తి విజృంభించిన సమయంలో అసుర సంహారం కోసం, దేవతల కార్యసిద్ధి, దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం మహాలక్ష్మి, మహాకాళి, మహా సరస్వతి అనే త్రిశక్తి స్వరూపంగా శ్రీ మహా చండీ అమ్మవారు ఆవిర్భవించారు. అనంతరం శ్రీ మహా చండీ దేవి రాక్షసులను దునుమాడి అసుర శక్తి నుంచి దేవతలను రక్షించి అభయమిచ్చారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం జగన్మాత ధరించి ఈ మహా చండీ దేవి అవతార విశిష్టతను తెలుసుకుందాం.

**త్రిశక్తి స్వరూపిణి**
శ్రీ మహా చండీ దేవి అవతారం మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అనే ముగ్గురు అమ్మవార్ల శక్తుల కలయికగా ఆవిర్భవించింది. అందుకే శ్రీ మహా చండీ దేవి స్వరూపానికి త్రిశక్తి స్వరూపిణి అని పేరుంది.

**సర్వ దేవతా స్వరూపం**
శ్రీ మహా చండీదేవిలో అనేక దేవతలు కొలువై ఉన్నారని దేవి భాగవతంలో వివరించి ఉంది. శ్రీ మహా చండీదేవిని ప్రార్థిస్తే సర్వ దేవతలను ప్రార్థించినట్లే అని శాస్త్ర వచనం.

**దుష్ట శిక్షణ– శిష్ట రక్షణ**
రాక్షసులను దునుమాడి దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేసే బాధ్యతను వహించింది. అందుకే ఈ తల్లిని సకల రాక్షస సంహారిణిగా, దుర్గాదేవి అత్యంత శక్తివంతమైన ఉగ్ర రూపంగా భావిస్తారు.

**నీలాచల పర్వతంపై వెలసిన మహా చండీ దేవి**
రాక్షస సంహారం అనంతరం శ్రీ మహా చండీ దేవి హిమాలయ సానువుల్లో నీలాచల పర్వతంపై వెలసినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉత్తరాఖండ్?లోని హరిద్వార్?లో నీలాచల పర్వతంపై వెలసి ఉన్న చండీదేవి ఆలయం అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటిగా విరాజిల్లుతోంది. ఈ క్షేత్రంలో శారదీయ నవరాత్రుల్లో వచ్చే అష్టమి, నవమి రోజుల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయి.పూజా ఫలందేవి నవరాత్రులలో అమ్మవారిని చండీ దేవి అలంకారంలో దర్శించుకుని పూజిస్తే విద్య, కీర్తి, ఐశ్వర్యం ప్రాప్తిస్తాయి. అంతేకాదు శ్రీ మహా చండీ దేవి అనుగ్రహం వలన కీర్తి సంపదలు, లభిస్తాయని, శత్రువులు కూడా విలుగా మారుతారని, భక్తుల సకల సంకల్పాలు నెరవేరి విజయం సిద్ధిస్తుందని విశ్వాసం.

**ఏ రంగు వస్త్రం? ఏ పూలు?**
శరన్నవరాత్రుల్లో నాలుగో రోజు శ్రీ మహా చండీ దేవి అలంకారంలో దర్శనమిచ్చే అమ్మవారికి ఈ రోజు ఎరుపు రంగు లేదా బంగారు రంగు చీరను సమర్పించాలి. ఎర్ర కలువ పూలతో పూజించాలి.

**ఏ నైవేద్యం?**
శ్రీ మహా చండీ దేవికి ఈ రోజు కట్టు పొంగలి, చక్కెర పొంగలి, కదంబం, పులిహోర, లడ్డులు, రవ్వ కేసరి వంటి ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించాలి.

**పఠించాల్సిన గ్రంథాలు**
శరన్నవరాత్రులలో నాలుగో రోజు శ్రీ మహా చండీ దేవి అనుగ్రహం కోసం దుర్గా సప్తశతి, చండీ సప్తశతి, లలితా సహస్రనామ స్తోత్రం, శ్రీదేవి ఖడ్గమాలా స్తోత్రం పఠించడం అత్యంత శుభప్రదం.

**ఈ శ్లోకం పఠించాలి**
యా చండీ మధుకైటభాదిదైత్యదలనీ యా మాహిషోన్మూలినీయా ధూమ్రేక్షణ చండముండమథనీ యా రక్తబీజాశనీ ।
శక్తిః శుంభ నిశుంభ దైత్యదలనీ యా స్మర్యతే యోగిభిఃసా మాం పాతు సరస్వతీ భగవతీ దుర్గా జగన్మంగళా ॥అనే శ్లోకాన్ని పఠించడం వలన శ్రీ మహా చండీ దేవి అనుగ్రహాన్ని పరిపూర్ణంగా పొందవచ్చు. మనం కూడా ఈ దేవి నవరాత్రుల్లో శ్రీ మహా చండీ దేవిని పూజించి దేవి అనుగ్రహాన్ని పొందుదాం.
ఓం శ్రీ మాత్రే నమఃముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నీలాచల పర్వతంపై వెలసిన మహా చండీ దేవి
రాక్షస సంహారం అనంతరం శ్రీ మహా చండీ దేవి హిమాలయ సానువుల్లో నీలాచల పర్వతంపై వెలసినట్లుగా పురాణాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉత్తరాఖండ్?లోని హరిద్వార్?లో నీలాచల పర్వతంపై వెలసి ఉన్న చండీదేవి ఆలయం అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటిగా విరాజిల్లుతోంది. ఈ క్షేత్రంలో శారదీయ నవరాత్రుల్లో వచ్చే అష్టమి, నవమి రోజుల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయి.పూజా ఫలందేవి నవరాత్రులలో అమ్మవారిని చండీ దేవి అలంకారంలో దర్శించుకుని పూజిస్తే విద్య, కీర్తి, ఐశ్వర్యం ప్రాప్తిస్తాయి. అంతేకాదు శ్రీ మహా చండీ దేవి అనుగ్రహం వలన కీర్తి సంపదలు, లభిస్తాయని, శత్రువులు కూడా

# ప్రెగ్నెన్సీలో "ప్రయాణాలు" చేయడం మంచిదేనా? - నిపుణుల సమాధానమిదే!

మాతృత్వం ఓ వరం. అందుకే ప్రతి మహిళ అమ్మ అని పిలిపించుకోవాలని ఆరాటపడు తుంది. ఇక ప్రెగ్నెంట్? అయ్యారని తెలియగానే చాలా జాగ్రత్తలు తీసుకుంటుంటారు. ఈ క్రమంలోనే తమ పనులు తాము చేసుకోవడానికి కూడా వెనకాడుతుంటారు. ఇక కొద్దిమంది అయితే ఎమర్జెన్సీ పరిస్థితుల్లో తప్ప డెలివరీ అయ్యే దాకా ప్రయాణాలు కూడా మానుకుంటారు. ఎందుకంటే తెలిసి తెలియక చేసే పనుల వల్ల కడుపులోని బిడ్డకు ఏదైనా అసౌకర్యం కలుగుతుందేమో అని భయపడుతుంటారు. ఈ క్రమంలోనే అసలు గర్భంతో ఉన్న ప్రయాణాలు చేయవచ్చా? చేస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే వివ రాలు ఈ స్టోరీలో చూద్దాం.ప్రయాణాలు చేయవచ్చా?: గర్భం దాల్చడం అనేది ఆరోగ్య సమస్య కాదని, ఆ సమయంలో శరీరం, ఆరోగ్యం సహకరిస్తే ఎవరికి వారు అన్ని పనులూ చేసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. పైగా ఇలా చేయడం వల్ల మరింత చురుగ్గా ఉండగలుగుతారని వివరిస్తున్నారు. పనులే కాకుండా.. గర్భంతో ఉన్నప్పుడు జర్నీలు కూడా చేయొచ్చని, అయితే అందుకు ముందుగా డాక్టర్ సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇక దీంతో పాటు జర్నీ చేయాలనుకునే గర్భిణులు కొన్ని జాగ్రత్తలు కూడా పాటించడం అన్ని విధాలా శ్రేయస్కం మంటున్నారు. ఇదే విషయాన్ని "సెంటర్స్? ఫర్? డిసీజ్? కంట్రోల్? అండ్? ప్రివెన్షన్" కూడా చెబుతోంది.



**తీసుకోవాల్సిన జాగ్రత్తలివే:**
గర్భం ధరించిన మహిళల్లో వికారం, వాంతులు వంటివి కామన్?. కొద్దిమంది ఈ లక్షణాలు మొదటి మూడు నెలలు ఉంటే, మరికొద్దిమ ందికి కొన్ని నెలల పాటు కొనసాగుతాయి. అయితే ప్రయాణాల్లో ఇలాంటి సమస్యలు లేకుండా ఉండాలంటే సులభంగా జీర్ణమయ్యే పోషక ఆహారాన్ని తక్కువ మొత్తంలో తీసుకోవాల్సి ఉంటుందని వివరిస్తున్నారు. ఇక జర్నీ సమయంలోనూ లైట్? ఫుడ్? తీసుకోవడమే మంచిదని సూచిస్తున్నారు.
ప్రయాణాల సమయంలో ప్రెగ్నెన్సీ రిపోర్టులు, డాక్టర్ ప్రిస్క్రిప్షన్స్, మందులు వంటివన్నీ ఎప్పుడూ వెంటే ఉంచుకోవాలని సలహా ఇస్తున్నారు. తద్వారా ఏదైనా ఎమర్జెన్సీ పరిస్థితి వస్తే వెంటనే అక్కడికి దగ్గర్లోని ఆస్పత్రిని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవచ్చని వివరిస్తున్నారు.జర్నీ చేసేటప్పుడు వాటర్? బాటిల్?ను తమ వెంటే తీసుకోవాలని వివరిస్తున్నారు. వీలు కుదిరినప్పుడు మధ్యమధ్యలో కొబ్బరి నీళ్లు తాగడం కూడా మంచిదంటున్నారు. దీని వల్ల శరీరంలో వాటర్? లెవల్స్? పడిపోకుండా ఉంటాయని, శరీరానికి తక్షణ శక్తి కూడా వస్తుందం టున్నారు.ప్రయాణాల్లో బిగుతైన వస్త్రాలు కాకుండా లూజుగా , కంఫర్ట్?గా ఉండే దుస్తులు వేసుకో వడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. తద్వారా కూర్చున్నా ఇబ్బందిగా అనిపించదని వివరిస్తున్నారు. అలాగే చెప్పుల విషయంలోనూ ఫ్లాట్స్ని ఎంచుకుంటే కంఫర్టబుల్గా నడవడానికి వీలవుతుందని సలహా ఇస్తున్నారు.జర్నీ సమయంలో మధ్యమ ధ్యలో టాయిలెట్స్కి వెళ్లే వారు మరింత అప్రమ త్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయా వాష్రూమ్స్ డోర్స్, నాబ్స్ని తాకినప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కో వడానికి వీలుగా మీ వెంటే ఓ మినీ హ్యాండ్వాష్ బాటిల్ను ఉంచు కోవడం మంచిదంటున్నారు. అలాగే మధ మధ్యలో చేతులు శానిటైజ్ చేసుకోవడమూ ముఖ్యమే అని వివరిస్తున్నారు. ఇక కారులో ప్రయాణాలు చేసే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవడం, మధ్యమధ్యలో ప్రశాంతమైన వాతావరణం ఉన్న ప్రదేశంలో వాహనాన్ని ఆపి కాసేపు రిలాక్స్? అవ్వడం, 5 నిమిషాలు తిరగడం వల్ల ప్రయాణ అలసటను దూరం చేసుకోవచ్చని సూచిస్తున్నారు.
ఈ సమస్యలుంటే ప్రయాణాలు వద్దట!: కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్న గర్భిణులు మాత్రం జర్నీలు చేయకపోవడమే మంచిదని చెబుతు న్నారు.సలహా ఇస్తున్నారు.జర్నీ సమయంలో మధ్యమధ్యలో టాయిలెట్స్కి వెళ్లే వారు మరింత అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిసు న్నారు. ఈ క్రమంలోనే ఆయా వాష్రూమ్స్ డోర్స్, నాబ్స్ని తాకినప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవడానికి వీలుగా మీ వెంటే ఓ మినీ హ్యాండ్వాష్ బాటిల్ను ఉంచుకోవడం మంచిదంటున్నారు. అలాగే మధ్యమధ్యలో చేతులు శానిటైజ్ చేసుకోవడమూ ముఖ్యమే అని వివరిస్తున్నారు. ఈ క్రమంలో గతంలో గర్భస్రావం లేదా ప్రి–మెచ్యూర్మధ్యమధ్యలో చేతులు శానిటైజ్ మధ్యమధ్యలో చేతులు శానిటైజ్ డెలివరీ అయిన వారు, గర్భాశయంలో ఏదైనా సమస్యలున్న వారు, గర్భం దాల్చిన తొలి నెలల్లో రక్తస్రావం లేదా ఇతర సమస్యలెదురైన వారు, లేటు వయసులో గర్భం ధరించడం, కవలలు లేదా ట్రిప్లెట్స్ను మోస్తున్న వారు ప్రయాణాలు చేయకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు.

## ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణే లక్ష్యం

- ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగింపు వరకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలి
- అధికారులందరూ సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి
- జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ




**విజయవాడ: అక్టోబర్ 19,2026 :** గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల 2వ సాధారణ ఎన్నికలు--2026ను ప్రశాంత వాతావరణంలో, పూర్తి పారదర్శకతతో, నిష్పక్షపాతంగా నిర్వహించడమే లక్ష్యంగా అన్ని ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలు, ఓటర్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల 2వ సాధారణ ఎన్నికలు--2026 నిర్వహణ, ఎన్నికల ఏర్పాట్లపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా సోమవారం జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, ఎన్నికల సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు, మున్సిపల్ కమిషనర్లు, జడ్పీ సీఈవోలు, డీపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లు, అధికార యంత్రాంగం నిర్వహించాల్సిన బాధ్యతలు, శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల నియమావళి అమలు, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు. ఎన్నికల నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను పక్కాగా అమలు చేయాలని సూచించారు. సమీక్షా సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. సామాన్య ప్రజలు, ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన భద్రతా ప్రణాళికను అమలు చేయాలని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణలో విధులు నిర్వర్తించే ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పాటిస్తూ, ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడం తోపాటు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల నిర్వహణను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా, అప్పగించిన బాధ్యతలను సకాలంలో సమర్థవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల వ్యయ పరిమితుల పాటింపు, ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి అందే ఫిర్యాదులను నిబంధనల ప్రకారం పరిశీలించి, తగిన చర్యలు తీసుకునేలా వ్యవస్థను అప్రమత్తంగా ఉంచాలని సూచించారు. ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు, ఎన్నికల వ్యయ పరిమితులు, ఇతర ఎన్నికల సంబంధిత ఫిర్యాదులపై ఎన్నికల సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులను ఫోన్ లేదా ఈ-మెయిల్ ద్వారా నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు. సాధారణ పరిశీలకులు నాగ లక్ష్మీ. యస్, ఐఏఎస్., సెల్ నెంబర్. 7680980032, వ్యయ పరిశీలకులు యం.శివ ప్రసాద్, ఐఎఫ్ఎస్ సెల్ నెంబర్. 9866238885, సంప్రదించవచ్చు అన్నారు. అలాగే ఎన్నికల వ్యయ పరిశీలకులు కార్యాలయం విజయవాడ జిల్లా పరిషత్ కార్యాలయం నందు ఏర్పాటు చేయటమైనదని తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణలో గానీ, క్షేత్రస్థాయిలో ఎన్నికల ఏర్పాట్ల సమయంలో గానీ ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు తలెత్తినా వాటిని ఆలస్యం చేయకుండా వెంటనే జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. సమస్యలను సకాలంలో గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించడం ద్వారా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే ప్రతి అంశాన్ని బాధ్యతాయుతంగా పరిష్కరిస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికలకు ప్రజల సహకారం అవసరంఎన్నికల పవిత్రతను కాపాడుతూ ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు, రాజకీయ పార్టీలు, ప్రజలు సమిష్టిగా సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ కోరారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.నాగలక్ష్మి, వ్యయ పరిశీలకులు ఏం.శివప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యాన్ చంద్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## విజయదశమి వేళ శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా జగన్మాత

# దర్శనం వైభవంగా ముగింపు వేడుకలు

- రేపు తెల్లవారుజామున 2:30 గంటల నుంచే భక్తులకు అమ్మవారి దర్శనం -- ప్రణాళిక సిద్ధం చేసిన దేవస్థానం
- ఉదయం 10:30 గంటలకు దసరా ఉత్సవాల మహా పూర్ణాహుతి
- మధ్యాహ్నం 1:00 నుండి 2:00 గంటల మధ్య శ్రీ అమ్మవారిని దర్శించుకోనున్న రాష్ట్ర గవర్నర్ శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్
- సాయంత్రం కృష్ణా నదిలో నయనానందకరంగా హంసవాహన తెప్పోత్సవం -- అనంతరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఊరేగింపు
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఈవో వి.కె. శీనా నాయక్

**ఇంద్రకీలాద్రి 19 అక్టోబర్ 2026:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవోపేతంగా జరుగుతున్న దసరా శరన్నవ రాత్రి మహోత్సవాల ముగింపు రోజైన విజయదశమి పర్వదిన ఏర్పాట్లపై ఆలయ పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ వి. త్రినాథరావు, కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, ఆలయ స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ సోమవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు.

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారు సకల



Sri Durga Malleswara Swamy Varla Devasthanam,
Indrakeeladri, Vijayawada
Dasara-2026 Festival Daily Report (upto 5 PM)

| S.No | Alamkaram | Sri Mahisharasa MadaniDevi | |
|---|---|---|---|
| | Week | Monday (9 th Day) | |
| | Date | 19.10.2026 | |
| | Particulars | TOTAL Tickets | Amount |
| | Darshan, Prasadam, Poojalu & Others | | |
| 1 | Laddu Prasadam Rs.15/- | 6139 | 92,085.00 |
| 2 | Laddu Prasadam Rs.100/--6 laddu pack | 37270 | 37,27,000.00 |
| 3 | Laddu Prasadam Rs.50/-- 3 laddu pack | 3108 | 1,55,400.00 |
| 4 | Publications, Photos & Calendars | | 5,140.00 |
| 5 | Keshakhandam Rs.40/- | 5942 | 2,37,680.00 |
| | TOTAL | | 42,17,305.00 |

Asst Executive officer

భువనాల అధీశ్వరి అయిన శ్రీ రాజరాజేశ్వరీ దేవి దివ్యాలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ప్రతిరోజూ కంటే ముందుగానే ఆలయం తెరవడానికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించామని, తెల్లవారుజామున 2:30 నుండి 3:00 గంటల మధ్య నుంచే భక్తులకు అమ్మవారి దివ్య దర్శనం కల్పించబడుతుందని ఈవో శీనా నాయక్ తెలిపారు. నవరాత్రుల సందర్భంగా యాగశాలలో శాస్త్రోక్తంగా సాగుతున్న హోమ క్రతువులు విజయదశమి నాడు ఉదయం 10:30 గంటలకు నిర్వహించే "మహా పూర్ణాహుతి"తో పరిసమాప్తమవుతాయి. అనంతరం మధ్యాహ్నం వేళ యధావిధిగా అమ్మవారికి మహానివేదన సమర్పించబడుతుంది. రేపు మధ్యాహ్నం 1:00 నుండి 2:00 గంటల మధ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ గౌరవనీయులు శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ గారు ఇంద్రకీలాద్రికి విచ్చేసి శ్రీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 3:45 గంటలకు శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయం నుండి ఆదిదంపతుల నగరోత్సవ ఊరేగింపు ప్రారంభమై కృష్ణా తీరానికి చేరుకుంటుంది. సాయంత్రం 5:30 నుండి 6:30 గంటల మధ్య పవిత్ర కృష్ణా నదీ జలాలలో విద్యుద్దీప శోభితమైన హంసవాహనంపై స్వామి, అమ్మవార్ల నయనానందకరమైన "దివ్య తెప్పోత్సవం" అత్యంత వైభవంగా నిర్వహించబడుతుంది. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ) మాట్లాడుతూ.. సాయంత్రం వేళ ఇంద్రకీలాద్రిపై పంచహారతులు సంప్రదాయబద్ధంగా యధావిధిగా నిర్వహించబడతాయన్నారు. కృష్ణా నదిలో తెప్పోత్సవం వైభవంగా పూర్తయిన పిమ్మట, ప్రాచీన సంప్రదాయాన్ని అనుసరిస్తూ ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు ఊరేగింపుగా తీసుకువెళ్లడం జరుగుతుందని, అక్కడ ప్రత్యేక పూజలు స్వీకరించిన అనంతరం తిరిగి కొండపైకి చేరుకుంటాయని వెల్లడించారు. భక్తులందరూ ఈ ముగింపు వేడుకలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో దర్శించి అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని కోరారు.

## 'ఫ్యూచర్ సిటీ' పోలీస్ కమిషనరేట్‌ను

# ప్రారంభించిన రేవంత్ రెడ్డి

- అమీర్ హుస్సేన్, క్రైమ్ బ్యూరో చీఫ్

తెలంగాణ ప్రభుత్వం హోం శాఖకు చెందిన జీఓ ఎంఎస్ నంబర్ 141 . వీం. చీశీ. 141) ద్వారా డిసెంబర్ 29, 2025న ఈ కమిషనరేట్‌ను ఏర్పాటు చేసింది. అప్‌డేట్: 2026-10-19 12:22 ఫ్యూచర్ సిటీ' పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభించిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం ఇబ్రహీంపట్నంలో 'ఫ్యూచర్ సిటీ' పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభించారు. హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం ఇబ్రహీంపట్నంలో 'ఫ్యూచర్ సిటీ' పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా, వేద మంత్రోచ్చారణల మధ్య 'ఫ్యూచర్ సిటీ' పోలీస్ కమిషనర్ తరుణ్ జోషిని ఆయన కుర్చీలో కూర్చోబెట్టారు. ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీపీ సి.వి. ఆనంద్ మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వం హోం శాఖకు చెందిన జీఓ ఎంఎస్ నంబర్ 141 ద్వారా డిసెంబర్ 29, 2025న ఈ కమిషనరేట్‌ను ఏర్పాటు చేసింది. ఇది శాంతిభద్రతల పరిరక్షణలో ఒక వ్యూహాత్మక పరిణామం. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పట్టణాభివృద్ధి ప్రాజెక్ట్---'ఫ్యూచర్ సిటీ'కి భద్రత కల్పించే లక్ష్యంతో దీనిని ప్రత్యేకంగా రూపొందించారు. హైదరాబాద్, సైబరాబాద్ మరియు రాచకొండ కమిషనరేట్ల పరిధిలోని కొన్ని ప్రాంతాలను వేరు చేసి ఏర్పాటు చేసిన ఈ కమిషనరేట్, ఆధునిక భారతీయ పోలీస్ వ్యవస్థలో ఒక నూతన ఒరవడిని సృష్టిస్తోంది.




కొత్త చట్టాల పరిధిలో దేశంలోనే ఏర్పాటైన మొదటి ప్రధాన కమిషనరేట్లలో ఇది ఒకటి. దీనివల్ల, ఇక్కడి పోలీస్ కార్యకలాపాలు అత్యంత ఆధునికమైన మరియు పౌర-కేంద్రీకృత చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగుతాయి. ఈ ప్రాంతంలో జరుగుతున్న వేగవంతమైన మార్పులకు అనుగుణంగా, ఈ కమిషనరేట్ సువిశాలమైన ప్రాంతంపై తన పరిధిని కలిగి ఉంది. ఇది మొత్తం 4,337.19 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉండి, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు మరియు రెండు పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిని కవర్ చేస్తుంది. 2001 నుండి 48.16 శాతం వృద్ధి రేటును చూసిన, మరియు 2030 నాటికి 25-30 లక్షల జనాభాను కలిగి ఉండే ఒక సమాజానికి ఈ దళం రక్షణ కల్పిస్తోంది. ఈ కమాండ్ మహేశ్వరం, షాద్‌నగర్, మరియు చెవెల్లా అనే మూడు శాంతిభద్రతల జోన్‌లుగా విభజించబడింది. ఇందులో 22 శాంతిభద్రతల పోలీస్ స్టేషన్లు మరియు నాలుగు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. 19,333 ఎకరాల అభివృద్ధి ప్రాంతానికి భద్రతా వెన్నెముకగా, ఫ్యూచర్ సిటీ పోలీసులు ప్రపంచ స్థాయి భద్రతకు కట్టు బడి ఉన్నారు. అందుబాటులో ఉన్న ప్రగతిశీల పోలీసు దళం, మరియు సైబర్ క్రైమ్, మహిళా భద్రత కోసం ప్రత్యేక యూనిట్లతో, ఈ నగరం ఒక ప్రపంచ కేంద్రంగా అభివృద్ధి చెందుతున్నప్పుడు, పౌరులు సురక్షితంగా, భద్రంగా మరియు సాధికారతతో ఉండేలా చూడటానికి కమిషనరేట్ అంకితభావంతో ఉంది.

## చిన్న వయసులోనే ఎముకల బలంపై శ్రద్ధ..

# ఆస్టియోపోరోసిస్ ముప్పును తగ్గించుకోండిలా

ఆస్టియోపోరోసిస్ (ఎముకల సాంద్రత తగ్గి బలహీనపడే వ్యాధి) కారణంగా ఎముకలు బలాన్ని కోల్పోయి, చిన్న దెబ్బలకే విరిగిపోయే ప్రమాదం పెరుగుతుంది. వయసు పెరిగే కొద్దీ ఈ సమస్య వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా మెనోపాజ్ దశ దాటిన మహిళల్లో ఈ ముప్పు అధికంగా కనిపిస్తుంది. అయితే వృద్ధాప్యంలో ఉన్న పురుషులు, కొన్ని ఆరోగ్య సమస్యలతో బాధపడేవారు కూడా ఈ వ్యాధి బారిన పడతారు. ఎక్కువ కాలం మంచానికే పరిమితం కావడం, శారీరక శ్రమ లేకపోవడం, దీర్ఘకాలిక అనారోగ్యాలు, సరైన పోషకాహారం తీసుకోకపోవడం వంటి అంశాలు ఎముకల సాంద్రత తగ్గడానికి కారణమవుతాయి. చిన్న వయసులో జాగ్రత్తలు అవసరం.. వృద్ధాప్యంలో ఎముకల ఆరోగ్యం ఎలా ఉంటుందనేది చిన్న వయసులో మనం తీసుకునే జాగ్రత్తలపైనా ఆధారపడి ఉంటుంది. సాధారణంగా 20 నుంచి 30 ఏళ్ల మధ్య శరీరం గరిష్ఠ ఎముక ద్రవ్యరాశిని అభివృద్ధి చేసుకుంటుంది. ఈ వయసులో శారీరకంగా చురుకుగా ఉండి, క్రమం తప్పకుండా వ్యాయామం చేసేవారిలో ఎముకల బలం మెరుగ్గా ఉంటుంది. వయసు పెరిగేకొద్దీ ఎముకల సాంద్రత క్రమంగా తగ్గినా, చిన్న వయసులో ఏర్పడిన ఈ అదనపు బలం కొంతవరకు రక్షణగా నిలుస్తుంది. ఎముకల ద్రవ్యరాశిని పెంచడంలో, దాన్ని కాపాడుకోవడంలో వ్యాయామం కీలక పాత్ర పోషిస్తుంది. చురుకైన నడక, పరుగెత్తడం, శరీర బరువును ఎముకలు భరించేలా చేసే తగిన శారీరక కార్యకలాపాలు ఎముకల నిర్మాణాన్ని ప్రేరేపిస్తాయి. తక్కువ ప్రభావంతో కూడిన క్రీడలు కూడా ఉపయోగకరంగా ఉంటాయి. బరువులతో చేసే వ్యాయామాలు కండరాల బలాన్ని పెంచడంతోపాటు శరీర సమతుల్యతను మెరుగుపరుస్తాయి. దీనివల్ల వృద్ధాప్యంలో పడిపోవడం, ఎముకలు విరగడం వంటి ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుంది. వ్యాయామం తప్పనిసరి.. ఎముకల సాంద్రత తగ్గిన తర్వాత వ్యాయామం ప్రారంభించడం కంటే, శారీరక శ్రమను చిన్న వయసు నుంచే జీవనశైలిలో భాగం చేసుకోవడం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. యువతలో వ్యాయామ అలవాట్లు భవిష్యత్తులో శరీరంలో ఎంత ఎముక ద్రవ్యరాశి నిల్వ ఉంటుందనే అంశాన్ని ప్రభావితం చేస్తాయి. వృద్ధులు కూడా చురుకుగా ఉండడం ద్వారా ఎముకల క్షీణత వేగాన్ని తగ్గించుకోవడంతోపాటు కదలికల సామర్థ్యాన్ని కాపాడుకోవచ్చు. కాల్షియం అందించడంలో పాలు, పాల ఉత్పత్తులు ఉపయోగపడతాయి. అయితే ఎముకల ఆరోగ్యం కోసం కేవలం పాల ఉత్పత్తులపైనే ఆధారపడడం సరిపోదు. వయసు పెరిగేకొద్దీ జీర్ణవ్యవస్థ సమస్యలు, ఇతర ఆరోగ్య పరిస్థితుల కారణంగా కాల్షియంతోపాటు పలు పోషకాలను శరీరం గ్రహించే సామర్థ్యం తగ్గుతుంది. ఆహారంలో వివిధ రకాల కాల్షియం అధికంగా ఉండే పదార్థాలను చేర్చుకోవాలి. ఎముకలతో సహా తినే చిన్న చేపలు, రాగులు, చిరుధాన్యాలు, బాదం పప్పు కాల్షియం అవసరాలను తీర్చడంలో తోడ్పడతాయి. ఒకే ఆహార పదార్థం లేదా పోషకాహార సప్లిమెంట్‌పై ఆధారపడడం కంటే, విభిన్న పోషకాలు అందించే సమతుల ఆహారం తీసుకోవడం మంచిది. విటమిడి అందేలా చూసుకోవాలి..కాల్షియంను శరీరం గ్రహించేందుకు విటమిన్ డి కూడా అవసరం. విటమిన్ డి స్థాయిలు తక్కువగా ఉన్నప్పుడు కాల్షియం తీసుకోవడం పెంచినంత మాత్రాన ఆశించిన ప్రయోజనం లభించదు. వయసు, ఆహారపు అలవాట్లు, సూర్యరశ్మికి ఎంత సమయం గురవుతున్నారు, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వైద్యులు విటమిన్ డి సప్లిమెంట్లను సూచిస్తారు. ఎముకల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే నివారించదగిన అంశాల్లో ధూమపానం కూడా ఒకటి. దీర్ఘకాలంగా ధూమపానం చేసేవారిలో చిన్న వయసులోనే ఆస్టియోపోరోసిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే ధూమపానం ఎముకల సాధారణ జీవక్రియకు ఆటంకం కలిగించి, ఎముకల సాంద్రత తగ్గడానికి దోహదం చేస్తుంది. ధూమపానం చేసే అలవాటు ఉంటే దాన్ని మానుకోవడం వల్ల ఎముకల ఆరోగ్యంతోపాటు గుండె, ఊపిరితిత్తులు, మొత్తం శరీర ఆరోగ్యానికి ప్రయోజనం కలుగుతుంది. ఎక్కువసేపు కదలకుండా ఉండే అలవాటును కూడా తగ్గించుకోవాలి. ముఖ్యంగా వృద్ధుల్లో ఎక్కువ కాలం మంచానికే పరిమితం కావడం వల్ల ఎముకలు, కండరాల బలం వేగంగా తగ్గే అవకాశం ఉంటుంది. ఎముకలు విరిగే వరకు ఆస్టియోపోరోసిస్ స్పష్టమైన లక్షణాలు కనిపించవు. అందువల్ల ఈ వ్యాధి ముప్పు ఎక్కువగా ఉన్నవారికి ముందస్తు పరీక్షలు కీలకం. మెనోపాజ్ దశ దాటిన మహిళలు, వృద్ధ పురుషులు ముఖ్యంగా ఇతర ప్రమాద కారకాలు ఉన్నప్పుడు ఎముకల సాంద్రత పరీక్ష అవసరమా అనే విషయాన్ని అని పిలుస్తారు. గుర్తించేందుకు పరిగణిస్తారు.



## ఆహారాన్ని ఎక్కువగా తింటూనే బరువును

# తగ్గించుకోవచ్చా.. అది సాధ్యపడుతుందా.. ఎలా.

39 ఏళ్ల వయస్సున్న ముగ్గురు పిల్లల తల్లి, సామాజిక మాధ్యమాల ప్రభావశీలి ఎరిన్ స్టాన్జిక్ తన జీవసంబంధ వయసు 22 ఏళ్లుగా ఉందని వెల్లడించారు. ఆహార నియమాలు, వ్యాయామ పద్ధతులను తరచూ సామాజిక మాధ్యమాల్లో పంచుకునే ఆమె.. అధిక పరిమాణంలో ఆహారం తీసుకుంటూనే తక్కువ కేలరీలు పొందే విధానాన్ని అనుసరించి 9 కిలోలకు పైగా బరువు తగ్గినట్లు తెలిపారు. ఐదుగురు సభ్యులున్న తన కుటుంబానికి అవసరమైన ఆహారాన్ని వారానికి సుమారు 20 రకాల ప్రధాన పదార్థాలతోనే సిద్ధం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆహార విధానాన్ని పాటించడం వల్ల గత 11 నెలలుగా తగ్గిన బరువును కొనసాగించగలుగుతున్నట్లు వివరించారు. ఎలాంటి ఆహారం తీసుకోవాలి..

అధిక పరిమాణం, తక్కువ కేలరీల ఆహార విధానంలో కడుపు నిండేలా ఎక్కువ మోతాదులో ఆహారం తీసుకుంటూనే శరీరానికి అందే కేలరీలను నియంత్రిస్తారు. నీరు, పీచు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, కొవ్వు తక్కువగా ఉండే ప్రోటీన్ పదార్థాలకు ఇందులో ప్రాధాన్యం ఇస్తారు. ఇలాంటి



ఆహారం ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగించి ఆకలి, ఆహారం తినాలనే కోరికలను నియంత్రించడంలో సహాయపడుతుంది. దీంతో భోజన పరిమాణాన్ని బాగా తగ్గించకుండానే బరువు నియంత్రణకు ప్రయత్నించవచ్చు. అయితే, ఆహారంలో పోషక విలువలు సమతుల్యంగా ఉండేలా చూసుకోవడం కూడా అవసరం. ఇవి ముఖ్యం.. ఆహారంలో అరటిపండ్లు, బెర్రీలు, ఉల్లిపాయలు, వెల్లుల్లి, చిలగడదుంపలు, అవకాడోలు, ఆకుకూరలు, క్యాబేజీ కుటుంబానికి చెందిన కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలతో తయారైన చపాతీలు, ఓట్స్, నల్ల బీన్స్, శనగలు, ఎర్ర కందిపప్పు, క్వినోవా, చియా గింజలు, వాల్‌నట్స్, హమ్మస్, సోయా పాలు, టోఫు, టెంపే వంటి పదార్థాలను చేర్చినట్లు తెలిపారు. అలాగే, ప్యాకెట్లలో లభించే శుద్ధి చేసిన ఆహార పదార్థాలను దాదాపుగా పూర్తిగా మానేయాలి. పండ్లు, కూరగాయలు, తక్కువ ప్రాసెసింగ్ చేసిన సహజ ఆహారాలనే ఎక్కువగా తీసుకోవాలి. వీటిలో పీచు, నీటి శాతం అధికంగా ఉండడంతో తక్కువ కేలరీలతోనే కడుపు నిండిన భావన కలుగుతుంది.



## టీమిండియా చీఫ్ సెలెక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజా!

బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. భారత పురుషుల క్రికెట్ జట్టు సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా మాజీ స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటివరకు చీఫ్ సెలెక్టర్‌గా ఉన్న అజిత్ అగార్కర్ స్థానంలో ఓజా వ్యవహరించనున్నారు. మరోవైపు, మాజీ స్పిన్నర్ రమేష్ పవార్‌కు కూడా సెలక్షన్ కమిటీలో చోటు దక్కింది. మరి ఓజా నేతృత్వంలోని కమిటీ టీమిండియా ఎంపికలో ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో చూడాలి.

# పారా ఆసియా క్రీడల్లో భారత్ విజయకేతనం

### రెండు స్వర్ణాలు.. ఒక రజతం కైవసం

### షూటింగ్‌లో మోనా అగర్వాల్‌కు పసిడి..

### అవనీ లేఖరాకు వెండి పతకం

### లాంగ్‌జంప్‌లో నిషాద్ కుమార్ అద్భుత ప్రదర్శన





**ఐచీ, అక్టోబర్ 19:** పారా ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై అద్భుత ప్రతిభను ప్రదర్శిస్తూ దేశానికి కీర్తిప్రతిష్ఠలు తీసుకొస్తున్నారు. సోమవారం జరిగిన పోటీల్లో భారత క్రీడాకారులు రెండు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకాన్ని సాధించి విజయభేరి మోగించారు. మహిళల షూటింగ్‌లో మోనా అగర్వాల్ స్వర్ణ పతకాన్ని గెలుచుకోగా, అవనీ లేఖరా రజత పతకంతో మెరిశారు. మరోవైపు పురుషుల లాంగ్‌జంప్‌లో నిషాద్ కుమార్ అద్భుత ప్రదర్శనతో బంగారు పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు.

**షూటింగ్‌లో భారత క్రీడాకారిణుల ఆధిపత్యం**

మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్–1 విభాగంలో భారత షూటర్లు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఫైనల్ పోటీలో మోనా అగర్వాల్ 250 పాయింట్లు సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. మరో భారత క్రీడాకారిణి అవనీ లేఖరా 249.6 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించారు. ఒకే విభాగంలో భారత క్రీడాకారిణులు తొలి రెండు స్థానాలను దక్కించుకోవడం విశేషంగా నిలిచింది. దక్షిణ కొరియాకు చెందిన లీ యున్రీ కాంస్య పతకాన్ని సాధించారు. మోనా అగర్వాల్ తన అసాధారణ ప్రతిభతో గత పారా ఆసియా క్రీడల రికార్డును అధిగమించడం విశేషం. గతంలో చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన పారా ఆసియా క్రీడల్లో అవనీ లేఖరా నమోదు చేసిన స్కోరును అధిగమిస్తూ మోనా అగ్రస్థానంలో నిలిచారు. ఈ విజయంతో భారత షూటింగ్ జట్టు అంతర్జాతీయ స్థాయిలో తన సామర్థ్యాన్ని మరోసారి చాటుకుంది.

**లాంగ్‌జంప్‌లో నిషాద్ కుమార్‌కు పసిడి**

అథ్లెటిక్స్ విభాగంలోనూ భారత్‌కు మరో స్వర్ణ పతకం లభించింది. పురుషుల టీ47 లాంగ్‌జంప్ పోటీలో రెండుసార్లు పారాలింపిక్స్ రజత పతక విజేత నిషాద్ కుమార్ అద్భుత ప్రదర్శనతో బంగారు పతకాన్ని సాధించాడు. ఈ విభాగంలో తొలిసారిగా పోటీపడుతున్నప్పటికీ ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా తన సత్తాను చాటుకున్నాడు. తన అత్యుత్తమ ప్రదర్శనగా 7.11 మీటర్ల దూరం దూకి ప్రత్యర్థులను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో తన ప్రతిభను నిరూపించుకున్న నిషాద్ కుమార్, కొత్త విభాగంలోనూ పతకాన్ని సాధించడం భారత క్రీడారంగానికి గర్వకారణంగా నిలిచింది. విభిన్న క్రీడా విభాగాల్లో పోటీపడుతూ పతకాలు సాధిస్తున్న భారత పారా క్రీడాకారులు తమ పట్టుదల, కఠోర శ్రమతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

**భారత క్రీడాకారులకు అభినందనలు**

వైకల్యాలను అధిగమించి ప్రపంచస్థాయి పోటీల్లో పాల్గొంటూ అత్యుత్తమ ప్రదర్శనలు చేయడం పారా క్రీడాకారుల అంకితభావానికి నిదర్శనం. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ లక్ష్య సాధన కోసం వారు చేస్తున్న కృషి ఎంతోమందికి స్ఫూర్తినిస్తోంది. షూటింగ్, అథ్లెటిక్స్ విభాగాల్లో భారత క్రీడాకారులు సాధించిన విజయాలు దేశ క్రీడాభిమానుల్లో ఆనందాన్ని నింపాయి. రానున్న పోటీల్లోనూ భారత క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించి దేశ కీర్తిని ఇనుమడింపజేయాలని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## జింబాబ్వేపై భారత మహిళల ఘనవిజయం



### • 2-0తో సిరీస్ కైవసం

**రాయ్‌పూర్:** జింబాబ్వేతో జరిగిన రెండో టీ20లో భారత మహిళల జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2–0తో సొంతం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో షఫాలీ వర్మ 25 బంతుల్లో 55 పరుగులతో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడగా, కెప్టెన్ స్మృతి మంధాన 25 బంతుల్లో 47 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. దీంతో భారత్ కేవలం 8.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. చివరి టీ20లోనూ గెలిచి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భారత జట్టు భావిస్తోంది.

# విమానంలోనూ నిరాడంబరత చాటిన రాహుల్ ద్రవిడ్

### - అభిమానిని ఆప్యాయంగా పలకరించి ఆటోగ్రాఫ్.. సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వీడియో




భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ తన నిరాడంబరతతో మరోసారి అభిమానుల మనసులు గెలుచుకున్నారు. క్రికెట్ మైదానంలో ప్రశాంతతకు, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిన ఆయన.. మైదానం బయట కూడా అదే హుందాతనాన్ని ప్రదర్శించారు. సాధారణ ప్రయాణికుడిలా విమానంలో ప్రయాణిస్తూ ఓ అభిమాని అడిగిన ఆటోగ్రాఫ్‌ను చిరునవ్వుతో అందించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

**విమానంలో ఊహించని ఆనందం**

ముగ్గురు తోబుట్టువులు ఇండిగో విమానంలో ప్రయాణిస్తుండగా, అదే విమానంలో రాహుల్ ద్రవిడ్ ఉండటాన్ని గుర్తించారు. దీంతో వారు ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. వారిలో ఒకరు ధైర్యం చేసి ద్రవిడ్ వద్దకు వెళ్లి ఆటోగ్రాఫ్ కోరగా, ఆయన ఏమాత్రం అసహనం వ్యక్తం చేయకుండా సంతకం చేసి ఇచ్చారు. ఈ అరుదైన సందర్భాన్ని మరో వ్యక్తి తన కెమెరాలో చిత్రీకరించాడు. విమాన ప్రయాణంలో జరిగిన ఈ చిన్న సంఘటన అభిమానులకు మధుర జ్ఞాపకంగా మిగిలింది.

**విమానాశ్రయ బస్సులోనూ అదే నిరాడంబరత**

విమాన ప్రయాణం ముగిసిన తర్వాత విమానాశ్రయంలోని బస్సులో కూడా ద్రవిడ్‌ను ఆ అభిమానులు మరోసారి చూశారు. ఆ సందర్భాన్ని సైతం వీడియోగా చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ వీడియోను చూసిన క్రికెట్ అభిమానులు ద్రవిడ్ సాదాసీదా ప్రవర్తనను ప్రశంసిస్తున్నారు. ప్రముఖ క్రికెటర్ అయినప్పటికీ అభిమానుల పట్ల ఆయన చూపిన ఆదరణ అందరినీ ఆకట్టుకుంటోంది.

**'ఇందిరానగర్ కా గూండా.. నిజ జీవితంలో చాలా మంచివారు'**

ఈ వీడియోకు అభిమానులు పెట్టిన వ్యాఖ్య మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో ఓ ప్రకటనలో ద్రవిడ్ కోపంగా నటిస్తూ చెప్పిన 'ఇందిరానగర్ కా గూండా' అనే సంభాషణ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రాచు ర్యం పొందింది. సాధారణంగా ప్రశాంతంగా కనిపించే ద్రవిడ్ ఆ ప్రకటనలో భిన్నమైన పాత్రలో కనిపిం చడంతో ఆ సంభాషణ అభిమానులకు గుర్తుండి పోయింది. తాజాగా విమానంలో ఆయన అభిమానితో ఆప్యాయంగా వ్యవహరించిన వీడియోకు అదే విషయా న్ని ప్రస్తావిస్తూ వ్యాఖ్యను జోడించారు. ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న తర్వాత పెద్ద సంఖ్యలో వీక్షణలు వచ్చాయి. ద్రవిడ్ ఆటోగ్రాఫ్ ఇచ్చిన తీరు, అభిమానులతో మాట్లాడిన విధానం నెటిజన్లను ఆకట్టు కున్నాయి. మైదానంలోనే కాకుండా సాధారణ జీవిత ంలోనూ తన వ్యక్తిత్వంతో అభిమానుల ప్రేమను పొం దుతున్న రాహుల్ ద్రవిడ్ మరోసారి వార్తల్లో నిలిచారు.

## భువీ రాకతో బుమ్రాకు విశ్రాంతి ఇవ్వాలి



### - మాజీ కోచ్ రవిశాస్త్రి కీలక సూచన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 19**: భారత క్రికెట్ జట్టు పేస్ బౌలింగ్ విభాగంపై మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి కీలక వ్యాఖ్యలు చేశారు. సీనియర్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ జట్టులోకి తిరిగి రావడంతో జస్‌ప్రీత్ బుమ్రాపై పనిభారాన్ని తగ్గించాలని సూచించారు. వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని బుమ్రాను మూడు ఫార్మాట్లలోనూ నిరంతరం ఆడించకూడదని అభిప్రాయపడ్డారు.

**భువీ అనుభవం జట్టుకు బలం**

సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టులోకి తిరిగి వచ్చిన భువనేశ్వర్ కుమార్ అనుభవం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని రవిశాస్త్రి పేర్కొన్నారు. ఐపీఎల్‌లో అతడు చూపిన ప్రదర్శన, బంతిని స్వింగ్ చేయగల సామర్థ్యం న్యూజిలాండ్ పరిస్థితులకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. పరిమిత ఓవర్ల క్రికెట్‌తో పాటు టెస్టుల్లోనూ అతడికి అవకాశాలు కల్పించాలని సూచించారు.

**బుమ్రా పనిభారంపై దృష్టి**

బుమ్రా గాయాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రవిశాస్త్రి అన్నారు. ముఖ్యంగా టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యమిస్తూ, వన్డేలు, టీ20ల్లో అవసరాన్ని బట్టి మాత్రమే ఆడించాలని సూచించారు. న్యూజిలాండ్‌తో జరగనున్న టెస్టు సిరీస్‌లో బుమ్రా సేవలు కీలకమని పేర్కొన్నారు.

**ప్రపంచకప్ సన్నాహకాలకు కీలకం**

న్యూజిలాండ్ పర్యటన భారత జట్టుకు ఎంతో ముఖ్యమైనదని రవిశాస్త్రి అభిప్రాయపడ్డారు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌తో పాటు 2027 వన్డే ప్రపంచకప్ సన్నాహకాలకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని తెలిపారు. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా పిచ్‌ల పరిస్థితుల్లో కొన్ని పోలికలు ఉండే అవకాశం ఉందని, అందువల్ల ఈ పర్యటనలో ఆటగాళ్ల ప్రదర్శన భవిష్యత్ ప్రణాళికలకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

## ఘనంగా ముగిసిన గుర్రపు స్వారీ పోటీలు




### • రాష్ట్ర స్థాయి అశ్వక్రీడల్లో యువ క్రీడాకారుల ప్రతిభాపాటవాలు

**హైదరాబాద్, అక్టోబర్ 19:** హైదరాబాద్‌లోని గండిపేట హైదరాబాద్ పోలో అండ్ రైడింగ్ క్లబ్ వేదికగా నిర్వహించిన రెండో తెలంగాణ రాష్ట్ర స్థాయి గుర్రపు స్వారీ పోటీలు ఘనంగా ముగిశాయి. అక్టోబర్ 16 నుంచి 18 వరకు మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో వివిధ వయో విభాగాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. తెలంగాణ అశ్వక్రీడల సంఘం సహకారంతో నిర్వహించిన ఈ పోటీల్లో గుర్రపు స్వారీ, గుర్రాలతో అడ్డంకులను అధిగమించే పోటీలు సహా పలు విభాగాల్లో క్రీడాకారులు పోటీపడ్డారు.

**విభిన్న విభాగాల్లో పోటీలు**

పోటీల్లో భాగంగా డ్రెస్సాజ్, షో జంపింగ్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పిల్లలు, జూనియర్లు, యువ క్రీడాకారులు, ఓపెన్ విభాగాల్లో పాల్గొని తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ముఖ్యంగా తక్కువ ఎత్తులోని అడ్డంకులను దాటే పోటీలను ప్రారంభస్థాయి క్రీడాకారులకు అందుబాటులో ఉంచడంతో కొత్తగా ఈ క్రీడలోకి అడుగుపెట్టిన వారికి తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభించింది.

**యువ అశ్వక్రీడాకారుల సత్తా**

పోటీల్లో భాగంగా నిర్వహించిన డ్రెస్సాజ్ విభాగంలో సిద్ధార్థ్ దత్తా, గౌతమ్ సంజయ్ సుజనాని తమ ప్రతిభతో ఆకట్టుకున్నారు. పిల్లల విభాగంలో సిద్ధార్థ్ దత్తా విజేతగా నిలవగా, జూనియర్ విభాగంలో గౌతమ్ సంజయ్ సుజనాని అగ్రస్థానాన్ని సాధించారు. షో జంపింగ్ విభాగంలోనూ పలువురు క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. అబ్దుల్ మానన్ ఓపెన్ విభాగంలో విజయం సాధించగా, ఇతర విభాగాల్లోనూ యువ క్రీడాకారులు పతకాలు, బహుమతులు దక్కించుకున్నారు.

**జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులు**

రాష్ట్ర స్థాయి పోటీలకు ముందు అక్టోబర్ 14 నుంచి 16 వరకు ఇదే వేదికపై నిర్వహించిన జాతీయ అర్హత పోటీల్లో 18 మంది క్రీడాకారులు జూనియర్ జాతీయ అశ్వక్రీడల పోటీలకు అర్హత సాధించారు. రెండు రోజుల పాటు జరిగిన ఆ పోటీల్లో మొత్తం 58 ప్రదర్శనలు నమోదయ్యాయి. డ్రెస్సాజ్ విభాగంలో అనెట్ సలోమీ కాస్టిలినో 71.61 శాతం స్కోరుతో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. తెలంగాణలో అశ్వక్రీడలను ప్రోత్సహిం చడం, యువ క్రీడాకారులకు మెరుగైన అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఇటువంటి పోటీలు నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర క్రీడాకారులు జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## వారసుడి సినిమాలో సింహం ఓ మెరుపులా!



యంగ్ డైరెక్టర్ మల్లిడి వశిష్ట దర్శకత్వంలో నందమూరి వారసుడు మోక్షజ్ఞ టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న సంగతి తెలిసిందే. ఎంతో మంది దర్శకుల పేర్లు పరిశీలనలోకి వచ్చినా? చివరికి -బింబిసార- ఫేం వశిష్ట వైపు నందమూరి బాలకృష్ణ మొగ్గు చూపారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నందమూరి అభిమానుల్లో.. సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మోక్షజ్ఞ తొలి సినిమా కావడంతో ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించేందుకు వశిష్ట ప్రత్యేక కసరత్తులు చేస్తున్నారు. కథా చర్చల దగ్గరి నుంచి ప్రతీ విషయంలోనూ బాలయ్య స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. అయితే మోక్షజ్ఞ లాంచ్ పర్ఫెక్ట్‌గా ఉండాలనే ఉద్దేశంతో సినిమాలో బాలకృష్ణ గెస్ట్ అప్పీయరెన్స్ ఇవ్వబోతున్నారనే వార్త ఫిలింనగర్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ గెస్ట్ రోల్ కేవలం సినిమాకు ఒక పవర్ ప్యాక్డ్ టేకాఫ్ లాగా మాత్రమే ఉంటుందని తెలుస్తోంది. 100 సార్లు అడిగితే గానీ.. సాధారణంగా స్టార్ హీరో వారసుడి లాంచ్ సినిమాలో కనిపిస్తే ఆ క్రేజ్ నెక్ట్స్ లెవెల్‌లో ఉంటుంది. అయితే స్క్రీన్ మీద బాలకృష్ణే ఎక్కువ సేపు కనిపిస్తే? అది డెబ్యూ హీరో అయిన మోక్షజ్ఞకు మైనస్‌గా మారుతుందనే జాగ్రత్తను వశిష్ట ముందుగానే ప్లాన్ చేసినట్లు సమాచారం. సీనియర్ హీరో స్థాయికి తగినట్లుగా సినిమా మొత్తం ఉంటే? కొత్త హీరో ఎలివేషన్ తగ్గే ప్రమాదం ఉందని భావించిన దర్శకుడు బాలయ్య పాత్రను కేవలం ఒక మెరుపులా.. సరిగ్గా ఇంట్రడక్షన్ కీలకమైన టేకాఫ్ సన్నివేశాలకే పరిమితం చేయాలని నిర్ణయించుకున్నారట. ఈ గెస్ట్ రోల్ ద్వారా సినిమాకు కావాల్సినంత హైప్ రావడం ఖాయమని.. అదే సమయంలో మోక్షజ్ఞకు పూర్తి స్థాయి హీరోగా ప్రతిభను ప్రదర్శించడానికి తగినంత స్పేస్ దొరుకుతుందని తెలుస్తోంది. నందమూరి అభిమానుల అంచనాలను నిలబెడుతూనే మోక్షజ్ఞ సోలో హీరోగా టాలెంట్‌ను నిరూపించుకోవడానికి ఈ ప్లానింగ్ ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నారుట. నందమూరి నట వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లే బాధ్యత మోక్షజ్ఞ మీద ఉండటంతో ఆయన మేకోవర్, డ్యాన్సులు, యాక్షన్ సీక్వెన్స్‌ల విషయంలో ప్రత్యేక శిక్షణ ఇప్పించినట్లు తెలుస్తోంది. సినిమా ప్రారంభం నుండి ఎంతో పకడ్బందీగా స్క్రిప్ట్ వర్క్ జరుపుకున్న ప్రాజెక్ట్ పై అంచనాలు అంతకంతకు పెరుగుతున్నాయి. బాలయ్య ఇచ్చే ఆ చిన్న మెరుపు సినిమాకు బిగ్గెస్ట్ ఓపెనింగ్స్‌ను తెచ్చిపెట్టడంలో కీలక పాత్ర పోషిస్తుందని..ఆ తర్వాత సినిమాను పూర్తిగా మోక్షజ్ఞ తన భుజాలపై మోస్తారని తెలుస్తోంది.

## నాలుగు రోజుల్లోనే రూ.400 కోట్ల క్లబ్‌లోకి రజనీ..

### ఓవర్సీస్‌లో 'ధురంధర్ 2' రికార్డు బద్దలు!



సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'జైలర్ 2' బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 424.25 కోట్ల వసూళ్లు సాధించింది. దీంతో రూ. 400 కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టింది. మరోవైపు 2026లో భారతీయ సినిమాల్లో ఓవర్సీస్ తొలి రోజు అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఈ క్రమంలో రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2'ను వెనక్కి నెట్టింది.

ఆదివారం ఒక్కరోజే 'జైలర్ 2' భారత్‌లో రూ. 55.85 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. శనివారం వచ్చిన రూ. 47.25 కోట్లతో పోలిస్తే ఆదివారం వసూళ్లు 18.2 శాతం పెరిగాయి. విడుదలైన తొలి రోజు రూ. 59.70 కోట్లు రాబట్టిన ఈ చిత్రం.. రెండో రోజు రూ. 37.10 కోట్లకు పరిమితమైంది. ఆ తర్వాత వారాంతంలో మళ్లీ పుంజుకుంది. ఇప్పటివరకు భారత్‌లో ఈ సినిమా నెట్ వసూళ్లు రూ. 199.90 కోట్లకు చేరాయి. పన్నులతో కలిపిన దేశీయ వసూళ్లు రూ. 234.25 కోట్లు కాగా.. విదేశాల్లో రూ. 190 కోట్లు రాబట్టింది. దీంతో ప్రపంచవ్యాప్త వసూళ్లు రూ. 424.25 కోట్లకు చేరినట్లు ట్రేడ్ అంచనాలు చెబుతున్నాయి. విదేశీ మార్కెట్లో తొలి రోజు వసూళ్లలో 'జైలర్ 2' సుమారు రూ. 57 కోట్లు సాధించింది. 'ధురంధర్ 2' తొలి రోజు రాబట్టిన రూ. 52 కోట్లను అధిగమించింది. ఈ జాబితాలో రామ్‌చరణ్ నటించిన 'పెద్ది' రూ. 28 కోట్లతో మూడో స్థానంలో ఉంది. విజయ్ 'జన నాయగన్' రూ. 27.50 కోట్లు, మలయాళ చిత్రం 'దృశ్యం 3' రూ. 25 కోట్లతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

ఆదివారం వసూళ్లలో తమిళ వెర్షన్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ భాషలో రూ. 39.95 కోట్ల నెట్ వసూళు వచ్చాయి. తెలుగు వెర్షన్ రూ. 9.50 కోట్లు, హిందీ వెర్షన్ రూ. 5.75 కోట్లు, కన్నడ వెర్షన్ రూ. 65 లక్షలు రాబట్టాయి. అన్ని భాషల్లో కలిపి 15,473 ప్రదర్శనలకు సగటున 62 శాతం ఆక్యుపెన్సీ నమోదైంది.

నాలుగు రోజుల్లోనే భారీ వసూళ్లు సాధించిన 'జైలర్ 2'కు ఇప్పుడు అసలు పరీక్ష మొదలుకానుంది. వారాంతపు జోరును వారం మధ్యలోనూ కొనసాగిస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది.



## పండుగ కళ ఉట్టిపడేలా శ్రీలీల వైబ్స్ దసరా వైబ్స్

దసరా వైబ్స్ ఒక రోజు ముందే వచ్చేసాయి. శ్రీలీల తన తాజా ట్రెడిషనల్ లుక్‌తో దసరా వైబ్స్ ని క్రియేట్ చేసింది. సోషల్ మీడియాలో మరోసారి అందరినీ మంత్రముగ్ధులను చేసింది. సంప్రదాయబద్ధమైన దుస్తులలో మెరిసిపోతూ.. పండుగ శోభను.. దసరా నవరాత్రుల కళను పర్ఫెక్ట్‌గా ప్రతి బింబించింది. నదిటిన బొట్టు.. క్లాసిక్ ఆభరణాలు.. రాజసం ఉట్టిపడే స్టైలింగ్‌తో డివైన్ బ్యూటీలా అలరించింది. ఈ ఫోటోలు పోస్ట్ చేసిన కొద్ది నిమిషాల్లోనే కామెంట్ సెక్షన్ అభిమానుల ప్రేమతో, హార్ట్ ఎమోజీలతో నిండిపోయింది. తోటి సినీ ప్రముఖులతో పాటు లక్షలాది మంది ఫ్యాన్స్ -అందాల దేవత-, -ఎథీరియల్ క్వీన్- అంటూ ప్రశంసలు కురిపించారు. నెటిజన్లు తన అందమైన నవ్వుకి, ఆకర్షణీయమైన చూపులకు ఫిదా అవుతూ కామెంట్ల రూపంలో తమ అభిమానాన్ని చాటుకున్నారు. వెస్ట్రన్ వేర్ అయినా.. ట్రెడిషనల్ వేర్ అయినా తనదైన శైలిలో క్యారీ చేయడంలో శ్రీలీల దిట్ట. ఇండియన్ సినీ పరిశ్రమలో అత్యంత వర్సటైల్ ఫ్యాషన్ ఐకాన్లలో ఒకరిగా నిలిచిన ఈ భామ ఈ కొత్త ఫోటోషూట్‌లో ఎంతో సహజమైన ఎక్స్‌ప్రెషన్స్‌తో అలరించింది. క్లాసిక్ డిజైన్స్, మోడర్న్ టచ్‌ను సమన్వయం చేస్తూ ఈ అవుట్‌ఫిట్ ట్రెండింగ్‌గా మారింది. ఈ పండుగ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవ్వడమే కాకుండా శ్రీలీలకున్న స్టార్ పవర్‌ను మరోసారి నిరూపించింది. తన గ్లామర్, ఎనర్జిటిక్ యాక్టింగ్‌తో టాలీవుడ్ – సౌత్‌లో క్రేజీ హీరోయిన్‌గా దూసుకుపోతున్న ఈ బ్యూటీ తన ప్రతి లుక్‌తోనూ...వరుస సినిమాలతోనూ ఫ్యాన్స్ అంచనాలను మరింత పెంచేస్తోంది.

## స్టోరీ రివీల్ చేసిన విశ్వక్ సేన్!



సాధారణంగా ఒక సినిమా తెరకెక్కుతోంది అంటే కచ్చితంగా సినిమా అందరూ చూడాలి. అప్పుడే నిర్మాతకు డబ్బులు వస్తాయి.. అయితే కొంతమంది ఫ్యామిలీ ఆడియన్స్ ను టార్గెట్ గా చేసుకొని సినిమాలు చేస్తూ కోట్లు కొల్లగొడుతుంటే.. మరి కొంతమంది మాస్ ఆడియన్స్ ను దృష్టిలో పెట్టుకొని సినిమాలు చేస్తూ సక్సెస్ అవుతున్నారు. అయితే ఇక్కడ తాను కూడా ఇందుకు అతీతం కాదు అని, తాను ప్రత్యేకించి జెన్జీ యువతను టార్గెట్ గా చేసుకొని సినిమా చేశాను అంటూ స్పష్టంగా వివరణ ఇచ్చారు విశ్వక్ సేన్ .. అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం ఫలక్నుమా దాస్ సినిమా తర్వాత అంతే కసితో కోపంతో తీస్తున్న చిత్రం కల్ట్ అని చెప్పిన విశ్వక్ సేన్.. అసలు ఈ సినిమా ఎవరిని టార్గెట్ గా చేసుకొని చేస్తున్నారు అనే విషయంపై కూడా క్లారిటీ ఇచ్చారు. అసలు విషయంలోకి వెళ్తే.. కథ, స్క్రీన్ ప్లే, డైరెక్టర్, నటుడిగా నటిస్తూ ప్రేక్షకుల ముందుకు రాబోతున్న చిత్రం కల్ట్. ఈ సినిమా ట్రైలర్ ను రీసెంట్ గా విడుదల చేశారు. ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. "జెన్ జీ ను టార్గెట్ గా చేసుకొని తీసిన సినిమా కల్ట్. ఇది ప్రతి ఒక్కరి కోసం తీసిన సినిమా కాదు.. ఈ విషయం నాకు స్పష్టంగా తెలుసుప్రతి ఒక్కరిని క్యాటగరైజ్ చేసుకుని తీసిన సినిమా కాదు. నాకు క్లియర్ విజన్ ఉంది . నేను కచ్చితంగా యువతను, జెన్ జీ ను టార్గెట్ గా చేసుకొని ఈ కల్ట్ సినిమా తెరకెక్కిస్తున్నాను. ముఖ్యంగా ప్రాజెక్టు ఎక్స్, స్క్విడ్ గేమ్ కలిస్తే కల్ట్. ఈ రెండు నా ఫేవరెట్ చిత్రాలు.. ఈ రెండు చిత్రాలను కలిపి తీసిన సినిమానే కల్ట్. గోవాలో ఒక ఇన్సిడెంట్ జరిగినప్పుడు.. నేను చాలా బాధపడ్డాను.. అక్కడ ఇద్దరు తెలుగు వాళ్ళను కొట్టి చంపేశారు. ముఖ్యంగా ఆ అంశం నన్ను మరింతగా ఆలోచింపజేసింది. ఆ తర్వాత కూడా గోవాలో నాన్ లోకల్ వాళ్లను ఎలా ట్రీట్ చేస్తారో చాలామందికి తెలుసు. నేను ఈ క్యారెక్టర్ రాస్తున్నప్పుడు మధ్యలో నాకు ఈ సంఘటన మరింత కలిచి వేసింది. ఈ సినిమాలో నేనొక పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషిస్తున్నాను. హైదరాబాదులో ఒక పోలీసు ఉంటాడు. మధ్యలో ఈ ఇన్సిడెంట్ వచ్చినప్పుడు ఆట మరో లెవెల్ కి వెళ్తుంది. ఈ డిఎస్పి సంకల్ప నాయక్ (విశ్వక్ సేన్) అనే వ్యక్తి హైదరాబాదు నుండి కావాలని గోవా కి పోస్టింగ్ తీసుకొని వెళ్తాడు. నాన్ లోకల్ ను ఎవరైనా కొడితే.. ఈ డిఎస్పి వాళ్ళని కొడుతూ ఉంటాడు. స్టెరాయిడ్స్ తీసుకున్న వ్యక్తి ఎలా ప్రవర్తిస్తాడో అలా.. ఇదే ఈ సినిమా.. అంటూ స్టోరీ కూడా రివీల్ చేశారు విశ్వక్ సేన్. చాలా క్లియర్ గా యువత, జెన్ జీ కోసమే ఈ మూవీ చేశానని, ఆయన క్లారిటీ ఇవ్వడం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇకపోతే ఇంతకు ముందు విడుదల చేసిన టీజర్ లో స్టోరీ గురించి చెబితే.. తాజాగా విడుదల చేసిన ట్రైలర్ లో చూపించిన రక్తపాతం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. ముఖ్యంగా సెన్సార్ హద్దులను మీరుతూ ఆర్.రేటెడ్ మూవీగా టాలీవుడ్ లో తెరకెక్కుతోందంటూ చెబుతున్న ఈ సినిమా అసలు జెన్ జీను ఏ విధంగా ఆకట్టుకుంటుందో చూడాలి.

## తెలంగాణ కోడలిని అంటూ నేషనల్ క్రష్ సగర్వంగా!



పాన్ ఇండియా లో స్టార్ హీరోయిన్‌గా వెలిగిపోతున్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న మరోసారి వినయంతో అభిమానుల హృదయాలను గెలుచుకున్నారు. ప్రస్తుతం వరుసగా సినిమాలతో బిజీగా ఉండే కథానాయికల్లో ఒకరిగా ఉన్నా? సాంప్రదాయాలకు, స్థానిక సంస్కృతికి రష్మిక ఇచ్చే గౌరవం అందరినీ ఆకట్టుకుంటోంది. తాజాగా తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ వేడుకల్లో రష్మిక పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్థానిక తెలంగాణ మహిళలతో కలసి రష్మిక ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ ఆడటం అక్కడ ఉన్న వారందరినీ ఆశ్చర్యానికి.. ఆనందానికి గురిచేసింది. సాంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతూ ఎలాంటి ఆర్భాటాలు లేకుండా సామాన్య మహిళలతో కలిసి పాటలు పాడుతూ అడుగులు వేస్తూ వేడుకలను జరుపుకున్నారు. దేశవ్యాప్తంగా క్రేజ్ ఉన్న ఒక స్టార్ హీరోయిన్ ఇలా వీధిలో అందరితో కలిసిపోవడం, స్థానిక పండుగలో పాలుపంచుకోవడం ఆమెలోని ఎంతో సింపుల్ స్వభావాన్ని ఆవిష్కరించింది. -నేను తెలంగాణ కోడలిని. తెలంగాణ ఇంటి ఆడపడుచునని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడుతున్నాను- అని సంతోషంగా ప్రకటించారు. ఇక్కడి ప్రజలు చూపించే ఆప్యాయత, ప్రేమ తనకు ఎంతో ప్రత్యేకమైనవని, ఈ నేలతో తనకున్న అనుబంధం మాటల్లో చెప్పలేనిదని భావోద్వేగంతో వెల్లడించారు. ఈ మాటలు విన్న తెలంగాణ ప్రజలు, అభిమానులు ఆమెపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. సంస్కారవంతంగా ఉండటం చూసి విజయ్ దేవరకొండ నిజంగా ఎంతో లక్కీ అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. విజయ్ దేవరకొండ కుటుంబంతో.. ఆయన మూలాలతో రష్మికకు ఉన్న అనుబంధం గురించి ఇండస్ట్రీలో ఎప్పటినుంచో ఆసక్తికరమైన చర్చలు ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రష్మిక తెలంగాణ సంస్కృతిని తన సొంత సంస్కృతిగా భావించి ఇంత గౌరవంగా బతుకమ్మ ఆడటం వారి బంధానికి మరింత అందాన్ని తెచ్చిపెట్టింది. ప్రస్తుతం గ్లామర్ ప్రపంచంలో చాలామంది స్టార్లు తమ చుట్టూ ఒక ప్రత్యేకమైన సరిహద్దులను ఏర్పరచుకుని సామాన్యులకు దూరంగా ఉంటారు. కానీ రష్మిక మాత్రం తన వద్దకు వచ్చే అభిమానులతో, సామాన్య ప్రజలతో ఎంతో ఆప్యాయంగా మెలుగుతూ ఉంటారు. పాన్ ఇండియా రేంజ్‌లో భారీ బడ్జెట్ సినిమాలు చేస్తున్నా? భారతీయ మూలాలను మర్చిపోకుండా ఇలా సాంప్రదాయ వేడుకలకు ప్రాధాన్యత ఇవ్వడం రష్మిక ప్రత్యేకతను చాటిచెబుతోంది. మొత్తానికి బతుకమ్మ పండుగ సందర్భంగా రష్మిక చూపించిన ఆప్యాయత, సింప్లిసిటీ తెలంగాణ మహిళల మనసులను దోచుకున్నాయి. తెలంగాణ సాంప్రదాయాన్ని ఇంత గొప్పగా గౌరవిస్తూ తెలంగాణ కోడలిని అని గర్వంగా ప్రకటించిన రష్మికకు స్థానిక ప్రజలు... అభిమానుల నుంచి మద్దతు లభిస్తోంది.